మాటలు
గత వారం నవలలపై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కడప

: fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-8-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 186 పేజీలు: 10+4 వెల: 6.50



చేనేతకు వస్త్రాలపై జిఎస్టీని భరిస్తాం: సిఎం 2లో

ఆధిపత్యం కోసమే అమెరికా సుంకాలు 5లో


## 24 గంటల్లో భారత్‌పై మరిన్ని సుంకాలు



### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

### రష్యా చమురు కొనుగోలుతో భారత్‌పై అమెరికా ఆగ్రహం

**వాషింగ్టన్, ఆగస్టు 5:** భారత్‌పై రానున్న 24 గంటల్లోను అదనపు సుంకాలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీచేసారు. అమెరికాకు వచ్చే భారత్ దిగుమతులపైనే ఈసారి సుంకాలు రెట్టింపుచేస్తామంటూ హెచ్చరించారు. రష్యానుంచి చమురుకొనుగోళ్లను నిలిపివేయలేదని, దీనివల్ల ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ఇప్పటికీ కొనసాగిస్తున్నదంటూ మండిపడ్డారు. అమెరికాకు భారత్ ఎంతమాత్రం మంచి వాణిజ్య భాగస్వామి కాదని, భారత్ మాదేశంతో ఎంతో వ్యాపారంచేసి లాభపడిందని, అయితే అమెరికా భారత్‌తో బిజినెస్ మాత్రం తక్కువగానే ఉందని ఆయన గుర్తుచేసారు. అందువల్లనే తాము 25శాతం సుంకాల విధింపునకు సిద్ధం అయ్యామని అయితే రానున్న 24 గంటల్లో ఈసుంకాలను మరింతగా అంటే గణనీయంగాపెంచాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఇప్పటికీ భారత్ రష్యా చమురును కొనుగోలుచేయడం మానుకోలేదని ఒక ఆంగ్ల టెలివిజన్ ఇంటర్వ్యూలో ప్రకటించారు. ఆగ్నేయాసియా దేశం రష్యానుంచి తక్కువధరలకు ముడిచమురు కొనుగోలుచేసి అధిక లాభాలకు ఇతర దేశాలకు విక్రయిస్తోందని ఆయన ఆరోపించారు. ముడిచమురు విక్రయించి భారత్ అధికలాభాలు గడిస్తోందన్నారు. ఇందుకు ప్రతిగా భారత్‌సైతం ధీటుగా స్పందించింది. అమెరికా,యూరోపియన్ దేశాలు భారత్ రిఫైనరీలనుంచి ఎగుమతులపట్ల విముఖత వ్యక్తంచేయడం కొనసాగుతూనే ఉందన్నారు. ప్రపంచ మార్కెట్ ఫరిస్థితులకు అనుగుణంగా భారత్ ముడిచమురు దిగుమతులు చేసుకుంటుందన్నారు. మమ్మల్ని విమర్శి >>2

# దేశానికే ఆదర్శం పి-4



మంగళవారం సచివాలయంలో పి4పై సమీక్ష జరుపుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

### పేదరిక నిర్మూలనే ప్రభుత్వం అంతిమ లక్ష్యం

### స్వచ్ఛందంగా వచ్చినవారే మార్గదర్శకులు

### అవనిగడ్డ పారిశుధ్య కార్మికురాలు హేమలతను ప్రశంసించిన సిఎం

### చిన్న ఆసరా.. పెద్ద అండ: ముఖ్యమంత్రి

**విజయవాడ, ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** పేదరిక నిర్మూలనకు చేపడుతున్న జీరోపావర్టీ పి4 ఆశయం 2029 నాటికి సాకారం అవుతుందని, ఇదే మొదటి అడుగు అవుతుందని సిఎం చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన పి4 కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. మంగళవారం సచివాలయంలో పి4పై ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 19వ తేదీ నుంచి పి4 అమలు చేయాలని ఈ సమీక్షలో నిర్ణయించారు. సచివాలయంలో నిర్వహించిన ఈ సమీక్షకు సిఎస్ విజయానంద్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పి4 ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కుటుంబరావు, ఆర్థిక, ప్రణాళిక శాఖ అధికారులు హాజరయ్యారు. సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పేదరిక నిర్మూలనలో భాగంగానే పి4 కార్యక్రమాన్ని చేపట్టాం. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యం. సమాజానికి తిరిగి ఇవ్వాలన్నదే ప్రధాన ఉద్దేశం. మార్గదర్శుల నుంచి చిన్న ఆసరా పేదలకు కొండంత అండఅవుతుంది. ఆ స్ఫూర్తితోనే అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన పారిశుధ్య కార్మికురాలు పల్లెకుంట హేమలత మార్గదర్శిగా మారి ఓవృద్ధురాలిని ఆదుకుంటున్నారు. స్పందించే మనస్సు ఉంటే... పేదల్ని ఆదుకునేందుకు మానవత్వం చూపుతూ ముందుకు వస్తారు. డబ్బుతో పాటు.. సాయం చేసే వారు కూడా మార్గదర్శులే. బంగారు కుటంబాలకు కావాల్సింది ఎమోషనల్ బాండింగ్, చేయూత మాత్రమే.

సిఎస్సార్ నిధులతో బిల్ గేట్స్, వేదాంత లాంటి సంస్థలు పనిచేస్తున్నాయి. వీటికి మించి కుటుంబాలను ఆదుకోవటమే లక్ష్యంగా పి4 కార్యక్రమం చేపట్టాం. ప్రజలేఆస్తిగా జీరోపావర్టీ మిషన్ అమలు చేస్తున్నాం"అని సిఎం స్పష్టంచేశారు. మనం చేసే ప్రతిఆలోచన స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. ఒకరికి ఒకరు తోడుగా ఉన్న >>2



మంగళవారం అమరావతిలో పర్యటిస్తున్న మంత్రి నారాయణ

## అమరావతిలో వచ్చే మార్చికి ఉద్యోగులకు 4 వేల ఇళ్లు

### కాలువలు, రిజర్వాయర్ల పనులు వచ్చే అక్టోబర్‌కు పూర్తి: మంత్రి నారాయణ

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** ఎవరెన్ని కుట్రలు చేసినా అమరావతిని మూడేళ్లలో ఖచ్చితంగా పూర్తిచేసి తీరుతామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేసారు. అసలు అమరావతిలో పనులే జరగడం లేదని ఆరోపణలు చేస్తున్న వారు క్షేత్రస్థాయికి వచ్చి చూడాలని సూచించారు. రాజధాని నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు మంత్రి నారాయణ. శాఖమూరు రిజర్వాయర్,కొండవీటి వాగు,గ్రావిటీ కెనాల్‌తో పాటు అనంతవరం పార్కును మంత్రి నారాయణ పరిశీలించారు..ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు మంత్రి.

అమరావతిలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి 2014-19 మధ్యలోనే టెండర్లు పూర్తిచేసి పనులు కూడా ప్రారంభించాం. గత ప్రభుత్వం మూడుముక్కలాటతో మొత్తం నాశనం చేసింది. అసలు రాజధాని ఎక్కడో క్లారిటీ ఇవ్వలేదు. రైతులను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టింది.అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఉన్న టెండర్లు క్లోజ్ చేయడంతో పాటు ఇతర ఆర్థిక అంశాలను కొలిక్కి తీసుకొచ్చి పాత నిర్మాణాలపై ఐఐటీ నిపుణులతో అధ్యయనం చేసి ముందుకెళ్తున్నామన్నారు మంత్రి. ప్రస్తుతం రాజధానిలో అన్ని పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు అధికారులు,ఉద్యోగులకు సంబంధించి 4 వేల ఇళ్ల నిర్మాణం పూర్తిచేస్తామని తెలిపారు. ఇదే సమయంలో రోడ్లు,డ్రైనేజి పనులు కూడా దాదాపు పూర్తికావచ్చినట్లు చెప్పారాయన. అయితే లేఅవుట్ రోడ్ల డిజైన్లు మాత్రం ఈనెలాఖరుకు ఐఐటీ నిపుణులు ఫైనల్ చేస్తారని అన్నారు.

ఇక రాజధానిలో వరద ముంపు నివారణ కొరకు కాలువల డిజైన్లు నెదర్లాండ్స్ అధికారులతో చేయించామన్నారు మంత్రి..రాజధానిలో కొండవీటి వాగు 23.6 కిమీ,పాలవాగు 16.5 కిమీ,గ్రావిటీ కెనాల్ ను 7.843 కిమీలు మొత్తంగా 47.94 కిమీ మేర కాలువలను వెడల్పు చేసి లోతుగా తవ్వుతున్నామన్నారు. వీటితో పాటు శాఖమూరు రిజర్వాయర్ ను 0.03 టిఎంసిల కెపాసిటీతో 50 ఎకరాల్లో కృష్ణాయపాలెం రిజర్వాయర్‌ను 0.1 టిఎంసితో 190 ఎకరాల్లో అలాగే నీరుకొండ రిజర్వాయర్‌ను 0.4 టిఎంసిల కెపాసిటీతో 440 ఎకరాల్లో నిర్మిస్తున్నట్లు మంత్రి చెప్పారు...వర్షాల కారణంగా కాలువల పనులు కొంచెం నెమ్మదిగా సాగుతున్నాయని అన్నారు...2027 అక్టోబర్ లోగా ఆయా పనులు పూర్తిచేయాలని టార్గెట్ పెట్టుకున్నప్పటికీ వచ్చే ఏడాది చివరకు పూర్తిచేసేలా వేగంగా పనులు జరుగుతున్నాయని మంత్రి నారాయణ చెప్పారు.

అమరావతిలో పనులు జరగడంలేదని కొంతమంది ఆరోపణలు చేస్తు >>2



## ఆపరేషన్ 'కుంకీ' విజయవంతం

### అటవీ ఏనుగులను కుంకీలు దారి మళ్లించాయి

### - డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఆపరేషన్ కుంకీ మొదలయ్యిందని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. కుంకీ ఏనుగులు ద్వారా చేపట్టిన తొలి ఆపరేషన్ విజయవంతంగా పూర్తయినట్లు కుంకీ ఏనుగుల తొలి ఆపరేషన్ విజయవంతమైనట్లు పునరుద్ఘాటించారు. పంటల్ని ధ్వంసంచేస్తున్న ఏనుగులను కుంకీలు దారిమళ్లించాయని తెలిపారు. తొలి ఆపరేషన్‌ను విజయవంతం చేసిన అటవీశాఖ అధికారులు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయం మరో ప్రకటన విడుదల చేసింది. ఆపరేషన్ కుంకీ మొదలయ్యింది. కుంకీ ఏనుగుల ద్వారా >>2

## హరిత ఇంధన రాష్ట్రంగా ఏపి

### గ్రీన్‌వర్క్ ఫోర్స్‌కు కేంద్ర బిందువుగా మారుతోంది..

### నేడు విజయవాడలో భారీ సదస్సు



**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రీన్ వర్క్ ఫోర్స్ విప్లవానికి కేంద్ర బిందువుగా మారేందుకు రాష్ట్రం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు రేపు విజయవాడ నోవాటెల్ హోటల్ లో దేశంలోనే అతిపెద్ద రెన్యువబుల్ ఎనర్జీ స్కిల్లింగ్ డ్రైవ్‌ను చేపడుతోంది. దేశ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్‌ను శక్తివంతం చేయడంతో పాటు సౌర, పవన శక్తికి నైపుణ్య హబ్ గా ఎపి అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో ఈ డ్రైవ్‌ను నిర్వహించడం జరుగుతోంది. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో 250కి పైగా పరిశ్రమల ప్రతినిధులు, ముఖ్యమైన అభివృద్ధి భాగస్వాములు హాజరుకానున్నారు. భారతదేశం 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్య లక్ష్యాన్ని సాధించేందుకు వేగంగా అడుగులు వేస్తుండగా.. ఆంధ్రప్రదేశ్ ఈ గ్రీన్ వర్క్ ఫోర్స్ విప్లవానికి కేంద్రబిందువుగా మారనుంది. భారతదేశంలోనే అతిపెద్ద గ్రీన్ >>2

## 25 నుంచి 'స్మార్ట్' రేషన్ కార్డులు

### - మంత్రి నాదెండ్ల



**విశాఖపట్నం ప్రతినిధి, ఆగస్టు 5, ప్రభాత వార్త :** ఈనెల 25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు అందచేస్తామని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహార్ అన్నారు. విశాఖపట్నం కలెక్టరేట్ మీటింగు హాలులో జరుగుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు అవిరళ కృషి చేస్తున్నామని అన్నారు. నెలలో 15 రోజుల పాటు రేషన్ సరుకులు అందజేస్తున్నామని, 65 సంవత్సరాల వయస్సు దాటిన వృద్ధులకు, వికలాంగులకు (ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ వరకు) ఇంటివద్దకే సరకులు అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగ్గా రేషన్ సరకులు అందజేసేందుకే ఎండియు. వాహనాల విషయంలో సుమారు రూ.200 కోట్ల భారం పడినా ముందుకు వెళ్లామని, దీపం పథకం ద్వారా ఫేజ్ 1 కోటి మందికి, ఫేజ్ 2లో 95లక్షల మందికి సబ్సిడీ అందించాం...ఫేజ్ 3లో సాంకేతిక సమ >>2

## వివేకా హత్యపై విచారణ పూర్తి



### సుప్రీంకోర్టుకు వెల్లడించిన సిబిఐ

### ఎంపి అవినాష్ రెడ్డి సహా ఇతర నిందితుల బెయిలు రద్దుపై విచారణ వాయిదా

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించిన విచారణ పూర్తయ్యిందని సిబిఐ మంగళవారం నాడు సుప్రీం కోర్టుకు వెల్లడించింది. ఒకవేళ సుప్రీం కోర్టు ఆదేశిస్తే తదుపరి విచారణను కొనసాగిస్తామని సిబిఐ తరపు న్యాయవాది సుప్రీం ధర్మాసనానికి తెలిపారు. మరోవైపు ఇదే కేసుకు సంబంధించి కడప ఎంపి అవినాష్ రెడ్డిసహా ఇతరనిందితుల బెయిల్‌ను రద్దు చేసేందుకు సంబంధించి వివేకా తనయ సునీతతో పాటు సిబిఐ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ వాయిదా పడింది.




దివంగత సిఎం వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి సోదరుడు మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్యపై సిబిఐ విచారణ ముగిసింది. గత నెల 21వ తేదీన సుప్రీం కోర్టు సిబిఐని మూడు అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించడం తెలిసిందే. దీని తరువాతే కడప ఎంపి అవినాష్ రెడ్డి సహా ఇతర నిందితుల బెయిల్ రద్దు పిటిషన్లపై వి చారణ చేబడతామని పేర్కొనడం విదితమే. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం మేరకు దర్యాప్తుకు సంబంధించిన స్టేటస్ వివరాలను మంగళవారం నాడు సిబిఐ సుప్రీం కోర్టుకు తెలిపింది. వివేకా హత్య కేసులో ఇంకా తదుపరి దర్యాప్తు అవసరమని సిబిఐ భావిస్తుందో? లేదో? సుప్రీం ధర్మాసనం కోరింది. దీంతో పాటు ఎపి ప్రభుత్వం కడప సెషన్స్ కోర్టులో వై.ఎస్ వివేకా తనయ సునీత, ఆమె భర్త >>2



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

## కంటైనర్‌ను ఢీకొన్న కారు

### ముగ్గురు దుర్మరణం

### తవణంపల్లె మండలంలో దుర్ఘటన

**తవణంపల్లె, ఆగస్టు 5 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలోని బెంగుళూరు-తిరుపతి సిక్స్‌లేన్ రోడ్డు తెల్లగుండ్లపల్లె వద్ద రోడ్డు ఆగి వున్న కంటైనర్‌ను కారు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలైన సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానిక ఎస్ఐ చిరంజీవి కథనం మేరకు వివరా >>2

## నేడు మంత్రిమండలి సమావేశం

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం కేబినెట్ సమావేశం జరగనుంది. సచివాలయంలో జరిగే ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నట్టుతెలుస్తోంది. ఈ సమావేశంలో మహిళల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై చర్చించబోతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి అధికారికంగా ప్రభుత్వం రేపు ప్రకటన చేయనుంది. అలాగే పలు సంస్థలకు భూ కేటాయింపులపై కూడా చర్చించనున్నారు. ఇటీవల సిఎం సింగపూర్లో పర్యటించారు. ఈ పర్యటనపైనా చర్చ జరగనుంది.



## 'ఉత్తరా'న జల విలయం! బురద వరదలో కరిగిన 'ధరాలి'

### కొట్టుకుపోయిన ఇళ్లు, హోటళ్లు

### 60 మందికి పైగా మృతి

### ఉత్తరాఖండ్‌లో మరో నాలుగు రోజులు భారీ వర్షాలు

**డెహ్రాడూన్, ఆగస్టు 5:** ఉత్తరాఖండ్‌లోని ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా ఉండే ధరాలి గ్రామం ఆకస్మిక వరదలు, కుంభవృష్టికి కొట్టుకునిపోయింది. సముద్రం మీదపడిందా, అలలు ఒక్కసారిగా చుట్టుముట్టి గ్రామాన్ని తీసుకుపోయాయా అన్నట్లు వరద ఉధృతికి ధరాలి కనుమరుగయిపోయింది. భారీ ఎత్తున ఎగిసిపడిన బురద వరద ధరాలి గ్రామాన్ని కప్పేసింది. ఇపుడు ఆగ్రామం మరుభూమిలా మారిపోయింది. చార్‌ధామ్ యాత్రీకులు ఎక్కువగా ఈగ్రామానికి వస్తుంటారు. యాపిల్స్ ఎక్కువ ఉండే రాష్ట్రంలోని హార్సిల్ లోయ ఈ గ్రామానికి కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. ధరాలి >>2



ప్రధాని మోడీ, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ సమక్షంలో పలు ఒప్పందాలపై సంతకాలు జరిగిన దృశ్యం

# భావనపాడు తీరంలో ముగ్గురు యువకులు గల్లంతు

## గజ ఈతగాళ్లతో గాలిస్తున్న పోలీసులు

**సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 5 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్ర తీరం స్నానానికి దిగిన ముగ్గురు యువకులు మంగళవారం గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరు వజ్రపు కొత్తూరు మండలం పూడి జగన్నాధపురం గ్రామానికి చెందిన తుమ్మల జస్వంత్ (18), మడి వానిపేట గ్రామనికి చెందిన దున్న దుర్యోధన (18)గా గుర్తించారు. మూడో యువకుడు టెక్కలి పట్నం రాయల రాజేష్‌గా గుర్తించారు. ఈ ముగ్గురు యువకులు విజయనగరంలోని ఒక కళాశాలలో డిప్లొమా చదువుతున్నారు. సెలవులకు ఇంటికి వచ్చిన యువకులు భావనపాడు తీరం వచ్చి హార్బరు గట్టు వద్ద సముద్ర స్నానానికి దిగి గల్లంతు అయినట్లు తెలిసింది. ఈ విషయం తెలిసిన వెంటనే నౌపడ ఎస్ ఐ నారాయణ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు గజ ఈత గాళ్ళను పెట్టి గాలింపు చర్యలు చేపట్టారు.




బీహార్‌లో ప్రత్యేక ఓటర్ల సవరణకు నిరసనగా మంగళవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, ప్రియాంక నాయకత్వంలో భారీ ఆదోళన జరిగిన దృశ్యం

# దేశానికే ఆదర్శం పి-4

>> ప్పుడు అనేక సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. మార్గదర్శులు బంగారు కుటుంబాలకు వేసే బాట పేదరికాన్ని నిర్మూలించడమే కాకుండా శక్తివంతమై యువతను సృష్టిస్తుందన్నారు.

**మార్గదర్శుల ఎంపిక స్వచ్ఛందమే**

బంగారు కుటుంబాలను ఆదుకోవటంలో మార్గదర్శుల ఎంపిక పూర్తిగా వాలంటరీగానే జరుగుతోంది. ఎక్కడా ఎవరిపైనా బలవంతం లేదు. మార్గదర్శుల ఎంపికలో ఎక్కడా వ్యతిరేకత రాకూడదు. ఎవరినీ బలవంతం చేయొద్దు. మానవత్వం ఉండే వారే ఇందులో చేరతారు. మంచి కార్యక్రమాలను అడ్డుకునేందుకు కొందరు రాక్షసుల తరహాలో వ్యవహరిస్తారు. ప్రజల మనస్సుల్లో దీనిపై వ్యతిరేకత తెచ్చేందుకు ప్రయత్నిస్తారు. గతంలో జన్మభూమి, శ్రమదానం, నీరుమీరు ఇలా ఏ కార్యక్రమం చేపట్టినా ఇదే విధంగా విమర్శించారు. నేను ఇలాంటివి పట్టించుకోను. కొందరికి ఆర్థిక వనరులు ఉన్నా పేదల్ని ఆదుకోవడానికి మనస్సు రాదు. కొందరికి మనస్సు ఉన్నా సమయం ఉండకపోవచ్చు. ఇలాంటి వారిని గుర్తించండి. పి4 వేదిక ఉందని చెప్పండి. ఆర్థిక అసమానతలు మరింతగా తగ్గాలి. ఇవి పెరిగితే సమాజానికి మంచిది కాదు. ఇవాళ బంగారు కుటుంబంలో సాయం పొందిన వారే రేపు మార్గదర్శి కావచ్చు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అందుకుంటూనే బంగారు కుటుంబాలకు అదనపు సాయం పి4 ద్వారా అందుతుంది. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు, పారిశ్రామిక వేత్తలను కలిసి వారిలో ఆలోచనను రేకెత్తించండి" అని సిఎం సూచించారు.

**ఉద్యమస్ఫూర్తిగా పి4**

ఇప్పటి వరకూ 9,37,913 బంగారు కుటుంబాల ఎంపిక పూర్తి అయింది. 1,03,938 మంది మార్గదర్శులను గుర్తించాం. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల బంగారు కుటుంబాలకున్న అవసరాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాం. 11 ప్రశ్నలతో వివరాలు నమోదుచేసి ఎఐతో విశ్లేషించాం. 31 శాతం మంది ఉద్యోగ అవకాశాలు కల్పిచాలని, 22 శాతం మంది వైద్య చికిత్సలకు సంబంధించి, 9 శాతంమంది తమ చిన్నచిన్న వ్యాపారాలను మరింత పెంచుకోడానికి అవకాశాలు కల్పించాలి. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవటంతో పాటు గ్రామాలు, మండలాల వారీగా దత్తత తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు. అలాగే ఫండ్ ఎ నీడ్ అనే అంశాన్ని కూడా పి4 కార్యక్రమంలో పెట్టాం. ఈ కార్యక్రమం అమలును ప్రతీ మూడు నెలలకు ఓమారు సమీక్షించుకుంటాం. ప్రజాప్రతినిధులు, అధికారులుకూడా ఈకార్యక్రమంలో వాలంటరీగా పాల్గొనవచ్చు. ప్రస్తుతం నేనుకూడా మార్గదర్శిగా పేరు నమోదుచేయించుకుని 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. ఆకుటుంబాల సంక్షేమం కోసం ప్రణాళికా బద్ధంగా వెళ్తాం. ఎన్టీఆర్ ట్రస్ట్‌ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ఉత్తరాఖండ్ వరదల సమయంలో ప్రతిపక్షంలో ఉన్నా తెలుగుప్రజల్ని ఆదుకునేందుకు ముందుకువచ్చాం. బాధితుల్ని తీసుకు వచ్చేందుకు ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేశాం. వారిని ఇళ్లకు చేర్చేందుకు బస్సులు ఏర్పాటు చేశాం. మార్గదర్శుల్లో స్ఫూర్తే బంగారు కుటుంబాలకు ఆసరా" అని ముఖ్యమంత్రి అన్నారు.

# చేనేతకు వస్త్రాలపై జిఎస్టీని భరిస్తాం

## మగ్గాలకు 200, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్..

### రూ. 5 కోట్లతో నేతన్నలకు త్రిఫ్ట్ ఫండ్..

### చేనేత శాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

### జాతీయ చేనేత దినోత్సవం నుంచి నిర్ణయాల అమలు

**విజయవాడ,, ఆగస్టు 5,ప్రభాతవార్త ప్రతినిధి:** చేనేతకు వస్త్రాలపై జిఎస్టీని భరిస్తామని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. చేనేత రంగానికి ఊతమిచ్చేలా, నేతన్నలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. మంగళవారం చేనేత శాఖపై రాష్ట్ర సచివాలయంలో సీఎం సమీక్షించారు. చేనేత కార్మికులను ఏ విధంగా ఆదుకోవాలనే అంశంపై చర్చించారు. వ్యవసాయం తర్వాత చేనేతే అత్యంత కీలకమైన రంగంగా ఉందని.. దీని మీద ఆధారపడిన వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా సిఎం అన్నారు. ఈ మేరకు ఇటీవల జమ్మలమడుగు పర్యటనలో ఓ చేనేత కుటుంబ సభ్యులతో మాట్లాడిన సమయంలో తన దృష్టికి వచ్చిన అంశాలను సమీక్షలో చంద్రబాబు ప్రస్తావించారు. మగ్గాలకు 200 యూనిట్లు.. అలాగే పవర్ లూమ్స్ కు 500 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందివ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు చేపట్టాల్సిన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ విషయంలో ఈ సమీక్షలో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. హ్యాండ్లూమ్ వస్త్రాలపై జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరించేందుకు సిద్ధమైంది. చేనేత వస్త్రాలపై విధిస్తున్న జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే కేంద్రానికి చెల్లించనుంది. చేనేత వస్త్రాలపై జీఎస్టీ విషయంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేలా ఈ సమీక్షలో సీఎం నిర్ణయం తీసుకున్నారు. దీని వల్ల చేనేత రంగం పుంజుకుంటుందని... తక్కువ ధరల్లో చేనేత వస్త్రాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు వివరించారు. దీని వల్ల చేనేత వస్త్రాలకు విక్రయాలు పెరిగి నేతన్నలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. చేనేత కార్మికుల కోసం రూ. 5 కోట్లతో త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఈ నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం నుంచి ఈ నిర్ణయాలను అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో చేనేత శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏపీకి చెందిన చేనేత ఉత్పత్తులకు 10 జాతీయ అవార్డులు వచ్చాయి...వన్ డిస్ట్రిక్..వన్ ప్రొడక్ట్ విభాగంలోనూ మొదటిసారి అవార్డు దక్కించుకుంది. ఈ అవార్డులను సమీక్షకు ముందు సీఎం చంద్రబాబుకు అధికారులు చూపించారు.

# మరో 11 మంది వైద్యులు, నర్సులపై విచారణ

## పర్యవేక్షణా రాహిత్యం, ఆడిట్ రిపోర్టుల పట్ల నిర్లక్ష్యం ప్రధాన ఆరోపణలు..

### మందుల స్టాక్ రిజిస్టర్, రోగులకు భోజన సరఫరాల్లో అవకతవకలు..

### 2020 లో గుడివాడ ఏరియా ఆసుపత్రిలో నిర్వాకాలపై ఎసిబి విచారణ

**విజయవాడ, ఆగస్టు5, ప్రభాతవార్తప్రతినిధి:** బాధ్యతా రాహిత్యం, అవకతవకలకు పాల్పడ్డారన్న అభియోగాలపై మరో 11 మంది వైద్యులు, నర్సులపై తగు క్రమశిక్షణా చర్యలు చేపట్టేందుకు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ విచారణకు ఆదేశించారు. 2020లో గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, నర్సుల నిర్వాకాలపై ఎసిబి (అవినీతి నిరోధక శాఖ) ఇచ్చిన నివేదికను పరిశీలించిన మంత్రి ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. గుడివాడ ప్రభుత్వాఆసుపత్రిలో అక్రమాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎసిబి ఫిబ్రవరి 2020 లో రెండు రోజుల పాటు తనిఖీ నిర్వహించి నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం అప్పటి ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆరుగురు వైద్యులు, పరిపాలనాధికారి (ఏఓ), ఇద్దరు నర్సింగ్ సూపరింటెండెంట్లు, ఫార్మసిస్టులపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

ఎసిబి తనిఖీ చేసిన రెండు రోజుల్లో ఆసుపత్రి నిర్వహణ, పరిశుభ్రత, అంతర్గత ఆడిట్ రిపోర్టులపై తీసుకున్న చర్యలు, రోగులకు భోజన సరఫరా మరియు నాణ్యత మందుల సరఫరా మరియు స్టాకు వివరాలు, నియమాల ప్రకారం వైద్య సిబ్బంది పాటించాల్సిన డ్రెస్ కోడ్, పరిశుభ్రతలకు సంబంధించి లోతైన పరిశీలన చేసి, వైద్య సిబ్బందిని ప్రశ్నించిన మీదట రూపొందించిన నివేదికలో పలు లోపాలను వెల్లడించింది. వివిధ స్థాయిల్లో పర్యవేక్షణా లోపాన్ని ప్రధానంగా ఎసిబి వివరించి, తత్ఫలితంగా ఎదురైన అవకతవకలను వివరించింది. ప్రభుత్వాసుపత్రుల్లో సరైన పర్యవేక్షణ విషయం పై దృష్టి సారిస్తున్న మంత్రి సత్యాకుమార్ యాదవ్ 2020లో ఎసిబి ద్వారా గుడివాడ ప్రభుత్వాఆసుపత్రిలో వెల్లడైన ఈ లోపాన్ని తీవ్రంగా పరిగణించారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించి 2014-18 కాలంలో వచ్చిన అంతర్గత ఆడిట్‌నివేదికలపై తగు చర్యలు తీసుకోకపోవడం పట్ల కూడా మంత్రి స్పందించారు. వ్యవస్థ నిర్వహణ మెరుగు పడేందుకు దోహద పడే ఆడిట్ రిపోర్టుల పట్ల ఉదాసీనతను సహించలేమని మంత్రి అన్నారు. రోగ నిర్ధారణ పరీక్షల కోసం వాడే పలురకాల కిట్లు, గ్లౌసులు వంటగది, పంపు షెడ్డు, ప్లంబర్ రూమ్ ఇతరచోట్ల చెల్లా చెదురుగా పడి ఉండటాన్ని ఏసి బి పర్యవేక్షణా రాహిత్యానికి సాక్ష్యంగా చూపింది.

వాడటానికి వీలుకాని వాహనాన్ని దీర్ఘకాలం పాటు వదిలించుకోకుండా డ్రైవరును వేరే పనులకు వాడుకొని లక్షల మేరకు జీతం చెల్లించడాన్ని ఎసిబి తప్పుపట్టింది. పర్యవేక్షణారాహిత్యం కారణంగా ఆసుపత్రి ప్రాంగణంలో పరిశుభ్రత లోపించడాన్ని ఎసిబి వెల్లడించింది. రోగులకు భోజనం అందించే విషయంలో ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని, భోజన నాణ్యత నాసిరకంగా ఉందని, రోగుల వివరాల్లో తప్పులున్నాయని ఎసిబి వెల్లడించింది. రోగులకు మందుల సరఫరా, స్టాక్ రిజిస్టర్లో వ్యత్యాసాలు, ప్రతిరోజూ రోగులమంచాలపై దుప్పట్లు మార్చకపోవటానికి సంబంధించి ఎసిబి నర్సింగ్ సూపరింటెండెంట్లు, ఫార్మాసిస్టులను బాధ్యులుగా చేసింది.

అనకాపల్లి ప్రభుత్వాసుపత్రిలో 2020లోనే ఎసిబి జరిపిన మరో తనిఖీ దరిమిలా ఇచ్చిన నివేదిక ఆధారంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ గత నెల 27న 22 మంది వైద్యులు, ఇతర సిబ్బందిపై విచారణకు ఆదేశించారు. రెండువారాలలోపే అదే రీతిలో మరో నివేదిక వెల్లడవటం గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వాసుపత్రుల్లో నెలకొన్న బాధ్యతారాహిత్యానికి, అక్రమాలకు అద్దం పట్టిందని మంత్రి వ్యాఖ్యానించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి ప్రభుత్వాసుపత్రుల్లో పర్యవేక్షణ పటిష్టం చేయడంపై దృష్టిపెట్టిన సత్యకుమార్ యాదవ్ ఈ దిశగా పలు సమీక్షలు చేపట్టారు.

# వివేకా హత్యపై విచారణ పూర్తి

>> నర్రెడ్డిపై దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టుపైనా అభిప్రాయం చెప్పాలని సిబిఐని సుప్రీం కోర్టు కోరింది. ఇదే సమయంలో వివేకా హత్య కేసు ట్రయల్, తదుపరి విచారణ ఏకకాలంలో కొనసాగించే అవకాశం వుందా? అన్న విషయంపైనా సిబిఐ అభిప్రాయం చెప్పాలని సుప్రీం కోర్టు కోరింది. వివేకా హత్య కేసులో అన్ని కోణాల్లో విచారణ ముగిసిందని సిబిఐ తరపు న్యాయవాది తెలిపారు. జస్టిస్ ఎంఎం సుందరేషన్ నేతృత్వంలోని ధర్మా సనానికి ఈ మేరకు సిబిఐ స్టేటస్ వివరాలను అందజేసింది. మరోవైపు ఇదే కేసులో కడప ఎంపి అవినాష్ రెడ్డితో పాటు మరికొందరు నిందితులకు గతంలో తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేయగా దీనిని సిబిఐతో పాటు వివేకా తనయ సునీత సుప్రీం కోర్టులో సవాల్ చేయగా దానిపైనా మంగళవారం నాడు సుప్రీం కోర్టులో వాదనలు జరిగాయి. బెయిల్‌పై వున్న వారు సాక్షులను ప్రభావితం చేస్తున్నారని సునీత తరపు న్యాయవాది సి ద్దార్థ లూద్రా సుప్రీం కోర్టుకు తెలిపారు. వివేకా హత్య కేసు దర్యాప్తు అధికారి రాంసింగ్‌తో పాటు సునీత దంపతులపై నమోదైన కేసులో ఎపి సర్కారు దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకే రాంసింగ్‌తో పాటు సునీత దంపతులపై అప్ప ట్లో కేసు నమోదయ్యిందని క్లోజర్ రిపోర్టులో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా చెప్పిందని లూద్రా తెలిపారు. ఈ కేసులో అవినాష్ రెడ్డితో పాటు ఇతర ని ందితుల బెయిల్ రద్దుపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని లూద్రా కోరగా దీనిపై తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి సుప్రీం కోర్టు వాయిదా వే సింది.

# 42 ఎపిపి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

**విజయవాడ,ఆగస్టు5, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎపిపి) పోస్టుల భర్తీకి పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 11 నుంచి సెప్టెంబరు 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఎస్ఎల్‌పిఆర్‌బి.ఎపి.జిఒవి.ఇన్(ఆంగ్లంలో అన్ని చిన్న అక్షరాలతో) వెబ్‌సైట్‌లో ధరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబరు 5న రాతపరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పేపర్-1 (ఆబ్జెక్టివ్),మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకూ పేపర్-2(డిస్క్రిప్టివ్)పరీక్ష ఉంటుంది. ఈ మేరకు పోలీసు నియామక మండలి చైర్మన్ రాజీవ్‌కుమార్ మీనా ఓ ప్రకటన విడుదలచేశారు. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి పూర్తి వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునని తెలిపారు.

# రేషన్ కార్డులు

>> స్యలను అధిగమించి అర్హులందరికీ పథక ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ ప్రజల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని, దీనిపై ఇప్పటికే ఆయా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసామని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. లబ్ధిదారులకు గ్యాస్ రాయితీ జమ కానీ పక్షంలో అధికారుకు హుటాహుటిన చర్యలు తీసుకోవాలి... కాలయాపన చేయకుండా సమస్యను పరిష్కరించాలని అన్నారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిఘా పెంచామని, చట్టంలో మార్పులు కూడా తీసుకొచ్చామని అన్నారు. లీగల్ మెట్రాలజీ డిపార్ట్మెంట్ కార్యకలాపాలను పెంచామన్నారు. గత సీజన్లో రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం సేకరించి రూ.12,000 కోట్లు చెల్లించామని చెప్పారు. ఆర్టిఫిషియల్ సహాయంతో పౌర సరఫరాల శాఖలో డేటా అనాలిసిస్ చేస్తున్నామని, సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నామని అన్నారు. ప్రజలకు మరింత ఉత్తమ రీతిలో సేవలు అందించేందుకు అధికార యంత్రాంగం మనఃస్ఫూర్తిగా భాగస్వామ్యం కావాలని కోరారు.

## వారం - వర్జ్యం

తేది : 06-08-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
ద్వాదశి మ.2.04
మూల మ.12.56
వర్జ్యం : రా.10.56-12.37
దు.ఉ.11.49-12.40
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది.

**వృషభం :** సంఘంలో గౌరవం పెరుగుతుంది. ఆరోగ్య సమస్యలు తీరతాయి.

**మిథునం:** అప్రయత్నంగా అవకాశాలు లభిస్తాయి. సన్నిహితుల నుండి ధనలాభం పొందుతారు.

**కర్కాటకం :** స్థిరాస్తి వివాదాలు ఒక కొలిక్కి వస్తాయి. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**సింహం:** ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి. వైద్య, పారిశ్రామిక రంగాలవారికి అనుకూలమైన కాలం.

**కన్య :** ఋణాలు తీరి ఊరట చెందుతారు. మంచితనంతో అందరినీ ఆకట్టుకుంటారు.

**తుల :** ముఖ్యమైన పనులు సోదరులతో సకాలంలో పూర్తి చేస్తారు. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం:** కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం. గృహం, స్థలాలు కొనుగోలు యత్నాలు సాగిస్తారు.

**ధనుస్సు:** సన్నిహితులనుండి కీలక సమాచారం అందుకుంటారు. షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు

**మకరం:** ఇంటా బయటా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. నూతన ప్రయత్నాలలో విజయంసాధిస్తారు.

**కుంభం:** వివాదాలకు దూరంగా వుండండి. ఉద్యోగులకు ఆకస్మిక బదిలీలు ఉంటాయి.

**మీనం :** జీవితభాగస్వామితో విభేదాలు రాకుండా తగుజాగ్రత్తలు పాటించండం చెప్పదగిన సూచన.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఉద్యోగులకు 4 వేల ఇళ్లు

>> న్నారని.. అమరావతిపై ఎన్ని కుట్రలు పన్నినా మూడేళ్లలో ఖచ్చితంగా పూర్తిచేసి తీరుతామని అన్నారు. బ్లూ గ్రీన్ రాజధానిగా అమరావతి ఉండేలా 30 శాతం పచ్చదనానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కృష్ణా రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ కూడా త్వరలోనే ప్రారంభిస్తామని.. ట్రంక్ రోడ్ల పనులు ఇప్పటికే ప్రారంభం కాగా లేఅవుట్ రోడ్లకు త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో గతంలో పాతిన సరిహద్దు రాళ్లు తొలగిపోయాయని.. తాజాగా ఆయా లేఅవుట్‌లలో మౌలికవసతులు కల్పించే కాంట్రాక్ట్ ఏజెన్సీలు సరిహద్దు రాళ్లను పాతుతాయని తెలిపారు. రాజధానిలో సుమారు 25 వేల మందికి ఈ ఏడాది కౌలు నిధులు జమ చేయాల్సి ఉండగా...నిన్నటి వరకూ రకరకాల కారణాలతో 7 వేల మందికి జమ కాలేదన్నారు. తాజాగా పెండింగ్ లో ఉన్న నిధులు కూడా అకౌంట్లలో జమ అయ్యాయి...అయితే బ్యాంకు అకౌంట్ తప్పుగా ఉండటం, కొంతమంది మరణించడం, మరికొంతమంది భూమి అమ్ముకోవడం వంటి కారణాలతో 900 మందికి నిధులు జమకాలేదన్నారు..అటువంటి అకౌంట్లను మరోసారి పరిశీలిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు...కౌలు నిధులు జమకాని రైతులు వెబ్ సైట్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# భారత్‌పై మరిన్ని సుంకాలు

>> స్తున్న దేశాలన్నీ కూడా ముడిచమురు కొనుగోలులో రష్యాతో కలిసి కొనసాగుతున్నాయని, ఈపరిస్థితుల్లో అమెరికా మాపై ఆంక్షలు ప్రకటించడమేమిటని విదేశాంగశాఖ ప్రకటించింది. యూరోప్ రష్యా వాణిజ్యం అంటే కేవలం ఇంధనం ఒక్కటే కాదని, ఎరువులు, మైనింగ్ ఉత్పత్తులు, రసాయనాలు, ఇనుము ఉక్కు, భారీ యంత్రపరికరాలు, రవాణా సామగ్రి వంటివికూడా ఉన్నాయని భారత్ గుర్తుచేసింది. దేశ శ్రేయస్సును పరిగణలోనికి తీసుకుని అన్ని నిర్ణయాలు తీసుకుంటామన్నారు. యూరోపియన్‌యూనియన్ రష్యాతో గత ఏడాది 78.02బిలియన్ డాలర్ల వాణిజనయంచేసిందని స్పష్టంచేసింది. అలాగే ఎల్ఎన్‌జి అంటే ద్రవరూప గ్యాస్ 16.5 మిలియన్ మెట్రిక్‌టన్నులు దిగుమతిచేసుకున్నదని అన్నారు. గతనెల 31వ తేదీనుంచేభారత్ అమెరికాఅమధ్య అగాధ: పెరుగుతూ వస్తోంది. ట్రంప్ 25శాతం సుంకాలుప్రకటించినప్పటినుంచి ఈ వివాదంపెద్దదవుతూ వస్తోంది. అంతేకాకుండా కొన్ని అస్పష్టమైన, ప్రత్యేక సుంకాలు కూడా అవసరమయితే విధిస్తామని అన్నారు. ఎన్ఎస్ఎ అజిత్‌దోవల్ రష్యాకు ఈ వారంలోనే పర్యటించనున్నారు. అలాగే విదేశాంగమంత్రి ఎస్‌జైశంకర్‌కూడా రష్యాలో పర్యటించేవీలుంది.

# కంటైనర్‌ను ఢీకొన్న కారు

>> లిలావున్నాయి. బెంగుళూరు ఎలక్ట్రానిక్ సిటికి చెందిన శ్రీకాంత్ (35), ఆతని తల్లి లక్ష్మీదేవి( 55), కుమారుడు శ్రియాన్(5) అనే వ్యక్తులు తిరుమల స్వామివారి దర్శనానంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఈనేపథ్యంలో వారు ప్రయాణిస్తున్న కారు తెల్లగుండ్లపల్లె వద్ద ఆగి వున్న కంటైనర్‌ను అతి వేగంగా వెనువైపు నుండి బలంగా ఢీకొంది. దీనితో శ్రీకాంత్, అతని తల్లి లక్ష్మీదేవిలు తీవ్ర గాయాలకు గురై అక్కడిక్కడే మృతి చెందారు. ప్రమాదంతో తీవ్రంగా గాయపడిన శ్రియాన్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక ఎస్ఐ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అలాగే ప్రమాదం వల్ల ట్రాఫిక్ అంతరాయం కలగడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పై చిరంజీవి తెలిపారు. ఇదే ప్రాంతంలో ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు జరగడంతో పదుల సంఖ్యలో వ్యక్తులు మృత్యువాతపడ్డారు.

# హరిత ఇంధన రాష్ట్రంగా ఎపి

>> స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ క్లీన్ ఎనర్జీ ఆర్థిక వ్యవస్థకు మానవ వనరుల కేంద్రంగా ఎదగనుంది. వేలాది మంది యువతకు సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో నైపుణ్య శిక్షణ పునరుత్పాదక ఇంధన నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యువతకు సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో తయారీ నుంచి ఇన్‌స్టలేషన్, ఆపరేషన్స్, నిర్వహణ వరకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. ఇది కేవలం నైపుణ్య శిక్షణ కార్యక్రమం మాత్రమే మాత్రమే కాకుండా క్లీన్ ఎనర్జీ, వాతావరణ మార్పులకు తగ్గ నైపుణ్యాల అభివృద్ధికి, పరిశ్రమల వృద్ధికి దోహదపడే విధంగా రూపొందించడం జరిగింది. 2030కి 160 గిగావాట్ల సోలార్ మరియు విండ్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకొని కార్యాచరణ రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిలో మాత్రమే కాకుండా గ్లోబల్ టాలెంట్ ఎగుమతిదారుగా కూడా నిలవనుంది. ఈ సమావేశంలో మూడు హై ఇంపాక్ట్ ప్యానెల్ డిస్కషన్స్ నిర్వహించనున్నారు. సోలార్, విండ్ పరిశ్రమల దిగ్గజాలు.. పాలసీ మేకర్లు, శిక్షణ సంస్థలతో కలిసి డిమాండ్ ఆధారిత, పరిశ్రమల అవసరాలకు తగ్గ వర్క్ ఫోర్స్ అభివృద్ధికి రోడ్‌మ్యాప్ రూపొందించనున్నారు. అదనంగా ప్రైవేట్ సెక్టార్ గ్రీన్ స్కిల్లింగ్ టాస్క్‌ఫోర్స్‌ను కూడా ప్రారంభించనున్నారు.

# బురద వరదలో కరిగిన 'ధరాలి'

>> సమీపంనుంచే భాగీరథి నది కొనసాగుతుంది. రిషికేశ్‌నుంచి బయలుదేరి చంబా, ఉత్తరకాశీ, హార్సిల్‌మీదుగా ధరాలికి వస్తారు. సముద్ర మట్టానికి సుమారు 2780 మీటర్ల ఎత్తున ఉన్న ఈ గ్రామంనుంచి గంగోత్రి ధామ్‌కేవలం 20 కిలోమీటర్లే. ఈగ్రామంలో భారీ సంఖ్యలో గెస్టుహౌస్‌లు, లాడ్జిలు కూడా ఉన్నాయి. సమీపంలోనే నీలాంగ్ లోయకూడా ఉంది. భారత్ టిబెట్ మధ్య వాణిజ్యం కొనసాగే పాతమార్గం ఇక్కడినుంచే పోతుంది. ధరాలి సమీపంలోని హార్సిల్ లోయలో భారీ విస్తీర్ణంలో యాపిల్ తోటలున్నాయి. చార్‌ధామ్ యాత్రీకులు గంగోత్రికి వెళ్లే సమయంలో ఇక్కడే ఉండేందుకు ఇష్టపడతారు. కేదార్‌తాల్‌ప్రదేశానికి ట్రెక్కింగ్‌కు వెళ్లేవారికి ఈప్రాంతం బేస్‌క్యాంప్‌గా ఉంటుంది. ధరాలీకి సమీపంలోని ఖీర్‌గడ్ నదీపరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలకు నీరునిలిచిపోయింది. ఒక్కసారిగా ఈనీరంతా ధరాలిమార్కెట్‌పై విరుచుకుపడింది. దీనితో ఈగ్రామం కనుమరుగయిపోయింది. ప్రధానిమోడీ, హోంమంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి పుష్కరసింగ్ ధామి మొత్తం అందరూ ఈభారీ ఆకస్మిక దుర్ఘటనకు విస్తుపోయారు. ప్రజలను అప్పటికే సురక్షితప్రాంతాలకు తరలించడంతో పెనుముప్పు తప్పింది. అయినా కూడా 60మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. కాగా ఈ మెరుపువరదల్లో 20 నుంచి 25 హోటళ్లు, హోమ్‌స్టేలు కొట్టుకునిపోయాయి. 12మందికిపైగా శిథిలాలకింద చిక్కుకుని చనిపోయి ఉంటారని గ్రామస్తులు చెపుతున్నారు. భయంతో కేకలు వేస్తూ ఎత్తయిన ప్రాంతాలకు పరుగులుతీసారు. ఈనెల 10వ తేదీవరకూ ఉత్తరాఖండ్‌లోని కొండప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి అంచనావేసింది. పర్యాటకులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని వెల్లడించింది.

# ఆపరేషన్ 'కుంకీ' విజయవంతం

>> చేపట్టిన తొలి ఆపరేషన్ విజయవంతంగా పూర్తయినట్లు డిప్యూటీ సిఎం కార్యాలయ అధికారులు తెలిపారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల పరిధిలోని మొగిలి వద్ద మామిడి తోటలను ధ్వంసం చేస్తున్న అటవీ ఏనుగుల గుంపుని కుంకీలు విజయవంతంగా దారి మళ్లించి అడవిలోకి తరిమికొట్టినట్టు అటవీ శాఖ అధికారులు ఇచ్చిన సమాచారం ద్వారా తెలియవచ్చింది. కృష్ణ, జయంత్, వినాయక అనే కుంకీలు ఈ ఆపరేషన్‌లో పాల్గొని అడవి ఏనుగులను పంటల వైపు రాకుండా అడ్డుకుని తిరిగి అడవిలోకి మళ్లించాయి. ఈ నెల రెండవ తేది రాత్రి నుంచి 4వ తేదిఉదయం వరకు కొనసాగిన ఈ ఆపరేషన్‌లో కర్ణాటక నుంచి తీసుకువచ్చిన కృష్ణ అనే కుంకీ ఏనుగు చాలా చురుకుగా పాల్గొన్నట్టు అటవీ అధికారులు తెలిపారు. మొగిలి ప్రాంతంలో 15 రోజులుగా ఏనుగుల సంచారం ఉన్న సమాచారంతో అధికారులు ఈ ఆపరేషన్ చేపట్టారు.

**ఇదే తొలి అడుగు :**

కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తీసుకువచ్చిన అనంతరం రెండు నెలల శిక్షణ తర్వాత మొదటి ఆపరేషన్ విజయవంతంగా చేపట్టడం ఆనందాన్నిచ్చిందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఏనుగుల సంచారంతో ఇబ్బందులు పడుతున్న సరిహద్దు ప్రాంతాల రైతులు, ప్రజలకు ఈ ఆపరేషన్ భరోసా ఇస్తుందన్నారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏనుగుల గుంపు నుంచి పంటలను, ప్రజల ప్రాణాలు కాపాడే దిశగా ప్రణాళికాబద్ధంగా పని చేస్తుందనడానికి కుంకీలతో చేపట్టిన ఆపరేషన్ తొలి అడుగు అని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న అటవీ అధికారులకు, మావటిలు, కావడిలకు ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. అడిగిన వెంటనే కుంకీ ఏనుగులను రాష్ట్రానికి ఇచ్చి సహకరించిన కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, ఆ రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేలకు మరోసారి కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. తదుపరి ఆపరేషన్ పుంగనూరు అటవీ ప్రాంతంలో చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని పవన్ తెలిపారు.

# అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం


వరి నాట్లు వేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు లక్ష్మీశ

**స్వయంగా వరి నాట్లు వేసిన కలెక్టర్ లక్ష్మీశ**
**పంట సాగుకు అవసరమైన ఎరువులు సిద్ధం**
**విచ్చలవిడిగా ఎరువులు వాడి నేలను నిస్సారం చేయొద్దు**

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నదాతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య మిస్తోందని.. రైతుల క్షేమం, సంక్షేమంతోనే వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారమవుతుందని, ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక సాధికారత సాధించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలో జరిగింది. కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.. రైతు జి.రవీంద్రనాథ్ ఠాగూర్ పొలంలో వరి నాట్లు వేసి.. రైతులు అన్నివిధాలా ఎదిగేందుకు మేమంతా వారి వెనుక ఉన్నామనే భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి గ్రామానికీ ప్రత్యేక సమస్యలు ఉంటాయని.. ఈ నేపథ్యంలో రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే లక్ష్యంతో ప్రతి మంగళ, బుధ వారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాగునీరు, విత్తనాలు, ఎరువులు, సీసీఆర్సీ కార్డులు, పంట రుణాలు.. ఇలా ప్రతి అంశానికి సంబంధించి సైతం వెన్నుదన్నుగా నిలిచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు వివ రించారు. ఎక్కడా ఎరు వుల కొరత లేదని.. బయోమెట్రిక్ ఆధారిత ఆన్‌లైన్ విధానం ద్వారా ఎరువుల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అయితే విచ్చలవిడిగా ఎరువులు వినియోగించవద్దని, తెలిసో తెలియకో అలా వినియోగిస్తే నేల నిస్సారమై, సాగుకు పనికిరాకుండా పోతుందన్నారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది, శాస్త్రవేత్తల సూచనల మేరకు మాత్రమే ఎరువులు, పురుగుమందులు వినియోగించాలని సూచించారు. పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుందని..అదేవిధంగా ప్రకృతి సేద్య విధానాలను కూడా అనుసరించాలని సూచించారు. గుంటుపల్లిలో ప్రధానంగా బీపీటీ 5204, ఎంటీయూ 1318, ఎంటీయూ 1262, పీఎల్ 1100 రకాలు పండిస్తున్నారని.. వరికి సంబంధించి మొదటి దఫా యూరియా గుళికలు వేసి తర్వాత రెండు, మూడు విడతల్లో నానో యూరియాకు ప్రాధాన్యమివ్వాలని.. దీనివల్ల దాదాపు 50 శాతం ఎరువు ఆదా అవడమే కాకుండా సామర్థ్యమూ పెరుగుతోందన్నారు. జిల్లాలో ఇప్పటికే 39 వ్యవసాయ డ్రోన్లు అందించామని, ఇక్కడ కూడా అవసరం మేరకు డ్రోన్లను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమం లక్ష్యంగా హైటెక్ అగ్రికల్చర్, ప్రెసిషన్ అగ్రికల్చర్, మార్కెట్ లింక్డ్ అగ్రికల్చర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు.

సాగు పరంగా ఎలాంటి ఇబ్బంది ఉన్నా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ (91549 70454) అందుబాటులో ఉందని.. కాల్ చేసి సమాచారమిస్తే వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎలాంటి వదంతులు నమ్మొద్దన్నారు. ఎరువులను అధిక ధరలకు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించినా సంబంధీకులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

# అమరావతిలో 230 ఎకరాల్లో కల్చర్ డిస్ట్రిక్ట్

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో నదీ అభిముఖ ప్రాంత (రివర్‌ఫ్రండట్) అభివృద్ధిలో భాగంగా 250 ఎకరాల్లో 'కల్చర్ డిస్ట్రిక్ట్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అమరావతిలో హరిత వనాలు, కాలువలు, తటాకాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ ప్రతిపాదనపై ప్రాథమికంగా చర్చించారు. సింగపూర్‌కు చెందిన సుర్బానా జురాంగ్ రూపొందించిన రాజధాని అమరావతి బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్)లో కృష్ణానదీ తీరంలో కల్చర్ డిస్ట్రిక్ట్‌ను ప్రతిపాదించారు. దానికి మరింత విస్తృత రూపం ఇస్తూ రూపొందించిన ప్రణాళికలను అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కల్చర్ డిస్ట్రిక్ట్ ప్రతిపాదనకు సిఎం ఆమోదముద్ర వేసినట్లు సమాచారం. పూర్తిస్థాయి ప్రణాళికలను త్వరలో సిద్ధం చేస్తారు. రాష్ట్ర చరిత్ర,సంస్కృతి,కళలకు అద్దం పట్టేలా దీన్ని తీర్చిదిద్దాలన్నది ఆలోచనగా ఉంది.కల్చర్ డిస్ట్రిక్ట్‌లో భాగంగా రివర్ ఘాట్,కల్చర్ ప్రొమెనేడ్,లాన్ టెర్రస్,హైస్ట్రీట్, రివర్ మార్కెట్,క్రాఫ్ట్ విలేజ్,సాంస్కృతిక కేంద్ర,కమ్యూనిటీ ప్లాజా,యాంపీ థియేటర్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వేదిక, మల్టీపర్పస్ ప్లే గ్రౌండ్,పిల్లల ఆటపాటల కోసం కిడ్స్ ప్లే ఏరియా,రిబ్బన్ వాక్,సెల్ఫీ కార్నర్స్, వ్యూయింగ్ డెక్‌లు వంటివి ఏర్పాటు చేయబోతున్నారు.

# తిరుమల సమాచారం

## పవిత్ర ప్రతిష్టతో ఉత్సవాలు ఆరంభం



**తిరుమల,ఆగస్ట్ 5 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవారి ఆలయంలో మూడురోజులు నిర్వహించే పవిత్రోత్సవాలు మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి. వైష్ణవ సాంప్రదాయం ప్రకారం జాతశౌచం, మృతశౌచం వంటి సమయాల్లో తెలిసీతెలియకో భక్తులు, ఆలయ సిబ్బందిచేత కలిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎటువంటి భంగం వాటిల్లకుండా జరిపించే ఈ పవిత్రోత్సవాలు మంగళవారం నుండి మొదలయ్యాయి. వైఖానస ఆగమోక్తంగా జరిపించే ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఉదయం శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివారిని సంపంగిప్రాకారంలోని పవిత్రమండపంలోనికి వేంచేపుచేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. వేడుకగా ఉత్సవమూర్తులకు పాలు,పెరుగు, తేనె, చందనం, కొబ్బరిజలం సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. వేదపండితులు వేదసూక్తాలను పఠించారు. సాయంత్రం ఉత్సవమూర్తులు స్వామిఅమ్మవార్లు ఆలయ నాలుగుమాఢవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో స్వామివారికి జరిగే ఆర్జితసేవలు రద్దుయ్యాయి. పవిత్రోత్సవాల్లో తొలిరోజు మధ్యాహ్నం శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామికి పవిత్ర ప్రతిష్ట చేపట్టారు. ఈ సందర్భంగా అష్టదళపాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవలు రద్దయ్యాయి. ఈ కార్యక్రమంలో పెద్దజీయ్యంగారు, చిన్నజీయ్యంగారు. టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ ప్రధానఅర్చకుడు వేణుగోపాలదీక్షితులు, అర్చకులు పాల్గొన్నారు.

## అందరిపై శ్రీవారి ఆశీస్సులుండాలి : ప్రముఖులు



**తిరుమల,ఆగస్ట్ 5ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై కలగాలని ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం సీనియర్ ఐపిఎస్ కుమార్‌విశ్వజిత్ కుటుంబంతో కలసి, సినీనటుడు జయరాం కుటుంబం విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. దేవదేవుని దర్శనంతో అన్నీ శుభాలు కలుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. వీరికి టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రావణపౌర్ణమి రోజున మొగలిచర్ల దత్తాత్రేయ ఆలయంలో చండీహోమం



**తిరుపతి,ఆగస్ట్ 5 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రావణపౌర్ణమి పర్వదినం సందర్భంగా 9వ తేదీ శనివారం నెల్లూరుజిల్లా లింగ సముద్రం మండలం మొగలిచర్లలోని దత్తాత్రేయస్వామి మందిరంలో చండీహోమం నిర్వహిస్తున్నారు. ఈ హోమంలో భక్తులు ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా పాల్గొనవచ్చని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆలయంలో నేరుగా హోమంలో పాల్గొనదలచిన భక్తులు 8వతేదీ నేరుగా ఉదయం 10గంటలకు ఆలయంవద్దకు చేరుకుని పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మొగలిచర్లగ్రామంలో శీతలాదేవి విగ్రహం ప్రతిష్టాపన కార్యక్రమంతో శుక్ర,శనివారాల్లో మొగలిచర్లకు రాకపోకలు నిలుపుదలచేశారన్నారు. మరిన్ని వివరాలకు 9908973699,9182882632 నంబర్లకు సంప్రదించాలని నాగేంద్రప్రసాద్ కోరారు.

## భాకరాపేటలో కుటుంబ కథాచిత్రం షూటింగ్

**యర్రావారిపాళెం,ఆగస్ట్ 5ప్రభాతవార్త:** తిరుపతిజిల్లా చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని భాకరాపేటలో సరికొత్త కుటుంబ కథాచిత్రం షూటింగ్ మొదలైంది. జైచిరంజీవ ఆర్ట్‌క్రియేషన్స్‌పై ప్రొడక్షన్ నంబర్ 3 చిత్రం కోదండరామ ఆలయ ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరిగింది. ముహూర్త సన్నివేశానికి ముఖ్యఅతిథులుగా తిరుపతి ఎస్వీపశువైద్యవిశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ కరుణానిధి క్లాప్‌కొట్టారు. విశ్రాంత బ్యాంకు మేనేజర్ డాక్టర్ జిఎస్ ప్రసాద్ కెమెరా ఆన్‌చేశారు. రవికాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. వాసుదేవరావు నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఎస్వీరంగారావు అవార్డు గ్రహీత రేవు సీతారం, సూర్యకాంతం అవార్డుగ్రహీత సుందరమ్మ, ఈశ్వర్‌సేత, తమ్మిశెట్టి మురళీరాయల్ ప్రదాన పాత్రల్లో నటించనున్నారు. గ్రామీణప్రాంతాల్లో షూటింగ్ జరుపుకోవడం వల్ల ఈ ప్రాంతాలు గురించి ప్రజలకు తెలుస్తుందన్నారు. పర్యాటకంగా అభివృద్ధికి అవకాశం కలుగుతుందని డాక్టర్ కరుణానిధి తెలిపారు.

## మాటేసి.. వెంటాడి.. వేటాడి పిల్లిని పట్టుకోలేని చిరుత

**తిరుమల,ఆగస్ట్ 5 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో స్థానికులు నివాసముంటున్న బాలాజీనగర్ ప్రాంతంలోని గంగమ్మగుడిలో సోమవారం అర్థరాత్రి సంచరించిన పిల్లిని సమీపంలోనే మాటేసి...చెట్టుపక్కన నక్కి దాగిఉన్న చిరుతపులి పట్టుకుని వేటాడేందుకు శతవిధాలా ప్రయత్నించింది. చివరకు సాక్షాత్తు ఆ గంగమ్మతల్లి పిల్లి ప్రాణాలు కాపాడిందనే స్థానికులు మంగళవారం ఉదయం చర్చించుకున్నారు. బాలాజీనగర్ ప్రాంతం వైపు, తిరుమలలో ఇటీవల చిరుతపులుల సంచారం ఉంది. సోమవారం అర్థరాత్రి ఓ చిరుతపులి అడవిలోంచి ఆహారంకోసం అటుగా గంగమ్మగుడి వద్దకు వచ్చింది. అదే సమయంలో ఓ పిల్లి గుడిలో ఉంది. పిల్లిని చూసిన చిరుత మాటేసి వేటాడే ప్రయత్నం చేసింది. చిరుతపులి దాడితో పిల్లి కూడా కొన్ని సెకన్లు పోరాడి తప్పించుకుంది. అక్కడ నుండి పరుగులుతీసింది. దీనికి సంబంధించిన గుడి పక్కన ఉన్న సిసికెమెరాల్లో ఈ సంఘటన దృశ్యాలు రికార్డయ్యాయి. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి,గంగమ్మతల్లి పిల్లి ప్రాణాలు కాపాడారనేది స్థానికుల విశ్వాసం. చిరుత అక్కడ నుండి అడవిలోకి వెళ్ళింది. చిరుతపుల్లి గంగమ్మగుడి వరకు రావడంతో స్థానికులు, భక్తులు భయపడుతున్నారు. అటవీశాఖ అదికారులు చిరుతను పట్టివేయడానికి బోన్లు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

## పుష్కరిణి మరమ్మతు పనులు వేగవంతం

**తిరుమల,ఆగస్ట్ 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో దేవదేవుని ఆలయానికి ఉత్తరం వైపు ఉన్న పవిత్రపుష్కరిణి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ముందు జోరుగా సాగుతున్నాయి.పుష్కరిణిని నెలరోజులు మూసివేసి మరమ్మతులు, శుద్ధి పనులు చేపడుతున్నారు. సాధారణంగా ప్రతి ఏడాది ఏడుకొండల స్వామి బ్రహ్మోత్సవాలకు ముందు నెలరోజులు పాటు పుష్కరిణి మూసివేసి నీటిని పూర్తిగా తొలగిస్తారు. పుష్కరిణిలోపల ఉన్న పైపులైన్ల మరమ్మతులు, పుష్కరిణి సివిల్ పనులు చేపడతారు. ఈ ఏడాది సెప్టెంబర్ 23నవెంకన్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలుకానున్నాయి. అంతకంటే ముందే పుష్కరిణి మరమ్మతులు, శుద్ధి చేసే పనులు చేపడుతున్నారు. ఈ పనులు వేగవంతంగా ,పారదర్శకంగా చేసేలా టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ విభాగం అధికారులకు సూచించారు. 20వతేదీ వరకునెలరోజుల పాటుపూర్తిగా స్వామివారి పుష్కరిణి మూసివేశారు. నెలరోజులు పుష్కరిణి హారతి ఉండదు. భక్తులను కూడా అనుమతించరు. భక్తులకు స్నానాలకోసం వరాహస్వామి ఆలయం సమీపంలోనే స్నానఘట్టాలు,నీటికొళాయిలు ఏర్పాటు చేయడంతో సాఫీగా భక్తులు స్నానాలాచరిస్తున్నారు. కొన్నివేల పుణ్యతీర్థాలు కలిసే గోవిందుని పుష్కరిణిలో సాదారణంగా నీరు నిల్వవుండే అవకాశం లేదు. పుష్కరిణిలో నీటిని ప్రతిరోజూ నిరంతరాయంగా శుద్ధిచేసి తిరిగి వినియోగించేందుకు అత్యుత్తమ రీసైక్లింగ్ వ్యవస్థ అందుబాటులో ఉంది. నిరంతరాయంగా కొంత శాతం నీటిని శుద్ధిచేసి తిరిగి వినియోగిస్తారు. పుష్కరిణి మరమ్మతుల్లో భాగంగా మొదటి పదిరోజులు నీటిని తొలగించారు. ఆ తరువాత పదిరోజులు మరమ్మతులు ఏవైనా ఉంటే చేపట్టేందుకు సిద్ధమయ్యారు. చివరి పదిరోజులు పుష్కరిణిలో నీటిని నింపిపూర్తిగా సిద్ధం చేస్తారు. పుష్కరిణిలో నీటి పిహెచ్ విలువ 7 ఉండేలా చూస్తారు.

# నన్‌లపై దాడులకు నిరసనగా విజయవాడలో క్రైస్తవ సంఘాల ఆందోళన

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి** క్రైస్తవులపై దాడులను ఆపాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో తెలుగు చర్చెస్ ఆఫ్ ఫెడరేషన్ ఆందళనలు నిర్వహిస్తోంది.అందులో భాగంగా నగరంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. గత వారం విజయవాడలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఇద్దరు మలయాళీ నన్‌లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ .. తెలుగు చర్చిల సమాఖ్య సభ్యులు, క్రైస్తవ సమాజ సభ్యులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ నిరసన ర్యాలీ బిషప్ స్కూల్ గ్రౌండ్స్ నుండి ప్రారంభమై ఎంజి రోడ్డు గుండా ప్రయాణించి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్మృతి వనం పార్క్ వద్ద ముగిసింది. విజయవాడ కాథలిక్ పీఠం ఆధ్వర్యంలో మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్ నేతృత్వంలో ఈ ర్యాలీ జరిగింది. విజయవాడ కాథలిక్ డయోసెస్ మాన్సిగ్నోర్, ఫెడరేషన్ ఆఫ్ చర్చెస్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ రెవరెండ్ మువ్వల ప్రసాద్, బెథెల్ మినిస్ట్రీస్ చైర్మన్ రెవరెండ్ ఎస్. జయ కుమార్, గుణదల చర్చి రెక్టర్ ఫాదర్ ఎలేటి విలియం జయ రాజు, నన్‌లు సుగుణ, సుందరి, ఇతరులు మాట్లాడుతూ నన్‌లపై ఉన్న కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ఛత్తీస్‌గఢ్‌లోని రైల్వే స్టేషన్‌లో ఉన్న నన్‌లపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. అయితే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతి వనం వద్దకు చేరుకోకుండా సూర్యారావుపేట వద్ద పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. ఈ ర్యాలీకి ఎలాంటి అనుమతి తీసుకోలేదని పోలీసులు ఆరోపించారు. అయితే, ర్యాలీలో పాల్గన్న ఒక అసోసియేషన్ నాయకుడు మాట్లాడుతూ " మేము ర్యాలీ నిర్వహించ డానికి ముందుగానే పోలీసుల నుండి అనుమతి తీసుకున్నాము. కానీ, ఒక పోలీసు అధికారి మమ్మల్ని రోడ్డుపై ఆపి, కొవ్వొత్తుల ర్యాలీకి అనుమతి లేదని వాగ్వాదం చేశారు. స్మృతి వనం వరకు మమ్మల్ని అనుమతించాలని మేము అతనిని అభ్యర్థించినప్పటికీ, పోలీసులు మా అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో నన్‌లు బిషప్ అజారియా స్కూల్‌కు తిరిగి వచ్చారు. " అని వివరణ ఇచ్చారు. ర్యాలీలో మైక్‌లను ఉపయోగించడానికి అనుమతి లేదని సౌత్ జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పవన్ కుమార్ తెలిపారు. "నిర్వాహకులు మైక్‌లను ఉపయోగించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తుండటంతో తాము వాటిని స్వాధీనం చేసుకున్నాము" అని ఎసిపి తెలిపారు.

# గ్రంథాలయం కేంద్రంగా చదువుకుని కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సత్కారం


గ్రంథాలయం కేంద్రంగా చదువుకుని కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సత్కార కార్యక్రమంలో రమాదేవి

**విజయవాడ,ఆగస్టు5, ప్రభాత వార్త ప్రతినిధి:** విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో చదువుకుని కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం ఘనసన్మానం జరిగింది.గ్రంథాలయం ఆధ్వర్యంలోనే జరిగిన ఈ కార్యక్రమానికి లైబ్రేరియన్ కె.రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను దుశాలువ, జ్ఞాపికలతో ఆమె సత్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ఏపీ పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలలో ఠాగూర్ గ్రంథాలయం కేంద్రంగా చేసుకుని చదువుకున్న 13 మంది విద్యార్థులు ఎంపిక అయినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. బి.ప్రదీప్. పి.శ్రీనివాస్,. జే.వెంకటయ్య, బి.నాగరాజు, జీ.సురేంద్ర బాబు, యన్.పృథ్వీ, .హాలీమ, . ఏ.మహేష్,. గోపి.కె. వాసంతి, కె. సుష్మా శ్రీ, బి. అలివేలు,యం. బాలయ్య మొత్తం 13 మంది ఎంపిక అయ్యారని తెలిపారు వారు ఎంతో కష్టపడి తమ కుటుంబ సభ్యులను, తోటి విద్యార్థులను, గ్రంథాలయ సిబ్బంది అందరినీ గర్వపడేలా చేశారు అని అన్నారు. వారు ఇక్కడితో కాకుండా ఇంకా ఉన్నత స్థానానికి చేరాలని కోరుతున్నాను అన్నారు. అభ్యర్థులు మాట్లాడుతూ గ్రంథాలయంఎంతగానో ఉపయోగపడింది అని, ఇక్కడ చదువుకోవటానికి చాలా సౌకర్యంగా ఉంటుంది అని, కష్టపడి చదివితే ఫలితం తప్పకుండా దక్కుతుంది అని అన్నారు. నిరాశ పడకుండా ప్రిపరేషన్ చేస్తూ వెళ్తే ఎన్నటికైనా మనకి సరైన ఫలితం వస్తుంది అని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది,విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

# శాస్త్ర విజ్ఞాన లక్ష్యాలకు తిరుపతి 'ఐసర్' మణిదీపం

## 6వ స్నాతకోత్సవంలో 255మందికి డాక్టరేట్ పట్టాలు



**శ్రీకాళహస్తి,ఆగస్టు 5 ప్రభాతవార్త** శ్రీకాళహస్తికి సమీపంలో కేంద్ర ప్రభుత్వం నెలకొల్పిన భారతీయ విజ్ఞాన శిక్షణ మరియు పరిశోధన సంస్థ భవిషత్తులో 'శాస్త్ర విజ్ఞాన లక్ష్యాలకు మణిదీపం కాగలదని మంగళవారం జరిగిన పదవ వార్షికోత్సవం,6వ స్నాతకోత్సవ సభలో ప్రసంగించారు. 255 మంది విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను అతిధులు అందించారు. ఐసర్ 2015లో మంజూరు చేసి అదే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించగా సొంత భవనాల్లో మొదటి సారి 6వ స్నాతకోత్సవాన్ని జరుపుకున్నారు.ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ శాంతను భట్టాచార్య పదేళ్ళలో సాధించిన ప్రగతిని విశ్లేషించారు.పరిశోధన వైజ్ఞానిక అవిష్కరణలకు పునాది వేసే విధంగా తిరుపతి ఐసర్‌ను నిర్మించామన్నారు. సుమారు 256 ఎకరాల్లో నిర్మించిన విద్యాసంస్థ ప్రత్యేక శిల్పకళతో తీర్చి దద్దామన్నారు. ఈ కార్యంపస్‌కు గ్రీహ్ కౌన్సిల్ మరియు తేరి 4 స్టార్ ఎల్‌డి రేటింగ్ ఇచ్చాయని వివరించారు.ఇక్కడ నిర్మించిన ఒక్కొక్క భవనానికి ఎంతో ప్రత్యేకతను ఇచ్చామన్నారు. ముఖ్యంగా గ్రంధాలయం, ఆడిటోరియం వంతి భవనాల్లో భారతీయ, విదేశీ ప్రముఖ శాస్త్రవేత్తలు పేర్లను పొందు పరచామన్నా రు.దానిని నిర్మాణం లోనే మిళితం చేసామని భట్టా చార్య వివరించారు. భారతీయ శాస్త్రీయ రంగంలో ప్రతిభకు తిరుపతి ఐసర్ పట్టం కట్టిందన్నారు. పదేళ్ళ ప్రస్తానంలో ఎన్నో విజయాలు సాధించి నట్లు భట్టాచార్య వివరించారు. ఈ విద్యా సంవత్సరం 210పరిశోధనా పత్రాలు ప్రచురించబడ్డాయని ఇందుకు రూ.29.43 కోట్లు బహిరంగ పరిశోధనా నిధులు అందుకున్నామని వివరించారు. నెచర్ ఇండెక్స్ 2025 ప్రకారం తిరుతపి ఐసర్ 33వ స్థానంలో నిలిచినట్లు డైరెక్టర్ భట్టాచార్య వివరించారు.స్టాన్ ఫోర్ట్ యూనివర్శిటి ప్రకటించిన 'ప్రపంచ ఉత్తమ 2శాతం శాస్త్రవేత్తల జాబితాలో ఎనిమిది మంది ఫ్యాకల్టీ సభ్యులు ఉండటం గర్వకారణమన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి తిరుపతి ఐసర్ కొత్తగా ఒరెండు సంవత్సరాల మాస్టర్ బై రీసెర్చ్ (ఎంఎస్-ఆర్) కోర్సును ప్రారంభిస్తున్నట్లు వివరించారు.ఈ విద్యాసంవత్సరం కొత్తగా 400 మంది విద్యార్థులు చేరుతున్నట్లు వివరించారు. స్పోర్ట్స్ కాంప్లెక్సు, ఫైవ్‌స్టార్‌ల్యాబ్స్,పేఅండ్ ఈట్ మెస్, ఆధునిక నివాసాల మధ్య విద్యార్థుల సంపూర్ణ అబివృద్ధికి ఏర్పాట్లు చేస్తున్నట్లు భట్టాచార్య వివరించారు. నేల ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మార్చగల శక్తికి శాస్త్రవేత్తలకు ఉంది. సోమయ్య ముఖ్యఅతిథిగా వచ్చిన గోదావరి బయోరిఫైనరిస్ లిమిటెడ్ చైర్మన్ సోమయ్య విద్యాసంస్థల ఛాన్సలర్ సమీర్ సోమయ్య విద్యార్థులను ఆకర్షిస్తూ తన ప్రసంగాన్ని ఆంగ్లంలోనూ,హిందీలో సాగించారు.

# రైల్వే జోనల్ ఎస్‌సి,ఎస్‌టి ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో గజరాజు ప్యానల్ ఘన విజయం

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 5,ప్రభాతవార్త** అకిల భారత రైల్వే ఎస్‌సి,ఎస్‌టి ఉద్యోగుల సంఘం దక్షిణ మధ్య రైల్వే జోనల్ కమిటీకి నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలను ఎన్నికల అధికారి బి వీరన్న,రైల్వే పరిశీలకుడు యట్టయ్యలు ప్రకటించారు. అసోసియేషన్ జోనల్ కమిటీకి రానున్న మూడేళ్ల కాలవ్యవధికి నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలలో ఏనుగు(గజరాజు), ధర్మచక్రం ప్యానల్‌ల మధ్య పోటీ హోరా హోరీగా సాగింది. ఈ ఎన్నికలలో ఓటర్లు ఏనుగు (గజరాజు) ప్యానల్‌కు పట్టం కట్టారు. జోనల్ అధ్యక్ష పదవికి ఏనుగు ప్యానల్ నుండి పోటీ చేసిన ఏ వినోద్ తన ప్రత్యర్థిపై 11ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధర్మనాయక్ 12ఓట్ల మెజార్టీతోను, జోనల్ కార్యదర్శిగా జి దాశరథి క్రిష్ణ 14ఓట్ల మెజార్టీతో, జోనల్ అదనపు కార్యదర్శిగా కెపి హరిప్రసాద్ రెండు ఓట్ల మెజార్టీతో కీలకమైన జోనల్ కోశాధికారిగా రాయలసీమ గుంతకల్లు డివిజన్ నుంచి పోటీ చేసిన యస్ సాయిబాబా తన సమీప ప్రత్యర్థిపై అత్యధికంగా 20ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించినట్లు ఎన్నికల అధికార యంత్రాంగం ప్రకటించింది.

# అమరావతి నిర్మాణంలో ప్రజాభాగస్వామ్యం

**- విరాళాల స్వీకరణకు సిఆర్డీఎ ఆహ్వానం**

**విజయవాడ,ఆగస్టు 5,ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి నిర్మాణంలో ప్రజలను భాగస్వాములను చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా విరాళాలు స్వీకరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవాలన్న ఆకాంక్ష ఉన్న వారి కోసం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సీఆర్డీఏ వెబ్‌సైట్ సిఆర్‌డిఏ.ఎపి.జిఓవి.ఇన్‌లో ఇందుకు ప్రత్యేకంగా 'డొనేట్ ఫర్ అమరావతి' నే ఆప్షన్ ఇచ్చారు. దీనిపై క్లిక్ చేస్తే...క్యూ ఆర్ కోడ్ వస్తుంది.ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే...పేమెంట్ గేట్‌వే వస్తుంది. అందులో విరాళం అందచేయాల్సిన మొత్తాన్ని నమోదు చేసి...మన యూపీఐ పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి.ఆ మొత్తం సీఆర్డీఏ ఖాతాకు జమవుతుంది.2015 అక్టోబరులో కొత్త రాజధాని నిర్మాణం కోసం అప్పటి సిఎం చంద్రబాబు...'మై బ్రిక్...మై అమరావతి'ని ప్రారంభించారు. ఒక్కో ఈ-ఇటుకను రూ.10 వెచ్చించి ప్రజలు కొనుగోలు చేశారు. దీనికి ప్రపంచ వ్యాప్తంగా ...పలు దేశాల నుంచి అనూహ్య స్పందన కనిపించింది.

# సెప్టెంబర్12నుండి తిరుపతిలో స్వర్ణోత్సవ నృత్యకళోత్సవాలు



**తిరుపతి.ఆగస్ట్ 5ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో తిరుపతిలో సెప్టెంబర్ 12నుండి 14వ తేదీవరకు మూడురోజులపాటు శ్రీకృష్ణదేవ రాయ స్వర్ణోత్సవ నృత్యకళోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. శాస్త్రీయ నృత్య జానపద పోటీలు ఉంటాయన్నారు. బృందం నృత్యాలలో తమ ప్రతిభ చూపిన కళాకారులకు మొదటిబహుమతిగా 10వేల రూపాయలు, రెండోబహుమతిగా 6వేలు రూపాయలు, తృతీయ బహుమతిగా 3వేల రూపాయలు, సోలో నృత్యోత్సవాల్లో విజేతలకు మొదటి బహుమతి 4వేలు, రెండోబహుమతి 3వేలు. మూడోబహుమతి 2వేల రూపాయలు ,జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులకు మెమోంటోలు, ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు. తిరుపతి,చిత్తూరు, కడపజిల్లాల కళారారులు 12వతేదీ పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు రంగస్థలి కార్యదర్శి కెఎన్ రాజ,9347046608నంబర్‌కు సంప్రదించాలని, ఆగస్ట్ 20వతేదీ లోపు దరఖాస్తులు పంపాలని కోరారు.

# అమరావతిలో ముమ్మరంగా భూగర్భ విద్యుత్‌లైన్ల పనులు

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగు తున్నాయి. ఇక్కడ ఇప్పటికే జనావాసాలకు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం భూములు కేటాయించింది..ఈ భూముల్లో చాలా చోట్ల 220 కెవీ.132 కెవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ల స్థంభాలు ఉన్నాయి. వీటి వల్ల నిర్మాణాలకు ఇబ్బందులు రాకుండా భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రస్తుతం తాళ్ళాయపాలెం లోని 400 కెవీ సబ్‌స్టేషన్‌తో పాటులింగాయపాలెం,నేలపాడులో నిర్మించబోయే 220 కెవీ ఉపకేంద్రాల నుంచి లైన్లను భూగర్భంలో వేసే పనులు,ఇప్పటికే ఉనన టవర్లనుమార్చే పనులు జరుగుతు న్నాయి. భూగర్భంలో డక్ట్‌లు ఏర్పాటుచేస్తున్నారు.

# పరిశ్రమలో ఇంటర్న్‌షిప్‌లు.. భద్రతకు ఒప్పందాలు

**- కోర్సులు,సిలబస్ రూపకల్పనకు నోడల్ సెంటర్లుగా వర్సిటీలు**

**విజయవాడ,ఆగస్టు 5,ప్రభాతవార్త ప్రతినిధి:** పరిశ్రమల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు కల్పించడానికి,వాటి భద్రతకు సంబంధించి విశ్వవిద్యాలయాల నుంచి సాంకేతిక సహకారం తీసుకునేందుకు ఫ్యాక్టరీస్ విభాగం సోమవారం శ్రీ వెంకటేశ్వర,జెఎన్‌టీయూ-అనంతపురం విశ్వవిద్యాలయాలు,ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్‌తో ఒప్పందాలు కుదుర్చుకుంది. విజయవాడ లోని కార్మిక శాఖ కమీషనర్ కార్యాలయంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో వీరు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ప్రతిపాదనను ఆ శాఖ కార్యదర్శి శేషగిరిబాబు తీసుకొచ్చారు. ఈ ఒప్పందంలో భాగంగా విద్యార్థులకు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తారు. పరిశ్రమల్లో భద్రతకు సంబంధించి విశ్వవిద్యాలయాలు సాంకేతిక మద్దతునిస్తాయి. రాష్ట్రం లోని 200 ప్రమాదకర పరిశ్రమల్లో ప్రస్తుత పరిస్థితులు,ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై థర్డ్‌పార్టీ ఇచ్చే నివేదికను వర్సిటీలు పరిశీలిస్తాయి. ఫ్యాక్టరీల్లో భద్రత అధికారులను నియమించుకోవాలనే నిబంధన ఉంది. ఇందుకోసం వర్సిటీలు పీజీ డిప్లొమా కోర్సులు తీసుకురావడం లేదంటే కోర్సుల్లోనే అదనంగా సబ్జెక్టును చేర్చడం లేదా కిన్ని చాప్టర్లు ప్రవేశపెట్టడం లాంటివి చేస్తాయి.ఐటీఐ,డిప్లొమా,

బీటెక్‌ల్లో సిలబస్‌ను ప్రవేశపెట్టేందుకు వర్సిటీలు నోడల్ సెంటర్లుగా పనిచేస్తాయి. భద్రతపై ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు.

వార్త

చెవిటివాడు ఎవరు? మాట వినలేనివాడు కాదు, మంచి మాట విననివాడు.

-మార్టిన్ లూథర్ కింగ్

# 'జన' ఔషధి చౌక బేరం!

దేశంలో రోగాల విస్తృతి ఎంత మేరకు ఉందో అంతే స్థాయిలో నకిలీ ఔషధాల విక్రయమూ వ్యాప్తి చెందుతోంది. ఔషధ నియంత్రణ మీద ప్రభుత్వాల పట్టు గురించి చెప్పాల్సి వస్తే సరిపోదనే చెప్పాలి. నిషేధిత మందులే కాదు, నకిలీమందులు కాలం చెల్లిన ఔషధాలు కూడా ఇప్పటికే మందుల షాపుల్లో దొరకుతాయి. మందుల షాపు అనగానే అదేదో ఒక వ్యాపార విక్రయశాల కనుక తెలిసో తెలియకో విక్రయాలు జరుగుతున్నాయని సరిపెట్టుకోలేం. అక్కడ ఔషధ వినియోగం, దుష్ప్రభావాల గురించి బాగా తెలిసి వివరించ గలిగిన 'ఫార్మాసిస్ట్' ఉండడం తప్పనిసరి కావున. పైగా ప్రభుత్వాల ద్వంద్వ ప్రమాణాల కారణంగా మార్కెట్‌లో ఒక ఔషధాల కాంబినేషన్ ఫార్ములాలో ప్రఖ్యాతఫార్మసీ కంపెనీలు సాధారణ మందుల జనరిక్ మందులు బజార్లో విరివిగా దొరుకుతున్నాయి. ఈ రెండింటికీ మించి మరి కొన్ని ఫార్మా సంస్థలు సాధారణ ధరలు, జనరిక్ ఔషధ ధరలకు మధ్య ధరలకు మరికొన్ని కాంబినేషన్‌లను సరఫరా చేస్తున్నాయి. ఇలా ధరల తేడాల మధ్య ఒకే రకపు ఔషధాల కొనుగోలుకు వినియోగదారుడు వెంపర్లాడుతున్నాడు. గతానికి ఇప్పటికీ తేడా ఏమిటంటే గతంలో నేరుగా మందుల షాపుల్లో కొనుగోలు చేసే రోగులు ఇప్పుడు తాజాగా పెయిన్ కిల్లర్‌లు, బి.పి, మధుమేహం షుగర్‌ల వంటి వ్యాధులకు సంబంధించి కాంబినేషన్ డ్రగ్స్‌ను 'జనరిక్' పేర్లతో అతి తక్కువ ధరకు లభించే షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు. దానివల్ల అవసరమైన ఔషధాలను తక్కువ ధరకు తెచ్చుకోగలుగుతున్నారు. డాక్టర్లు నేరుగా 'జనరిక్' పేర్లతో రాయడంలోనూ చొరవ చూపడం లేదు. జనరిక్ పేర్లతోనే ప్రిస్క్రిప్షన్‌లు రాసి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తగు ఉత్తర్వుల్చినా డాక్టర్లెవరూ వాటిని పాటించి తమ ప్రిస్క్రిప్షన్ తయారీలో వాడటానికి అలవాటు పడలేదు. ఇష్టపడడం లేదనే అనుకో వాలి. లేదు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు చౌకధరలకే అత్యవసర ఔషధాలను అందిస్తున్నామని పదేపదే చెప్పదలచుకున్నా అందులో వాస్తవాలు అతి తక్కువగా ఉంటున్నాయి. మందులు రాసిన డాక్టర్ వివేకాన్ని బట్టి రోగులపైభారం పడుతుంది. నేరుగా ఏ డాక్టరూ 'జనరిక్' మందును ప్రిస్క్రిప్షన్ చేసిన దాఖలాలు కనబడవు. దానాదీనా ధరల భారం తగ్గించడంలో ప్రభుత్వ నిర్ణయాలు ఏ మాత్రం వినియోగదారునికి ఉపయోగపడేలా లేవు. ప్రభుత్వాలు తాము కాలం చెల్లిన మందుల్ని తొలగించినట్లు చెబుతూనే వాటి వాడకాలపై నిషేధం విధిస్తోంది. అలాగే కొన్ని కాంబినేషన్లను వాడొద్దని చెబుతోంది. కానీ అంతే ధైర్యంగా 'జనరిక్' మందుల విక్రయాలు అత్యంత అవకాశాలున్నాయని చెప్పడంలో ధైర్యం చేయలేకపోతోంది తాజాగా 35 అత్యవసర ఔషధాల ధరలు తగ్గించినట్లు ప్రకటించింది. అవన్నీ ప్రాణాంతక రోగాలకు వాడే మందులే. నిత్యావసర ఔషధాలే. మధు మేహం, గుండె సంబంధిత వ్యాధులు, యాంటీ బయో టిక్ సహా వివిధ రకాల కీలక ఔషధాలే ఉన్నాయి. కొత్త గా నిర్ణయించిన ఔషధాలు వాటి ధరలు తగ్గిన వైనాన్ని డీలర్లు తమ దుకాణాల్లో వినియోగదారులకు కనిపించేలా బోర్డులుపెట్టాలని జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థకోరింది. ప్రధానంగా పారాసిటమాల్, ఎసిలోఫెనాక్, ట్రిప్సిన్, కైమోట్రిప్సిన్ మెట్‌ఫార్మిన్, అటోర్వాస్టాటిన్ కాంబినేషన్ టాబ్లెట్‌లు మధుమేహ నియంత్రణ మాత్రల ధరలు కూడా తగ్గాయి. ఔషధాల ధరల నియంత్రణలో సత్ఫలితాలు లేవని గతంలో తెచ్చుకున్న స్టాక్‌ధర తగ్గించి అమ్మితే నష్టంవస్తుందని ఒకసారి, తీరా కొత్తగా సరకు రానందున పాతమాత్రలు పాతధరలు తప్పవంటూ కొన్నాళ్లు... ఆపైన వినియోగదారు తమ ఔషధ వినియోగాన్నే తప్ప ఇతరాలు పట్టించుకోరు. అదే వినియోగదారు కొంప ముంచుతోంది. మధ్యలో నకిలీ ఔషధాలు కూడా మార్కె ట్‌లోకి వచ్చేస్తున్నాయి. అసలైన ఔషధాల పేరిట మరికొన్ని ఔషధాలు మార్కెట్‌లో దొరకుతున్నాయి. వాటి గురించే ఇప్పుడు ఎల్లెడలా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఔషధాల్లో హానికారక పదార్థాలుకానీ, ముడి పదార్థాలో ఒకవేళ కలిసి ఉంటే అవి ప్రాణాంతకం కావొచ్చు. శరీరంలో విషప్రభావాలు కల్పించవచ్చు. నకిలీ మందుల విక్రయంనేరమని తెలిసినా వాటినివ్యాప్తి చేయడం కొందరుపనిగా పెట్టుకుంటారు. అందుకు చాలామంది రోగగ్రస్తులు నమ్మకమైన మందుల షాపులలోనే మందులు కొనుక్కొంటారు. ఎలాంటి మందులు వాడినా డాక్టరు సునిశిత పరిశీలన, రోగవిశ్లేషణ ద్వారానే ఆరోగ్య వంతులు కాగలడు. అందుకే డాక్టరు సలహా సంప్రదింపులు అవసరం అని గుర్తించాలి. ఉత్తరప్రదేశ్‌లో గత యేడాది రూ. 30.77 కోట్ల మేరకు విలువైన డ్రగ్స్‌ను పట్టుకున్నారు. అదే కాలంలో 1166 డ్రగ్ లైసెన్సులు రద్దు చేసి, 68 మందిని అరెస్టు చేశారు. పంజాబ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్‌లలో 1.4 కోట్ల రూపాయల విలువైన 1.4 కోట్ల టాబ్లెట్స్, 2లక్షల క్యాప్సిల్స్ పట్టుకున్నారు. వీటిలో నకిలీ కొలెస్టరాల్ మందులు ఎక్కువగా ఉన్నాయి. సింథటిక్ డ్రగ్స్, మైఫిడ్రోన్, కొకైన్ రోజువాస్ వంటి నకిలీ ఉత్పత్తులను పట్టుకొన్నారు. ఇటీవలనే హైదరాబాద్‌లోని కోఠి ప్రాంతంలో ఇద్దరు హోల్‌సేల్ ఔషధ విక్రేతల నుంచి కొలెస్టరాల్ నియంత్రణ మందులను పట్టుకుని డ్రగ్స్ సీజ్ చేశారు. ఈరకం మందులు సీజ్ చేయడం ఇదే తొలిసారని ఔషధ నియంత్రణ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా వాడే మందులకు ప్రత్యామ్నాయంగా చౌకధరకు లభించే జనరిక్ మందులు ఉన్నా ఇతరత్రా ప్రత్యేక ప్రత్యామ్నాయ మందుల కోసం ధరభారం తగ్గుతుందనే ఉద్దేశంతో వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి సందర్భాలలో నేరుగా తక్కువ ధరకే దొరికే జనరిక్ ఉత్పత్తుల ప్రోత్సాహమూ అవసరమే!

గొప్ప లక్ష్యాన్ని సాధించాలని ప్రయత్నించి విఫలం కావడం నేరం కాదు. గొప్ప లక్ష్యం లేకపోవడం నేరం.



లోవెల్

కీర్తి అత్తరులాంటిది. పైపైన చల్లుకోవాలే గాని తాగుతూ కూర్చోకూడదు.



హరివంశరాయ్ బచన్


# జల సమస్యను రెండు రాష్ట్రాలు పరిష్కరించుకోలేవా?

*కొత్త ట్రిబ్యు నల్ ఏర్పాటు చేయడంవల్ల మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ వాటా పెంచాలని కోరే అవకాశం ఉంది. కాబట్టి, పరస్పర చర్చల ద్వారానే సమస్య పరిష్కరించుకోవాలని నిపుణుల అభిప్రాయం. ఇటీవలిజూలై 16న న్యూఢిల్లీలో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి, చంద్రబాబు, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో కీలక సమావేశం జరిగింది. కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం, టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుకు ఆమోదం, వివాదాల పరిష్కారానికి సమగ్ర ఆలోచనలపై చర్చ లాంటి నిర్ణయాలు వెలువడ్డాయి. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపకంపై రాజకీయ లాభనష్టాలకంటే ప్రజల శ్రేయస్సు ముఖ్యం. నదీజలాలు భవిష్యత్ తరాలకు ప్రాణాధారం. అందుకే పారదర్శకత, శాస్త్రీయత, సమాఖ్య స్ఫూర్తితో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొత్త కమిటీపై ప్రజలు ఆశగా చూస్తు న్నారు. ఇది శాశ్వత పరిష్కారానికి తొలి అడుగు కావాలని కోరుకుందాం.*



మన్నారం నాగరాజు

పంతొమ్మిది వందల యాభై ఆరులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యాక వ్యవసాయ అభివృద్ధిలో సాగునీటికి ప్రాధాన్యం పెరిగింది. రాష్ట్ర భౌగోళిక నిర్మాణం, సముద్ర తీర ప్రాంతం, నదుల సమృద్ధి, జనాభాలో 72.7 గ్రామీణులు వ్యవసాయంపై ఆధారపడటంతో సాగునీటి అవసరం స్పష్టమైంది. రాష్ట్రంలో సుమారు 40 శాతం పంట భూమి సాగునీటి ఆధారితంగా ఉండగా, అందులో 95శాతం వరి పంటకే ఉపయోగపడుతోంది. స్వాతంత్ర్యం తరువాత ఇంజినీర్లు, ఆర్థికవేత్తలు, వాతావరణ నిపుణులు కలిసి సాగునీటి ప్రాజెక్టులపై సమగ్ర ప్రణాళికలు రూపొందించారు. బ్రిటిష్ కాలంలో నిజాం సాగర్, ప్రకాశం బ్యారేజ్, సర్ ఆర్థర్ కాటన్, గోదావరి డెల్టా వంటి కొన్ని ప్రాజెక్టులే ఉండగా, 1956 తర్వాత నాగార్జునసాగర్, శ్రీరాం సాగర్, సోమశిల వంటి మేజర్ ప్రాజెక్టులు నిర్మించబడ్డాయి. గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్న నదులపై అనేక ప్రాజెక్టులు నిర్మించబడ్డాయి. 2000-01 నాటికి 45.27లక్షల హెక్టార్లకు సాగునీరు అందించబడింది. ఉపరితల జలాలు, భూగర్భ జలాలపై ఆధారపడే ఈ వ్యవస్థలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల పాత్ర ఉంది. అయితే సాగునీటి వనరుల వినియోగంలో సమర్థత, సమాన పంపిణీ, పర్యావరణ పరిరక్షణపై చర్చ అవసరం. రాష్ట్రాల మధ్య గోదావరి జలాలపై ఉన్న వివాదాలపై 1980లో ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ఆధారంగా శ్రీరాం సాగర్ ప్రాజెక్టు ద్వారా 6.5 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించబడింది. మిగతా ప్రాజెక్టుల వ్యయాల్లో గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఉదాహరణకు, శ్రీరాంసాగర్ వ్యయం రూ. 4,010 లక్షల నుండి రూ.31,800 లక్షలకు పెరిగింది. 2008 నాటికి 20ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. పోలవరం, తెలుగు గంగ, నెట్టెంపాడు, కల్వకుర్తి, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులు లక్షల హెక్టార్ల భూమికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో కొనసాగుతున్నాయి. తెలుగు గంగప్రాజెక్టు ద్వారా చెన్నై నగరానికి తాగునీరు, 2.3లక్షల హె.కి సాగునీరు అందించబడుతోంది. చిన్నతరహా వనరుల అభివృద్ధి కూడా గణనీయంగా జరిగింది. 2000-01 నాటికి 20.3 లక్షల చిన్న వనరులు అందుబాటులో ఉన్నాయి. అయితే భూగర్భజలాల అధిక వినియోగం, చెరువుల పూడిక సమస్య, నిర్వహణ లోపాలు సాగు సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. చివరిగా, సాగునీటి రంగంలో మౌలిక మార్పులకు దోహదపడే విధంగా సమగ్ర ప్రణాళికలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తూ, మధ్యతరహా ప్రాజెక్టులకు, చిన్నవనరుల అభివృద్ధికి దృష్టి సారించాలి. నిక్షిప్త వనరులను సమర్థవంతంగా వినియోగించేం




దుకు శాస్త్రీయ ధోరణిలో ముందుకెళ్లాలి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదం దశాబ్దకాలంగా కొనసాగుతోంది. 2014 రాష్ట్ర విభజన జరిగినప్పటికీ, కృష్ణా, గోదావరి నదుల్లో నీటి పంపకంలో స్పష్టత లేకపోవడం, ప్రాజెక్టులపై అనుమతుల కలిగించకపోవడం, కేంద్ర ప్రభుత్వ జోక్యం స్పష్టంగా లేకపోవడం వల్ల సమస్య మరింత సంక్లిష్టమవుతోంది. తెలంగాణ ఏర్పాటైనప్పుడు రాష్ట్రానికి కృష్ణానదిలో తగిన వాటా లభించకపోవడం అన్యాయం అని భావించింది. ఉమ్మడి రాష్ట్రంలో మహబూబ్‌నగర్, నల్గొండ వంటి జిల్లాలు త్రాగునీటి కష్టాలు ఎదుర్కొనడం, సాగు నీటి అవసరాలు తీరకపోవడం విశేషంగా ప్రస్తావించబడింది. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌ద్వారా జరిగిన నీటి కేటాయింపులు తెలంగాణ రాష్ట్రం ఆమోదించలేదు. ఆ తీర్పుపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలై ఉంది. కేంద్రం మాత్రం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం వ్యవహరించాలని అభిప్రాయపడుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను విస్తరించడంతో, కృష్ణా బేసిన్ వెలుపల నీటిని తరలించే ప్రణాళికలు ప్రారంభమయ్యాయి. 2020లో రాయలసీమ ఎత్తిపోతల పథకంకి జీవో 203 ద్వారా రూ.24000 కోట్లు మంజూరు చేయడం తెలంగాణ తీవ్ర వ్యతిరేకతను కలిగించింది. ఇది కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అభిప్రాయానికి విరుద్ధంగా ఉన్నా, కేంద్రం చర్యలు తీసుకోలేకపోయింది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, సీతారామ, దేవాదుల వంటి గోదావరి ప్రాజెక్టులను కేంద్రం కొత్త ప్రాజెక్టులుగా గుర్తించి, డిపిఆర్‌లు సమర్పించమని కోరడం రాష్ట్రాన్ని నిరాశకు గురిచేస్తోంది. అవి 2014 కు ముందే ప్రారంభమైన ప్రాజెక్టులని తెలంగాణవాదిస్తోంది. మరోవైపు, కేంద్రం ఈ ప్రాజెక్టులకు సాంకేతిక సలహాకమిటీ ఆమోదం లేకుండా ముందుకెళ్లవద్దని సూచిస్తోంది. గోదావరి నదిపై ఇప్పటికే బచావత్ అవార్డు, జిడబ్ల్యుడిటి, కెడబ్ల్యుడిటి1 వంటి జలపంపక అవార్డులు ఉన్నాయి. కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడంవల్ల మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ వాటా పెంచాలని కోరే అవకాశం ఉంది. కాబట్టి, పరస్పర చర్చల ద్వారానే సమస్య పరిష్కరించుకోవాలని నిపుణుల అభిప్రాయం. ఇటీవలిజూలై 16న న్యూఢిల్లీలో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి, చంద్రబాబు, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో కీలక సమావేశం జరిగింది. కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం, టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుకు ఆమోదం, వివాదాల పరిష్కారానికి సమగ్ర ఆలోచనలపై చర్చ లాంటి నిర్ణయాలు వెలువడ్డాయి. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపకంపై రాజకీయ లాభనష్టాలకంటే ప్రజల శ్రేయస్సు ముఖ్యం. నదీజలాలు భవిష్యత్ తరాలకు ప్రాణాధారం. అందుకే పారదర్శకత, శాస్త్రీయత, సమాఖ్య స్ఫూర్తితో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొత్త కమిటీపై ప్రజలు ఆశగా చూస్తు న్నారు. ఇది శాశ్వత పరిష్కారానికి తొలి అడుగు కావాలని కోరుకుందాం. ●

# మానవతా విలువలు పెంచే విద్య కావాలి

సోరుపాక అనిల్ కుమార్

తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యార్థుల స్థాయిలో, చదువుల ఒత్తిడికి తట్టుకోలేక ఎంతోమంది యువత జీవితం మీద ఆశ కోల్పోతున్నారు. ప్రతి సంవత్సరం పది, ఇరవైకాదు, వందల సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఈ దారుణ వాస్తవం మన సమాజం, విద్యా వ్యవస్థ, తల్లిదండ్రుల బాధ్యతా భావాన్ని ప్రశ్నించే స్థితికివచ్చింది. చదువు అనే పవిత్రమైన పదం ఇప్పుడు విద్యార్థులకు భయపదకంగా మారింది. జీవితాన్ని వెలిగించాల్సిన విద్య, ఎందుకు చీకట్లో ముంచుతోంది? ఒక విద్యార్థి ఉదయం నాలుగు గంటలకే లేచి, రాత్రి పది గంటల వరకు ఒక మెషీన్లా చదివే విధంగా షెడ్యూల్ చేస్తే అతని వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, భావోద్వేగాల స్థానమే ఎక్కడ ఉంది? అతని ఆనందం, కలలు, విశ్రాంతి అన్నీ పాఠ్యపుస్తకాల మధ్య రేకుల్లా తుడిచిపెట్టినట్లు పోతున్నాయి. చదువు అనేది నేర్చుకోవడం కోసం, జీవన నైపుణ్యాల కోసం ఉండాలి. కానీ అది ఇప్పుడు గడియారాన్ని లెక్కపెట్టి బాధగా మారింది. ప్రత్యేకించి ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్మీడియట్ కళాశాలలు వారి 100 రిజల్ట్ స్టేట్ టాపర్ మా కళాశాల నుంచే అనే ప్రకటనల కోసం విద్యార్థుల జీవితాన్ని సర్వస్వంగా వాడుకుంటున్నాయి. పబ్లిక్ ప్రాపర్టీ కంటే తక్కువ స్థాయిలో కూడా విద్యార్థులను గౌరవించకపోవడం, వారిని టార్గెట్ ర్యాంక్ల కోసం ఒత్తిడికి గురిచేయడం, మానవ సంబంధాలే లేకుండా ఒక పరీక్షల యంత్రంగా మలచడం ఇవన్నీ విద్య అనే మహత్తరమైన భావనను మట్టికరిపిస్తున్నాయి. నువ్వు ఈ టెస్టులో పాస్ కాకపోతే తల్లిదండ్రులకు ఫోన్ చేస్తాం, తక్కువ మార్కులు వస్తే వర్క్ సెక్షన్లో పెట్టేస్తాం, మరెక్కడైనా అడ్మిషన్ తీసుకోరు వంటి బెదిరింపులు ఇవే వారి భవిష్యత్తు నిర్మించాల్సిన గురువుల మాటలైతే, విద్యార్థులు దిక్కుతోచని స్థితిలోకి ఎందుకు వెళ్లరు? అంతేకాదు, తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశాలు పరిమితమయ్యాయి. విద్యార్థుల అనుభవాలు, భావోద్వేగాలు, అభిరుచులు అన్నీ అణగిపోతున్నాయి. సమస్య చెప్పుకునే వేదిక లేదు. నాలో ఏదో తేడా



ఉంది, నేను ఎందుకు ఇతరుల్లా చదవలేకపోతున్నాను?అనే స్వీయ సందేహాలు విద్యార్థులను మానసికంగా నశింపజేస్తున్నాయి. ఇవన్నీ కలిసినప్పుడు ఒక విద్యార్థికి అసలు బతకాల్సిన ఉత్సాహం మిగలదు. అది జీవితానికి శాపంగా మారుతుంది. మనం ఒక యుగాన్ని నిర్మించాలనుకుంటున్నాం కానీ చదువు పేరుతో మనం ఆ యువతని నాశనం చేస్తున్నాం. ఇది వ్యక్తిగతంగా ఒక్కరి బాధ కాదు, సమాజం మొత్తానికి ఒత్తిడిగల హెచ్చరిక. ఒక విద్యార్థి ఆత్మహత్య వెనక ఒక్క పరీక్ష ఫెయిలు కాదు, కళాశాల ఒత్తిడి, తల్లిదండ్రుల అంచనాలు, గురువుల విమర్శలు, మానసిక ఒంటరితనం అన్నీ కలిసివుంటాయి. నీవు సరిగా చదవడం లేదనిపిస్తోంది. మా గౌరవాన్ని నాశనం చేస్తున్నావు, నీ వల్ల నేను మిగిలిన తల్లిదండ్రుల ముందు తలవంచుకోవాలి. ఇవన్నీ ప్రేమగా చెప్పిన మాటలు కావచ్చు, కానీ ఒక్క పిల్లోడి మనసులో అవి ఏ పిరికితనాన్ని పెంచుతున్నాయో మనం ఊహించలేము. చదువు అనేది ఎప్పటికీ ఒత్తిడిగా ఉండకూడదు. విద్యార్థులు బలంగా, ఆనందంగా, స్వేచ్ఛగా ఎదగాలంటే చదువును మానవతా విలువలతో కలిపి పోషించాల్సిన అవసరం ఉంది. ప్రతి కళాశాలలో మానసిక కౌన్సిలింగ్ ఉండాలి. విద్యార్థి పరీక్షల్లో విఫలమయ్యాడంటే ఇంకోసారి ప్రయత్నించు అనే శబ్దం వినిపించాలి. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లలను లక్ష్యాల కోసం ఉపయోగించే టూల్స్‌లా కాకుండా, మనుషులుగా చూడాలి. మార్కుల కన్నా ముందు మనిషిత్వం, విజ్ఞానం కన్నా ముందు విశ్వాసం అవసరం. ఒక్క పరీక్షలో ఫెయిలైతే జీవితమంతా ఫెయిలైపోయినట్టు భావించే దశకు విద్యార్థిని తీసుకెళ్లొద్దు. మనమందరం కలిసి ఈ విద్యా వ్యవస్థను పునరాలోచించాలి. విద్యార్థి మానవ హక్కులను కాపాడాలి. మనోబలాన్ని, వ్యక్తిత్వాన్ని పెంచేలా విద్యను రూపుదిద్దాలి. చదువు అనేది ఒక వేదం అది చైతన్యానికి, అభివృద్ధికి మార్గం చూపాలి. కానీ అదే వేదం ఒక మృత్యు సమాచారంగా మారడం అత్యంత భయంకరమైనదిగా మారకూడదు. మనం విద్యార్థిని పుస్తకాల్లో కూర్చోపెట్టి పరీక్షల బలిగొంపులో నెట్టకూడదు. మనం ఒక జీవితాన్ని బ్రతికించాలి. ఒక్క పరీక్ష ఓటమి కాదు ఒక జీవితానికే తలవంచే సందర్భం కూడా కాదు. అందుకే, ఇప్పుడు ఓ మార్పు అవసరం. మరింత ఆలస్యం చేస్తే మరో విద్యార్థి కలలు చిత్తుగా మారతాయి. పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంది. ●

# ప్రజావాక్కు



## అవయవదానంలో ముందంజ

తెలంగాణ రాష్ట్రం మరోసారి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం అభినందనీయం. అవయవదానంలో దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. ఇది రాష్ట్రానికి గర్వకారణంగా మారింది. కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకారం, తెలంగాణ రాష్ట్రం 2024లో అత్యధిక అవయవదానాలు చేసింది. జాతీయ అవయవ మార్పిడి సంస్థ ఈ గణాంకాలను విడుదల చేసింది. జీవితం అనంతరం దానం చేసిన అవయవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. తెలంగాణ ఈ విభాగంలో దేశంలోనే ముందంజలో ఉంది. ఇది సామాజిక చైతన్యానికి నిదర్శనం. రాష్ట్రప్రభుత్వం నడుపుతున్న 'జీవన్ దాన్' కార్యక్రమం కీలకం. ఈపథకం ద్వారా అవయవ దాతల సంఖ్య వేగంగా పెరిగింది. ఇది రాష్ట్ర విజయానికి వెన్నెముకగా నిలిచింది. అవయవదానంలో దేశానికే ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఒక ఉదాహరణగా నిలుస్తోంది.

- కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా

## పరిశుద్ధతకు ప్రాధాన్యం ఇవ్వాలి

దేశం స్వచ్ఛ భారత్‌వైపు ముందుకు సాగుతూ ఉంది కాబట్టిప్రజలు పరిశుద్ధతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా గ్రామస్థాయి నుండి నగరస్థాయి వరకు ప్రజలు పారిశుధ్యానికి ప్రాధాన్యతను ఇవ్వాలి. పారిశుధ్య కార్మికులతో పాటు ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అలాగే బహిరంగ ప్రదేశాలైనబస్టాండ్, రైల్వే స్టేషన్, పార్కులు, సినిమా హాళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అలాగే నగర పాలకసంస్థ వారు నగరాన్నిఅందంగా తీర్చిదిద్దాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

## వాహనాల లైటింగ్ తగ్గించాలి

ఒకప్పుడుస్వదేశీఅంబాసిడర్, మారుతి వంటి కార్లు, బస్సులు, ద్విచక్ర వాహనాల వంటి మోటారు వాహనాలు పరిమిత వేగంతో పయనించటమే గాక వాటి హెడ్‌లైట్లపై సగం నల్లరంగు వేయడటమో నల్ల స్టిక్కర్లు అంటించటమో జరిగేది. ఫలితంగా కాంతి అన్ని వైపులా ప్రసరించకుండా ఎదుటి వాహనాలు స్పష్టంగా కనిపించేవి. కనుక ఇకనైనా వాహన తయారీ కంపెనీలు ఎదుటి వాహనాలకు ఇబ్బంది లేని విధంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలి.

- టి. సాంబశివరావు, గుంటూరు

## పెరిగిన ఫీజులు

ఇటీవలి కాలంలో ఇంజినీరింగ్ కళాశాలలు తమ ఫీజులను భారీగా పెంచబోతున్నారన్న వార్తలు విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇది ఇప్పటికే ఆర్థికంగా ఒత్తిడిలో ఉన్న మధ్య తరగతి, పేద కుటుంబాలకు మరింత భారంగా మారుతోంది. కోచింగ్, హాస్టల్, ప్రయాణ ఖర్చులతో విద్యార్థులు ఇప్పటికే తీవ్ర ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు అదనపు ఫీజుభారం వల్ల వారి విద్యను మధ్యలోనే నిలిపేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇంజినీరింగ్ విద్య యువత భవిష్యత్తుకు పునాది. దీన్ని వ్యాపార ఉద్దేశాలతో నడపడం సమాజానికి హానికరం. విద్యను కేవలం ధనవంతులకు పరిమితం చేయడం వల్ల సామాజిక అసమానతలు పెరిగే ప్రమాదం ఉంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఫీజు సమీక్షించాల్సి ఉంటుంది.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## అక్రమ కట్టడాలను నిర్మూలించాలి

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రభుత్వ ఆర్థిక సహకారంతో పేద ప్రజలకు పంచిన ఇళ్ల స్థలాలలో కబ్జాదారులు కన్ను వేసి చాలా గజాలు ఆక్రమించుకోవడం జరుగుతుంది. అక్రమకట్టడాలు నిర్మించడం జరుగుతుంది. కాలనీలలో కొన్ని ఇండ్లస్థలాలు కొనుగోలు అమ్మకాలు జరిగాయి. ప్రభుత్వ రెవెన్యూ రికార్డులలో ఎవరికి ఎంత భూమి ఎంత ఇంటి స్థలం ఉందో రికార్డులు చూపుతున్నాయి. కానీ కబ్జాదారులు ఇళ్ల స్థలాల ఆక్రమణకు పాల్పడుతున్నారు. దాడులు దౌర్జన్యాలు చేస్తున్నారు. రెవిన్యూ అధికారులకు, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా కూడా ఇలాంటి ఫలితం లేకుండా ఉంటుంది. కనుక రాష్ట్ర రెవిన్యూ శాఖ మండల తహసిల్దార్ ఆధ్వర్యంలో ప్రతి మండల కేంద్రంలో ఉన్న కాలనీలలోఇంటి స్థలాల కొలతలు, సరిహద్దులు, వంటి విషయాలను పరిశీలించి వివాదాలు లేకుండా చూడాలి.

- డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## కనీస సదుపాయాలు కల్పించాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం ద్వారా ఆర్థికాభివృద్ధి సైకిల్ ముందుకు వెళుతుంది. ఇసుక, సిమెంట్, ఐరన్ వంటి సామాగ్రికి డిమాండ్ పెరిగి ఉత్పత్తి పెరుగుతుంది. అంతమాత్రమేకాదు గ్రామాలలో కూలీలకు డిమాండ్ పెరుగుతుంది. ఉత్పత్తి వస్తువుల డిమాండ్ పెరిగేలా చూడడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యం.

-భారత అవినాష్, జనగామ

# అమెరికాను సంపన్న దేశంగా మారుస్తున్న భారతీయులు

మేకిరి దామోదర్

ఆధునిక టెక్నాలజీ ఫలితంగా ప్రపంచమే ఓ 'కుగ్రామంగా' మారింది. దీనితో ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో విశ్వవ్యాప్తంగా తెలుస్తోంది. మన భారతీయులు ప్రపంచంలోని అనేక దేశాల్లో స్థిరపడి రాజకీయ, సాంకేతిక, వ్యాపార రంగాల్లో ఆర్థికంగా కుబేరులుగా ఎదిగి ఆయా దేశాల్లో పాలకులై, ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. వారి ప్రగతి చూస్తూ మా వాళ్లని పొంగిపోతున్నారు. మనవారెక్కడున్నా జన్మభూమి రుణం తీర్చుకోవడం, మూలాలను విస్మరించకుండా మనవాళ్లను తరతరాలుగా పట్టిపీడిస్తున్న పేదరికం, ఉపాధి లేమి, నిరుద్యోగం తదితర సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి తోడ్పడాల్సిన బాధ్యతల గురించి తెలుసుకుందాం. అంతర్జాతీయ వ్యాపార దిగ్గజాలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తమ వినూత్న వ్యూహాలతో సంపదను పెంచుకున్నారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల సంఖ్య2025 లో 3028కి పెరగడం ఇందుకు నిదర్శనం. వీరి మొత్తం సంపద విలువ 16.1లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. 2025 జూలైకు సంబంధించి ఫోర్బ్స్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఎలాన్ మస్క్ ప్రపంచ అగ్రగామి కుబేరుడుగా కొనసాగుతున్నారు. 2024 మేలో 400 బి. డాలర్ల మైలురాయిని అధిగమించిన తొలి కుబేరుడుగా నిలిచి మస్క్ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ప్రపంచ అగ్రగామి 10 మంది కుబేరుల సంపద విలువ జూన్ 1 నాటికి 100 బిలియన్ డాలర్లకు అధికమై 2లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇది ఇలా ఉంటే ప్రపంచ కుబేరుల జాబితాలో దశాబ్దాలుగా అగ్రస్థానంలో కొనసాగిన మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఇప్పుడు టాప్ 10 జాబితాలో స్థానం కోల్పోయారు. ఆయన చేసిన భారీ దానధర్మాల కారణంగా ప్రపంచ సంపద గణనలో జరిగిన మార్పులతో ఈ పరిణామం చోటు చేసుకుంది. ప్రపంచ కుబేరుల జాబితాలో ఐదో స్థానంలో ఉన్న ఆయన ఏకంగా 12వ స్థానానికి పడిపోయారు. దాదాపు 116 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుల్లో 15వ స్థానంలో ముఖేష్ అంబానీ ఉన్నారు. వంద బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8.85 లక్షల కోట్ల) క్లబ్‌లో ఉన్న ఏకైక ఆసియావాసి ఈయనే. అమెరికాలోని సంపన్న భారతీయులు 43 దేశాలకు చెందిన 125 మంది బిలీనీయర్లలో మన వాళ్లే 12 మంది. అగ్రస్థానంలో జయ చౌద్రీ, తొలిసారిగా సుందర్ పిచాయ్, సత్య నాదెళ్లకు చోటు దక్కింది. అమెరికాను ప్రవాస భారతీయులు మరింత సంపన్న దేశంగా మారుస్తున్నారు. ఫోర్బ్స్ జాబితా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తోంది. మొత్తం 43 దేశాలకు చెందిన 125 మంది ప్రవాస బిలియనీర్లు అమెరికాలో ఉన్నట్టు ఫోర్బ్స్ గుర్తించింది. వీరిలో 12 మంది భారతీయులే ఉన్నారు. ఈ సంఖ్య పరంగా ఇజ్రాయిల్‌ను మన దేశం అధిగమించింది. ఈ జాబితాలోని 10దేశాల ప్రవాస బిలియనీర్లలో మూడవ వంతు మంది భారత్‌కు చెందిన వారున్నారు. ఇజ్రాయిల్, తైవాన్, కెనడా, చైనా మరో 5 దేశాలకు చెందినవారు ఉన్నారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యా



నాదెళ్ల, నికేశ్ అరోరా తొలిసారిగా ఈ జాబితాలో చేరారు. అగ్రస్థానంలో 17.9 బి. డాలర్ల సంపదతో జయ్ చౌధ్రీ (65) అగ్రస్థానంలో ఉన్నారు. 1980 ప్రాంతంలో యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటిలో చేరడం కోసం తొలిసారిగా విమానం ఎక్కిన ఈయన 2008లో స్కాలర్ అనే సైబర్ సెక్యూరిటీ సంస్థను ఏర్పాటు చేశారు. 2018లో నాస్ డాక్‌లో లిస్ట్ అయిన ఈ కంపెనీలో ఆయనకు, ఆయన కుటుంబానికి 40 శాతం వాటా ఉంది. హిమాలయాల్లోని చిన్న గ్రామం ఈయన స్వస్థలం. 8వ తరగతి వరకు ఆ ఊరికి విద్యుత్, పదవ తరగతి వరకు సురక్షిత నీటిసరఫరాలేదు. అటువంటి ప్రాంతం నుంచి వచ్చి అమెరికాలో చదువుకుని, ఉద్యోగంలో చేరిన ఆయన.. తర్వాత తన భార్యతో కలిసి సెక్యూర్ ఐటి అనే అంకురాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత బిలియనీర్ గా మారగలిగారు. ఈ జులై నాటికి 1బిలియన్ డాలర్ల (రూ.8550 కోట్ల) కంటే అధిక సంపద ఉన్నవారితో ఈ జాబితాను ఫోర్బ్స్ ప్రకటించింది. ఇది ఇలా ఉంటే భారత దేశంలో గత ఏడాది 2024 పై యూబీఎస్ నివేదిక మేరకు 39 వేల మంది కొత్త మిలియనీర్లు అవతరించారు. అంత క్రితం ఏడాదితో పోలిస్తే వీరి సంఖ్య 4.4శాతం వృద్ధి చెందడంతో ప్రపంచవ్యాప్తంగా మిలియనీర్ల సంఖ్య వృద్ధి విషయంలో భారత్ నాలుగో స్థానంలో ఉందని, యుబీఎస్ గ్లోబల్ వెల్త్ రిపోర్ట్ వెల్లడించింది. తొలి మూడు స్థానాల్లో తుర్కియే, యూఏఈ, రష్యా ఉన్నాయి. మొత్తం 9,17,000మంది మిలియనీర్ల (కనీసం 10లక్షల డాలర్లు రూ. 8.5 కోట్ల సంపద ఉన్నవారు)లో బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా కంటే మెరుగ్గా భారత్ ఉంది. అయితే చైనా 63లక్షల మంది మిలియనీర్లతో అగ్రస్థానంలో ఉంది. మొత్తం 56 దేశాల నుంచి సమీకరించిన సమాచారం ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక ప్రకారం అమెరికా, మెయిన్ ల్యాండ్, చైనా చేతిలోనే సగానికి పైగా వ్యక్తిగత సంపద ఉంది. ప్రపంచ సంపదలో భారత్ వాటా 3.4శాతమే. ఆదాయ వృద్ధి తక్కువ, గత ఐదేళ్లుగా సగటు ఆదాయం వృద్ధి విషయంలో అట్టడుగు స్థానాల్లో ఉన్న ఆరు దేశాల్లో భారత్ కూడా ఒకటి. వచ్చే 25 ఏళ్లలో సంపద గరిష్టంగా బదలీ అయ్యే దేశాల్లో భారత్ కూడా ఒకటిగా మారుతుంది. ఈ దేశంలో ఉన్న యువ జనాభా కారణంగా ఒక తరం నుంచి మరో తరానికి సంపద బదలీ అవుతుంది. మన దేశ వ్యక్తిగత సంపదలో అగ్రగాములు అంబానీ వారసులే. దేశంలో వ్యక్తిగత సంపద విలువ రూ.1,000కోట్లకు మించిన వాణిజ్యవేత్తలతో 360 వెల్త్ వన్ సంస్థ రూపొందించిన జాబితాలో అగ్రస్థానంలో ముఖేష్ అంబానీ వారసులు నిలిచారు. తొలితరం పారిశ్రామికవేత్తలతో పాటు వారసత్వంగా వచ్చిన వ్యాపార సామ్రాజ్యాలను మరింతగా విస్తృతం చేసిన వారు ఈ జాబితాలో చోటు చేసుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంపన్నులుగా మన భారతీయులు(తెలుగు)వారు కొనసాగుతున్నారు. వీరి మూలాలైన తాత, ముత్తాతలు, వీరికి ఆ స్థాయిని కల్పించిన జన్మభూమి భారత దేశానికి తమ వంతు బాధ్యతతో సేవలు అందించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఈదేశంలో పేదరికం, అసమానతలు ఉపాధి లేమి, నిరుద్యోగం లాంటి సామాజిక రుగ్మతలను రూపుమాపాల్సిన అవసరం ఉంది. వారి సేవలను స్వాగ తించుకుంటూ భారత ప్రభుత్వం తోడ్పాటుతో పరిశ్రమలు పెట్టడానికి సౌకర్యం కల్పించి సద్వినియోగపరుచుకోవాల్సినబాధ్యత కూడా మెండుగా ఉంది. దాతృత్వంతో మన దేశంలోనిపేదరికాన్ని రూపుమాపి సోదర భారతీయుల కళ్ళల్లో ఆనందం తోపాటు దేశప్రతిష్టను పెంచడంలో ఉన్న సంతృప్తి వెలకట్టలేనిది. ప్రవాస భారతీయకుబేరులు జన్మభూమి రుణం తీర్చుకోవడంలో ఇదే శ్రేష్ఠమైన కార్యంగా భావించాలి. ●

మనవి


ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆధిపత్యం కోసమే అమెరికా సుంకాలు

## బ్రిక్స్‌దేశాలు మాకు అండగా ఉన్నాయి: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్




**మాస్కో, ఆగస్టు 5:** గ్లోబల్ సౌత్ దేశాలపై ఆధిపత్యాన్ని చెలాయించేందుకు అమెరికా ఆధునిక వలసవాద విధానాన్ని అనుసరిస్తోందని రష్యా మండిపడింది. సుంకాలు, ఆంక్షలు చరిత్ర సహజ గమనాన్ని మార్చలేవని పేర్కొంది. అంతర్జాతీయ వేదికపై స్వతంత్ర మార్గాన్ని ఎంచుకునే దేశాలపై అమెరికా రాజకీయ ప్రేరేపితమైన ఆర్థిక ఒత్తిడికి గురిచేస్తోందని విమర్శించింది. అభివృద్ధి చెందుతున్న, ఆర్థికంగా వెనుకబడిన (గ్లోబల్ సౌత్) దేశాలతో సహకారాన్ని పెంపొందించుకోవడానికి, నిజమైన బహుళపక్షవాదం, సమానత్వంతో కూడిన ప్రపంచ వ్యవస్థ సాకారానికి కృషి చేసేందుకు తమ దేశం సిద్ధంగా ఉందని రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మరియా జఖరోవా పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డజన్ల కొద్దీ దేశాలపై సుంకాలను విధించిన కొన్ని రోజుల తర్వాత మాస్కో నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. ఆయా దేశాలపై ఆంక్షలు విధించడం దురదృష్టకరం. అంతర్జాతీయ వేదికపై తన ఆధిపత్యం క్షీణించడాన్ని అమెరికా అంగీకరించలేకపోతోంది. ఈ నేపథ్యంలో తన స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ఆధునిక వలసవాదాన్ని అనుసరిస్తోంది. తనను అనుసరించేందుకు నిరాకరిస్తున్న, స్వతంత్ర మార్గాన్ని ఎంచుకునే దేశాలపై రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లు చేస్తోంది. గ్లోబల్ సౌత్ దేశాల సార్వభౌమాధికారంపై ప్రత్యక్ష ఆక్రమణ, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ప్రయత్నం చేస్తోందని రష్యా రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా తెలిపారు. ఏ సుంకాల యుద్ధాలు, ఆంక్షలు చరిత్ర సహజ గమనాన్ని ఆపలేవని తాము దృఢంగా విశ్వసిస్తున్నామని మరియా తెలిపారు. తమకు పెద్ద సంఖ్యలో భాగస్వాములు, సారూప్యత కలిగిన మిత్ర దేశాలు, గ్లోబల్ సౌత్ దేశాలు, అన్నింటికంటే ముఖ్యంగా బ్రిక్స్ దేశాలు మద్దతు ఇస్తున్నాయని పేర్కొన్నారు. చట్టవిరుద్ధమైన ఏకపక్ష ఆంక్షలను ప్రతిఘటించడానికి మాస్కో సిద్ధంగా ఉందని అన్నారు. పాశ్చాత్య దేశాలు ఒకప్పుడు ప్రోత్సహించిన స్వేచ్ఛా వాణిజ్య రంగంలో ప్రస్తుతం నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ ప్రేరేపిత రక్షణావాదం, సుంకాల అవరోధాలు ఏర్పడుతున్నా యని స్పష్టం చేశారు. కాగా, భారత్‌పై సోమవారం మరోసారి అక్కసు వెళ్లగక్కారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. గత వారం ప్రకటించిన 25 శాతం సుంకాల వడ్డింపుతో తాను ఆగబోవడం లేదని, ముమ్మందు వీటిని ఇంకా పెంచబోతున్నట్లు హెచ్చరించారు. రష్యా నుంచి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తూ విపణిలో భారీ లాభాలకు విక్రయిస్తున్న భారత్‌పై గణనీయ స్థాయిలోనే సుంకాలు పెంచబోతున్నట్లు బెదిరించారు. రష్యాతో యుద్ధంలో ఎంత మంది ఉక్రెయిన్ పౌరులు ప్రాణాలు కోల్పోయినా భారత్ పట్టించుకోవడం లేదని, అందుకే ఆ దేశంపై గణనీయంగా సుంకాలు పెంచుతానని స్పష్టం చేశారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలపై భారత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై అమెరికా, ఈయూ దేశాల అభ్యంతరాలను భారత్ గట్టిగా తిప్పికొట్టింది. యూఎస్, ఈయూ తమను లక్ష్యంగా చేసుకోవడంపై విరుచుకుపడింది. రష్యా ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా నుంచి చమురు దిగుమతులను యూఎస్ ప్రోత్సహించిందని ఎద్దేవా చేసింది. ఉక్రెయిన్ ఘర్షణ అనంతరం అంతర్జాతీయ విపణిలో తలెత్తిన పరిస్థితుల వల్లే దేశీయ ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. దేశ ప్రయోజనాల కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. తమను విమర్శించే దేశాలు రష్యాతో వాణిజ్యంలో అవసరం లేకపోయినప్పటికీ, మాస్కోతో వాణిజ్యంలో మునిగిపోతున్నాయని భారత విదేశాంగ మంత్రిత్వ విమర్శించింది.



## జమ్ముకాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** భారత రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సీనియర్ నేత, జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ (79) కన్నుమూశారు. దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఆర్టికల్ 370 రద్దు సమయంలో జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా పనిచేసి ఆయన దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచారు. సుదీర్ఘకాలం అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తుదిశ్వాస విడిచారు. 1960వ దశకంలో మీరట్‌లో విద్యార్థి నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సత్యపాల్ మాలిక్, ఐదు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలోనే గడిపారు. ఉత్తరప్రదేశ్ శాసనసభ్యుడిగా, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, పర్యాటక శాఖ సహాయ మంత్రిగా పలు ఉన్నత పదవులను ఆయన అలంకరించారు. కాంగ్రెస్, జనతాదళ్, బీజేపీ వంటి పలు పార్టీలలో పనిచేసిన అనుభవం ఆయన సొంతం. ఆయన రాజకీయ జీవితంలో అత్యంత కీలకమైన, చరిత్రాత్మకమైన ఘట్టం జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా పనిచేసిన కాలం. 2018 నుంచి 2019 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగారు. ఆయన హయాంలోనే కేంద్ర ప్రభుత్వం కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసింది. కశ్మీర్‌కు గవర్నర్‌గా వ్యవహరించిన సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రశంసలతో పాటు విమర్శలను కూడా ఎదుర్కొన్నాయి. జమ్మూకశ్మీర్‌తో పాటు బీహార్, గోవా, మేఘాలయ రాష్ట్రాలకు కూడా సత్యపాల్ మాలిక్ గవర్నర్‌గా సేవలందించారు. గవర్నర్ పదవిలో ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలపై, ముఖ్యంగా రైతుల హక్కుల కోసం ఆయన తరచూ గళం విప్పేవారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను బహిరంగంగా విమర్శించి సంచలనం సృష్టించారు. తన చివరి రోజుల్లో క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ, సామాజిక న్యాయం, బడుగు వర్గాల సంక్షేమంపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ మార్గనిర్దేశం చేశారు.



## రష్యా తరపు యుద్ధంలో పాక్, చైనా కిరాయి సైనికులు!

### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

**కీవ్, ఆగస్టు 5:** రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఉక్రెయిన్ కీలక ఆరోపణలు చేసింది. తమ దళాలు మాస్కో సైనికులతోపాటు పాకిస్థాన్, చైనాకు చెందిన కిరాయి సైనికులతో కూడా పోరాడాల్సి వస్తుందని ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలను పాక్ ఖండించింది. వోవ్‌చాన్స్క్ ప్రాంతంలోని సైనిక దళాలతో భేటీ అయినట్లు జెలెన్‌స్కీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఫ్రంట్‌లైన్‌లోని కమాండర్ల గురించి, ఆ ప్రాంతంలోని రక్షణ వ్యవస్థల గురించి వారితో మాట్లాడినట్లు తెలిపారు. డ్రోన్ సరఫరాలు పెంచడం, దళాల నియామకం, బ్రిగేడ్‌లకు ప్రత్యక్ష నిధులపై కూడా చర్చించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా చైనా, తజకిస్థాన్, పాకిస్థాన్‌తో సహా ఆఫ్రికన్ దేశాల నుంచి వస్తున్న కిరాయి సైనికులు యుద్ధంలో పాల్గొంటున్నట్లు తమ దళాలు గుర్తించాయన్నారు. దీనికి తమ ప్రతిస్పందన గట్టిగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా యుద్ధంలో పాల్గొని దేశానికి సేవ చేస్తున్న దళాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## లాస్‌ఏంజెల్స్‌లో మళ్లీ కాల్పులు: ఇద్దరు మృతి, ఆరుగురికి తీవ్రగాయాలు

**లాస్ ఏంజెల్స్, ఆగస్టు 5:** అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. లాస్ ఏంజెలెస్ నగరంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఓ పార్టీలో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. లాస్ ఏంజెలెస్ పోలీస్ డిపార్ట్‌మెంట్ (ఎల్‌ఏపీడీ) తెలిపిన వివరాల ప్రకారం, డౌన్‌టౌన్ లాస్ ఏంజెలెస్‌లోని 14వ ప్లేస్, పలోమా స్ట్రీట్ సమీపంలోని ఓ గిడ్డంగిలో ఈ ఘటన చోటుచేసుకుంది. వారాంతంలో జరిగిన హార్డ్ సమ్మర్ మ్యూజిక్ ఫెస్టివల్ అనంతరం ఈ ఆఫ్టర్ పార్టీని ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. సోమవారం తెల్లవారుజామున 1 గంట సమయంలో పార్టీలో కాల్పులు జరిగినట్టు సమాచారం అందడంతో పోలీసులు హుటాహుటిన



ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆసక్తికరంగా, కాల్పులు జరగడానికి కొన్ని గంటల ముందే, అంటే ఆదివారంరాత్రి 11 గంటల సమయంలోనే పోలీసులు ఈ పార్టీ జరుగుతున్న ప్రదేశానికి వచ్చారు. అనుమతి లేకుండా 50 మందికి పైగా పార్టీ చేసుకుంటున్నారని గమనించి, ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ సమయంలో తుపాకీ కలిగి ఉన్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి, పార్టీని ఖాళీ చేయించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే, వారు వెళ్లిన కొద్ది గంటలకే అదే ప్రదేశంలో ఈ దారుణం జరిగింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, తుపాకీ గాయాలతో పడి ఉన్న ఎనిమిది మందిని గుర్తించారు. వారిలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, 52 ఏళ్ల మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. బాధితుల వయసు 26 నుంచి 62 ఏళ్ల మధ్య ఉంటుందని చెప్పారు. ఈ దాడికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని, నిందితుల గురించి ఎటువంటి సమాచారం లేదని లాస్ ఏంజెలెస్ పోలీస్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది.

## దశాబ్దాలపాటు పాకిస్థాన్‌కు ఆయుధ సరఫరాచేసిన అమెరికా

### పాతకాలం నాటి క్లిప్పింగ్‌తో ఎండగట్టిన ఈస్టర్న్ కమాండ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** అమెరికాతో భారత్ వాణిజ్య సంబంధాల విషయంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో, భారత సైన్యం పరోక్షంగా చురకలంటించింది. ఉగ్రవాదులకు స్వర్గధామమైన పాకిస్థాన్‌కు అమెరికా దశాబ్దాల పాటు ఎలా ఆయుధాలు సరఫరా చేసిందో గుర్తుచేస్తూ ఒక పాత వార్తాపత్రిక కథనాన్ని సోషల్ మీడియాలో పంచుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పోస్ట్ ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత సైన్యంలోని ఈస్టర్న్ కమాండ్, మంగళవారం "ఆ రోజు... ఈ రోజు 1971 ఆగస్టు 5" అనే శీర్షికతో 1971 నాటి ఒక ఆంగ్ల పత్రిక క్లిప్పింగ్‌ను షేర్ చేసింది. 1954 నుంచి పాకిస్థాన్‌కు 2 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఆయుధాలు అనే శీర్షికతో ఉన్న ఆ కథనం, బంగ్లాదేశ్ విమోచన యుద్ధం జరిగిన 1971 వరకు పాకిస్థాన్‌కు అమెరికా ప్రధాన ఆయుధ సరఫరాదారుగా ఎలా కొనసాగిందో వివరిస్తోంది. భారత్ రష్యా నుంచి రాయితీ ధరకు చమురు కొనుగోలు చేయడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కారణంగా భారత్‌పై భారీగా సుంకాలు విధిస్తామని, జరిమానా వేస్తామని హెచ్చరించారు. రష్యా యుద్ధ యంత్రం వల్ల ఉక్రెయిన్‌లో ఎంతమంది చనిపోతున్నా భారత్ పట్టించుకోవడం లేదు. అందుకే భారత్ అమెరికాకు చెల్లించే సుంకాలను నేను గణనీయంగా పెంచుతానని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. గట్టిగా బదులిచ్చిన భారత్ ట్రంప్ వ్యాఖ్యలపై భారత విదేశాంగశాఖ తీవ్రంగా స్పందించింది. అమెరికా ఆరోపణలు అన్యాయమైనవి, అహేతుకమైనవని తిప్పికొట్టింది. ఉక్రెయిన్ సంక్షోభం ప్రారంభమైనప్పుడు రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునేలా అమెరికాయే చురుకుగా ప్రోత్సహించిందని గుర్తుచేసింది. అంతేకాకుండా, అమెరికా, ఐరోపా సమాఖ్య (ఈయూ) దేశాల రెండు నాల్కల ధోరణిని భారత్ ఎండగట్టింది. అమెరికా ఇప్పటికీ తన అణువిద్యుత్ కేంద్రాల కోసం రష్యా నుంచి యురేనియం హెక్సాఫ్లోరైడ్‌ను దిగుమతి చేసుకుంటోందని, కానీ భారత్‌ను విమర్శించడం సరికాదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, భారత సైన్యం అమెరికా పాకిస్థాన్ పాత బంధాన్ని గుర్తుచేయడం దౌత్యవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## అమెరికా నిర్ణయం.. ఐరోపాకు ప్రాణసంకటం

### అణుఒప్పందం నుంచి వైదొలగిన రష్యా

**మాస్కో, ఆగస్టు 5:** రష్యాను బెదరించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొన్న ఓ తొందరపాటు నిర్ణయం ఐరోపా దేశాలకు ప్రాణ సంకటంగా మారనుంది. మధ్యశ్రేణి క్షిపణులను మోహరించకుండా మాస్కో-వాషింగ్టన్‌ల మధ్య ఉన్న ఐఎన్‌ఎఫ్ (ఇంటర్మీడియట్ రేంజి న్యూక్లియర్ ట్రీటీ) ఒప్పందాన్ని ఇక ఏమాత్రం అనుసరించబోమని రష్యా ప్రకటించింది. పశ్చిమదేశాలు తమ జాతీయ భద్రతకు నేరుగా ముప్పును సృష్టించాయని ఆరోపించింది. ఈ క్రమంలో ఒప్పందాన్ని అనుసరించే పరిస్థితులు లేవని తేల్చిచెప్పింది. ఈ మేరకు రష్యా విదేశాంగ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. తాము కొన్ని రకాల క్షిపణులను మోహరించకుండా విధించుకున్న ఆంక్షలను ఇక పాటించబోమంది. అమెరికా దళాలు ఫిలిప్పీన్స్‌లో టైఫూన్ క్షిపణి లాంచర్లను మోహరించడం, ఆస్ట్రేలియా సమీపంలోని టలిస్మాన్ సాబ్రె డ్రిల్స్‌లో క్షిపణులను పరీక్షించడం దీనికి ప్రధాన కారణంగా వెల్లడించింది. మరోవైపు ట్రంప్ చర్యలు కూడా



దీనికి ఆజ్యం పోశాయి. ఇటీవలే రష్యా మాజీ అధ్యక్షుడు మెద్వదేవ్ ప్రకటనకు స్పందనగా రెండు ఒహైయో శ్రేణి అణుజలాంతర్గాములను మోహరించేలా ఆదేశాలు జారీ చేశారు.

**అసలేమిటి ఈ ఐఎన్‌ఎఫ్ ఒప్పందం..?**

1987లో అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్, రష్యా అధినేత మిఖాయిల్ గోర్బచేవ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇంటర్మీడియట్ రేంజి న్యూక్లియర్ ఫోర్స్ ట్రీటీగా దీనిని వ్యవహరిస్తారు. దీనిప్రకారం భూ ఉపరితలంపై నుంచి ప్రయోగించే మధ్యశ్రేణి రేంజి క్షిపణుల మోహరింపును నిషేధించారు. 500 కిలోమీటర్ల నుంచి 5,500 కిలోమీటర్ల మధ్యలోవి ఈ ఒప్పంద పరిధిలోకి వస్తాయి. అప్పట్లో ఐఎన్‌ఎఫ్ ట్రీటీ కారణంగా సోవియట్ అమెరికాలకు చెందిన దాదాపు 2,692 క్షిపణులను ధ్వంసం చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీనిని ప్రచ్ఛన్న యుద్ధాన్ని మలుపుతిప్పిన సంధిగా భావిస్తారు. వాస్తవానికి ఈ ఇంటర్మీడియట్ రేంజి క్షిపణుల మోహరింపుతో అమెరికా మిత్రులైన ఐరోపా దేశాలకే ప్రధాన ముప్పు. 2019లో ట్రంప్ ఈ ఒప్పందం నుంచి అమెరికాను బయటకు లాగేశారు. రష్యా సుదీర్ఘకాలంగా దీనిని ఉల్లంఘిస్తోందని ఆయన నాడు ఆరోపించారు. 9ఎం729 లేదా ఎస్‌ఎస్‌సి-8 క్షిపణులను మోహరించిందని పేర్కొన్నారు. దీనిని నాడు మాస్కో తిరస్కరిం చింది. ఇప్పుడు ట్రంప్ అణు జలాంతర్గాముల మోహరింపు ఆదేశాలు వెలువడిన మూడు రోజులకు రష్యా కూడా ఈ ఒప్పందం నుంచి బయటకు వచ్చేస్తామని ప్రకటించింది.

## హోంమంత్రిగా అమిత్‌షా రికార్డు



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ప్రధానిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఎలాంటి విరామం లేకుండా దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన ప్రధానిగా ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. మోదీ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ఓ సరికొత్త రికార్డు నెలకొల్పారు. దేశ చరిత్రలో ఎవరూ అందుకోలేని అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. దేశ చరిత్రలో అత్యధిక కాలం కేంద్ర హోంశాఖమంత్రిగా పని చేసిన వ్యక్తిగా అమిత్ షా రికార్డు సృష్టించారు. ఇప్పటి వరకూ బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీ పేరుతో ఉన్న రికార్డును షా బద్దలు కొట్టారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక అమిత్‌షా 2019లో కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేశారు. ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చింది. దీంతో షా వరుసగా రెండోసారి కూడా హోంశాఖ బాధ్యతలనే స్వీకరించారు. దీంతో షా హోంశాఖ బాధ్యతలు స్వీకరించి నేటికి ఆరు సంవత్సరాల 64 రోజులు పూర్తైంది. దాదాపు 2,194 రోజులు అమిత్ షా హోం మంత్రిగా పనిచేశారు. ఫలితంగా బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ రికార్డును షా బద్దలుకొట్టారు. 1998-1999, 1999-2004 వరకూ ఎల్‌కే అద్వానీ కేంద్ర హోంమంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. దాదాపు 2,193 రోజులు అద్వానీ ఈ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును అమిత్ షా అధిగమించారు. ఇక కేంద్ర హోం శాఖ బాధ్యతలు చేపట్టిన అమిత్ షా తన హయాంలో ఆర్టికల్ 370 రద్దు సహా అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా దేశంలో నక్సలిజంపై ఉక్కుపాదం మోపి గాలింపును తీవ్రస్థాయిలో కొనసాగించే చర్యలుచేపట్టారు.

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు, ఎగువసభలో తీర్మానానికి ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించేందుకు మార్గం సుగమం అయింది. మంగళవారం రాజ్యసభ ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ప్రతిపక్షాల తీవ్ర నినాదాల మధ్య కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తీర్మానాన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టారు. 2025 ఫిబ్రవరి 13న రాష్ట్రపతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద జారీ చేసిన మణిపూర్‌కు సంబంధించి ప్రకటన అమలులో కొనసాగింపు అనే చట్టబద్ధమైన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఇప్పటికే జూలై 30న, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించేందుకు లోక్‌సభ తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. ఎన్ బిరేన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. దాదాపు రెండు నెలలుగా రాష్ట్రాన్ని పీడిస్తున్న హింస, రాజకీయ అస్థిరత మధ్య సింగ్ రాజీనామా చేశారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356కింద అమలులోకివచ్చే ఈ నిర్ణయం ప్రకారంరాష్ట్రపతి ఇప్పుడు గవర్నర్ ద్వారా మణిపూర్ రాష్ట్ర పరిపాలనా విధులను నేరుగా నియంత్రిస్తారని అర్థం.

కేంద్ర హోంమంత్రిత్వ శాఖజారీ చేసిన భారతగెజిట్‌లో ప్రచురించబడిన ఈప్రకటన,మణిపూర్ శాసనసభఅధికారాలను పార్లమెంటుకు బదిలీ చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని సమర్థవంతంగా నిలిపివేస్తుందని పేర్కొంది.



## ఎవరు నిజమైన భారతీయులో నిర్ణయించేది జడ్జిలు కాదు..!

### పార్లమెంటు ఆవరణలో ప్రియాంక గాంధీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ఎవరు నిజమైన భారతీయుడో, ఎవరు కాదో న్యాయమూర్తులు నిర్ణయించరని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా స్పష్టం చేశారు. తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై సుప్రీంకోర్టు ఇటీవల చేసిన కొన్నివ్యాఖ్యల నేపథ్యంలో ఆమె మంగళవారం ఈ విధంగా స్పందించారు. పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడుతూ, న్యాయవ్యవస్థపై తమకు పూర్తి గౌరవం ఉందని, అయితే పౌరుల దేశభక్తిని నిర్ధారించడం వారి పని కాదని ఆమె అన్నారు. భారత సాయుధ బలగాల గురించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల పట్ల సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చిన కొద్దిసేపటికే ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష నాయకుడి ప్రాథమిక బాధ్యత. మా సోదరుడు రాహుల్ గాంధీ సైన్యానికి వ్యతిరేకంగా ఎన్నడూ మాట్లాడరు. ఆయనకు మన సైన్యం పట్ల అపారమైన గౌరవం, అభిమానం ఉన్నాయని వివరించారు. ప్రతిపక్ష నాయకుల దేశభక్తిని, పౌరసత్వాన్ని ప్రశ్నించే ప్రయత్నాలను ప్రియాంక గాంధీ తీవ్రంగా ఖండించారు.

గతంలో 2019లో రాహుల్ గాంధీ పౌరసత్వంపై ప్రశ్నలు తలెత్తినప్పుడు కూడా ఆమె ఇదేవిధంగా గట్టిగా బదులిచ్చారు. రాహుల్ గాంధీ భారతీయుడని దేశం మొత్తానికీ తెలుసు. ఆయన ఇక్కడే పుట్టారు, అందరి కళ్ల ముందే పెరిగారు. ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు, ఇటువంటి అర్థంలేని ఆరోపణలు ఎందుకని ఆమె గతంలో వ్యాఖ్యానించారు.

## పంద్రాగస్టు వేడుకలకు భద్రత డొల్ల

### డమ్మీబాంబు గుర్తింపులో వైఫల్యం, ఏడుగురు కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు దేశ రాజధాని సిద్ధమవుతున్న వేళ, ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోటలో తీవ్ర భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. భద్రతా సిబ్బంది అప్రమత్తతను పరీక్షించేందుకు నిర్వహించిన ఒక మాక్ డ్రిల్‌లో భాగంగా పెట్టిన డమ్మీ బాంబును గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏడుగురు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆగస్టు 15 వేడుకల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శనివారం స్పెషల్ సెల్ బృందం ఎర్రకోట వద్ద భద్రతను పరీక్షించేందుకు ఒక మాక్ డ్రిల్ నిర్వహించింది. సాధారణ పౌరుల వలె దుస్తులు ధరించిన స్పెషల్ సెల్ సిబ్బంది, ఎవరి కంటా పడకుండా ఒక డమ్మీ పేలుడు పదార్థాన్ని కోట ప్రాంగణంలోకి తీసుకెళ్లి రహస్యంగా ఉంచారు. అయితే, ప్రధాన ద్వారం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది దీనిని పసిగట్టలేకపోయారు. ఈ విషయం బయటపడటంతో ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని సిబ్బంది నిర్లక్ష్యంగా భావించి, బాధ్యులైన ఏడుగురు




కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లపై తక్షణమే చర్యలు తీసుకున్నారు. కొందరిని సస్పెండ్ చేయగా, మరికొందరిని మందలించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. డమ్మీ బాంబును తీసుకెళ్లిన బృందం ప్రధాన ద్వారం వద్ద భద్రతా తనిఖీలను దాటుకుని లోపలికి వెళ్లింది. సిబ్బంది దీనిని గుర్తించకపోవడం వారి అప్రమత్తతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఓ సీనియర్ పోలీస్ అధికారి వ్యాఖ్యానించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన అధికారులు ఎర్రకోట వద్ద భద్రతను పూర్తిస్థాయిలో సమీక్షించి, కట్టుదిట్టం చేస్తున్నారు. ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీతో పనిచేసే 700 ఏఐ ఆధారిత సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లతో నిఘాను పటిష్ఠం చేయనున్నారు.

# సంక్షిప్తంగా..

## పుతిన్‌పై రహస్యకుమార్తె తిరుగుబాటు

**ప్యారిస్,ఆగస్టు 5:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు వ్యతిరేకంగా ఆయన రహస్య కుమార్తెగా భావిస్తున్న యువతి చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా దూమారం రేపాయి. లక్షలాది మంది ప్రాణాలను బలిగొని, తన జీవితాన్ని కూడా నాశనం చేసిన వ్యక్తి ఆయనేనంటూ ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నో ఏళ్లుగా మౌనంగా ఉన్న ఆమె తొలిసారిగా తన తండ్రిగా భావిస్తున్న వ్యక్తిపై తిరుగుబాటు స్వరం వినిపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు, స్వెత్లానా క్రివోనోగిఖ్‌కు జన్మించిన కుమార్తెగా ఎలిజవేతా క్రివోనోగి(22)ను అంతర్జాతీయ మీడియా వర్గా



లు ఎప్పటినుంచో పేర్కొంటున్నాయి. స్వెత్లానా ఒకప్పుడు సాధారణ క్లీనింగ్ వర్కర్‌గా పనిచేసి, పుతిన్ అధికారంలోకి వచ్చాక అనూహ్యంగా అపార సంపదకు యజమానురాలయ్యారు. పండోరా పత్రాల వంటి లీకులు ఆమె ఆస్తుల వివరాలను బయటపెట్టాయి.

## తృణమూల్ ఎంపి పార్టీ చీఫ్‌విప్ పదవికి రాజీనామా



**కోల్‌కత్తా, ఆగస్టు 5:** తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో ఎంపీల మధ్య పెరుగుతున్న కలహాలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సీరియస్ అయ్యారు. పార్టీ ఎంపీలు కల్యాణ్ బెనర్జి మహువా మొయిత్రా మధ్య 'పంది','మహిళా వ్యతిరేకి', 'కొంపలు కూల్చే మహిళ'వంటి తీవ్రమైన పదాలతో సాగిన పరస్పర వాగ్వివాదంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీలో క్రమశిక్షణ పాటించాలని ఆమె ఎంపీలకు సూచించారు. ఈ ఘటన తర్వాత జరిగిన వర్చువల్ సమావేశంలో పార్టీ ఎంపీల మధ్య సమన్వయం లోపించిందని మమత చెప్పడంతో, దానికి బాధ్యత వహిస్తూ లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్ పదవికి తాను రాజీనామా చేసినట్టు కల్యాణ్ బెనర్జీ తెలిపారు. ఎంపీలు పరస్పర విమర్శలకు దిగకుండా నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్‌ఆర్‌సీ) వంటి జాతీయ సమస్యలపై ప్రభుత్వంతో పోరాడాలని మమతా బెనర్జీ సూచించారు.

## భారత సంతతి ఆటోడ్రైవర్‌పై జాతి వివక్ష దాడి

**డబ్లిన్, ఆగస్టు 5:** ఐర్లాండ్‌లో భారత సంతతికి చెందిన క్యాబ్ డ్రైవర్‌పై దారుణమైన జాతి వివక్ష దాడి జరిగింది. మీ దేశానికి మీరు తిరిగి వెళ్లిపోండి అంటూ ఇద్దరు యువకులు ఆయనపై సీసాతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటన డబ్లిన్ శివారు ప్రాంతమైన బాలిమన్‌లోని పాపిన్‌ట్రీ సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గత 23 ఏళ్లుగా ఐర్లాండ్‌లో నివసిస్తూ, పదేళ్లుగా క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న లఖ్‌వీర్‌సింగ్ తన క్యాబ్‌లో ఇద్దరు యువకులను ఎక్కించుకున్నారు. వారు కోరిన ప్రాంతానికి చేర్చిన తర్వాత, అకస్మాత్తుగా ఆ యువకులు కారు డోర్ తెరిచి, తమ వెంట తెచ్చుకున్న సీసాతో లఖ్‌వీర్ సింగ్ తలపై రెండుసార్లు బలంగా కొట్టారు. అనంతరం మీ దేశానికి వెళ్లిపోండి అంటూ జాతి వివక్ష వ్యాఖ్యలు చేస్తూ అక్కడి



నుంచి పరారయ్యారు. ఈ ఊహించని దాడితో లఖ్‌వీర్ సింగ్ తీవ్ర రక్తస్రావంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. సహాయం కోసం సమీపంలోని ఇళ్ల తలుపులు తట్టినా ఎవరూ స్పందించలేదు. చివరకు, ఆయనే అత్యవసర సేవలకు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు, పారామెడికల్ సిబ్బంది ఆయన్ను బ్యూమాంట్ ఆసుపత్రికి తరలించారు.

## కాలిఫోర్నియాలో కార్చిచ్చు.. 65వేల ఎకరాల్లో చెలరేగిన మంటలు



**వాషింగ్టన్, ఆగస్టు 5:** అమెరికాలోని సెంట్రల్ కాలిఫోర్నియాలో భారీ కార్చిచ్చు సంభవించింది. గత శుక్రవారం మొదలైన ఈ కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తోంది. ఈ క్రమంలో గాలినాణ్యత క్షీణిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. 'గిఫోర్డ్'గా పేర్కొనే ఈ కార్చి చ్చు ప్రస్తుతం 65వేల ఎకరాలకుపైగా విస్తరించింది. లాస్ ఏంజెలెస్, వెంచురా, కార్న్‌వంటి దక్షిణ కాలిఫోర్నియా కౌంటీల్లోని నివాసతులతో పాటు పొరుగునున్న లాస్‌వెగాస్‌లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. సోమవారం నాటికి 3శాతం మాత్రమే మంటలను అదుపు లోకి తీసుకురాగలిగామని అధికారులు తెలిపారు.

# దిగ్విజయంగా 2025 హజ్ యాత్ర పూర్తి చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు - రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హాసన్ భాషా

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** హజ్ యాత్ర కోసం విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ పునఃకేటాయింపు చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ముస్లిం సమాజం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హాసన్ భాషా తెలియజేశారు. వెలగపూడి సచివాలయం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హాసన్ భాషా,. సభ్యులు కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందించారు. ఆ విజ్ఞాపన పత్రంలో తెలియజేసిన అంశాలు... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం విడుదల చేయవలసిందిగా కోరుచున్నామన్నారు. దానికి సంబంధించిన మార్గదర్శకాలను పేర్కొంటూ ప్రభుత్వ ఉత్తర్వులు (బిపి) జారీ చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. 2025 సంవత్సరానికి విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ఎంచుకున్న తరువాత హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుండి హజ్ యాత్రకు వెళ్లిన 72 మంది యాత్రికులకు ఒక్కొక్కరికి రూ. 1,00,000 ల ఆర్థిక సహాయం మంజూరు చేసి విడుదల చేయవలసిందిగా కోరుచున్నమన్నారు. దీనివల్ల భవిష్యత్తులో మరింత మంది హజ్ యాత్రికులు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ను ఎంచుకునేలా ప్రోత్సహించడంలో సహాయ పడుతుందన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో 2025 హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రికి రాష్ట్ర ముస్లిం సమాజం కృతజ్ఞతలు తెలిజేస్తుందన్నారు. 2025 సంవత్సరానికి రాష్ట్రం నుండి మొత్తం 1,618 హజ్ యాత్రికులు వెళ్లగా, రాష్ట్ర ప్రభుత్వం చేసిన విస్తృత ఏర్పాట్లతో వారి యాత్ర ఆధ్యాత్మికంగా, సంతృప్తికరంగా సాగిందన్నారు. విజయవాడ లేదా గుంటూరు పరిసర ప్రాంతాల్లో జాతీయ రహదారి పక్కన 5 నుండి 6 ఎకరాల స్థలాన్ని శాశ్వత హజ్ హౌస్ నిర్మాణం కోసం దిళిదీతి ద్వారా కేటాయించవలసిందిగా రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హాసన్ భాషా తెలియజేశారు..



# ఎరువుల సరఫరా పెరిగేలా ప్రణాళిక రూపొందించాలి

**- సొసైటీలు, మార్క్‌ఫెడ్‌లకు ఎరువుల సరఫరా ఆలస్యం కాకూడదు: మంత్రి అచ్చెన్నాయుడు**

**విజయవాడ, ఆగస్ట్5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ కు అన్ని సహకార సంస్థలలో, ప్రైవేట్ కంపెనీలలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండాలని, కొరత సంభవించే అవకాశం ఉంటే ముందుగానే గ్రహించి ఎరువుల సరఫరా పెరిగేలా వ్యవసాయ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఎరువులు, వాటి సరఫరా, కొన్ని ప్రాంతాలలో యూరియా సరఫరాపై అందుతున్న సమాచారం పై మంగళవారం విజయవాడలో వ్యవసాయ అధికారులు, జిల్లా కలెక్టర్లతో మంత్రి అచ్చెన్నాయుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ రైతు ఎరువుల కోసం ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి సహకార సంస్థను అధికారులు పర్యవేక్షిస్తూ, అందరికి ఎరువులు అందుతున్నాయా లేదా అని తనిఖీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చాలా ముందు చూపుతో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తో సంప్రదించి మిగిలిన రాష్ట్రాల కంటే ఎక్కువ పరిమాణంలో ఎరువులను రాష్ట్రానికి తెప్పించినా కూడా పలు ప్రాంతాలలో యూరియా సరఫరాపై పత్రికలలో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న వార్తలు వస్తున్నాయన్న విషయాన్ని గ్రహించి వాటి కారణాల గురించి మంత్రి వాకబు చేశారు. శ్రీకాకుళం జిల్లాలో ఎరువుల కొరత అంటూ వచ్చిన వార్తలపై కలెక్టర్ ను మంత్రి ప్రశ్నించగా వంశధార ప్రాజెక్టు లో ముందుగా నీటిని విడుదల చేయడం వల్ల విస్తీర్ణం పెరిగిందని, జిల్లాకు 12000 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉందని అందుకు గాను 18000 మెట్రిక్ టన్నుల ఎరువులు (9000 సొసైటీలు+ 9000 ప్రైవేట్ కంపెనీలకు) అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ మంత్రికి వివరించారు. రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువులు కొనటానికి విముఖత చూపిస్తున్నారని , వారు గ్రామంలో ఉన్న రైతు సేవాకేంద్రాలకు ఎరువులు అందించాలని కోరుతున్నారని తెలిపారు. గతంలో ఎరువుల తక్కువ అవసరం ఉన్న ఆర్ ఎస్ కే (ళిళీరీ) లకు ఎక్కువ మొత్తంలో ఎరువులు పంపిణీ చేశారని తెలిపారు. ప్రభుత్వ కోట 50 శాతం ఎరువులు మన్యం, విజయనగరం జిల్లాల సొసైటీలు, ఆర్ ఎస్ కే (ళిళీరీ) లకు వెళ్తున్నాయని, శ్రీకాకుళం జిల్లాకు ప్రైవేట్ డీలర్ లకు వెళ్తున్నాయని తెలిపారు. ప్రైవేట్ డీలర్ల వద్ద వీఆర్ఓ ల పర్యవేక్షణలో అమ్మిస్తున్నామని తెలిపారు. నంద్యాల, అవనిగడ్డ కు సంబంధించి వచ్చిన వార్తలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, చిన్న చిన్న విషయాలను కొండంతలుగా ప్రచారం చేసి కొంత మంది ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయాలని చూస్తున్నారని, వారికి అవకాశం ఇవ్వకూడదు కలెక్టర్లకు మంత్రి సూచించారు. జులై, ఆగస్ట్ నెలలకు సంబంధించి రాష్ట్రానికి రావల్సిన బకాయి ఎరువులను వెంటనే రాష్ట్రానికి పంపాలని కేంద్రాన్ని కోరడం జరిగిందని వ్యవసాయ సంచాలకులు డిల్లీ రావు మంత్రికి వివరించారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తో మాట్లాడి త్వరితగతిన యూరియాను రాష్ట్రానికి వచ్చేలా చొరవ చూపుతామన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలకు హాలహర్వి సర్పంచ్‌కు ఆహ్వానం

**- ఉత్తమ సర్పంచ్‌గా ఎన్నికైన మల్లికార్జున**

**హాలహర్వి, ఆగస్టు 05, ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా హాలహర్వి, మండలకేంద్రమైన హాలహర్వి సర్పంచ్ మల్లికార్జునకు కేంద్ర ప్రభుత్వం నుంచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆహ్వానం వచ్చింది. ఈనెల 15వ తేదీన ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో హాలహర్వి సర్పంచ్ మల్లికార్జున పాల్గొననున్నారు. హాలహర్వి సర్పంచ్ మల్లికార్జున 2022లో సర్పంచుగా ఎన్నికయ్యారు. గడిచిన నాలుగు సంవత్సరాల్లో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, తాగునీటి సమస్య పరిష్కారం, వాటర్ షెడ్ పథకం ద్వారా రైతులకు ఇంకుడు గుంతలు, పంపింగ్ మోటార్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి గ్రామాన్ని ఆదర్శ వంతంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు వృథా చేయకుండా గ్రామ అభివృద్ధి కోసం ఖర్చు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో విద్యుత్ సౌకర్యం, పాఠశాలలో అభివృద్ధి తదితర అభివృద్ధి పనులు చేసి సర్పంచ్ మల్లికార్జున ఆదర్శంగా నిలిచారు. సర్పంచ్ మల్లికార్జున చేసిన అభివృద్ధి పనులను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆహ్వానించింది. దీంతో హాలహర్వి గ్రామ ప్రజలు సర్పంచ్ మల్లికార్జునను అభినందించారు.

# కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది



భవన నిర్మాణ సంక్షేమ బోర్డు సమావేశంలో మంత్రి సుభాష్

**మంత్రి వి.సుభాష్**

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** భవన నిర్మాణ, ఇతర రంగాల కార్మికుల, వారి కుటుంబాల సంక్షేమమ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కార్మిక, కర్మాగార, బాయిలర్స్.వైద్య బీమా సేవల శాఖామంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ.ఇతర కార్మికుల సంక్షేమశాఖ కార్యాలయంలో కార్మిక సంక్షేమ బోర్డు సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల రక్షణకు కార్మిక శాఖ అనేక చర్యలు తీసకుంటుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కార్మికులు ఊచకోతకు గురయ్యారని, కూటిమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా రంగాల కార్మికుల సంక్షేమంకు పెద్దపీట వేశామన్నారు. అందులో భాగంగానే ప్రతి పట్టణంలో అడ్డాకూలీగా రోడ్లపై గంటల తరబడి నిరీక్షించే పరిస్థితి రాకుండ వారి కోసం పక్కా భవనాలను నిర్మించాలని ప్రతిపాదనను బోర్డు సమావేశంలో తీసుకున్నామన్నారు. పైలట్ ప్రాజెక్ట్ గా విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాల్లో ఇంటిగ్రేటెడ్ కార్మిక భవనాలను నిర్మించనున్నామని, క్రమంగా ప్రతి నియోజకవర్గంలో ఒక భవనం నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేశానమన్నారు. అంతేకాకుండ కార్మకులు, వారి కుటుంబ సభ్యులు నైపుణ్యం పెంచే విధంగా వారికి నైపుణ్య శిక్షణ అందించనున్నామన్నారు. అలాగే ప్రతి ఫ్యాక్టరీలో ఒక సేఫ్టీ అధికారిని ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేస్తున్నామని, దీంతో ప్రమాదాల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడతాయన్నారు. ఇందుకోసం యూనివర్సిటీలతో ఎంఒయు చేసుకున్నామని వివరించారు.మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టగానే పెట్టుబడిదారుల్లో నమ్మకం పెరిగిందని, పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు తరలి వస్తున్నారని, దీంతో మన రాష్ట్రంలో కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఏడాదికి 50 రోజుల కంటే ఎక్కువ పనిచేసేవారిని కార్మికులుగా గుర్తిస్తున్నామని, నరేగా కార్మికులను గుర్తించడంతో రాష్ట్రంలో దాదాపు 15 లక్షల మంది కార్మికుల సంఖ్య పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో సెస్స్ వసూళ్ల శాతం పెంచటం దృష్టి సారించనున్నామని, వారి రక్షణ కోసం సెస్స్ వసూళ్లపై దృష్టిసారించామన్నారు.

## దుర్గమ్మ సేవలో మంత్రి అచ్చెన్నాయుడు



అచ్చెన్నాయుడు దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న ఇఒ

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 5, ప్రభాతవార్త దుర్గమ్మవారిని రాష్ట్ర మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు ఇఒ వికె శీనా నాయక్ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

-ఉచిత ప్రసాదానికి విరాళం:

దుర్గమ్మవారి ఆలయంలో జరిగే ఉచిత ప్రసాద వితరణకు రు.1లక్షను హైదరాబాద్‌కు చెందిన రమణారెడ్డి, అంజలి, వారి కుమారుడు లోకేష్‌రెడ్డి, కుమార్తె శరణ్య లు మంగళవారం ఆలయ ఇఒ వికె శీనా నాయక్‌కు విరాళంగా అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## సమస్యల పరిష్కారానికి 'టీ తాగుతూ చర్చించుకుందాం' కార్యక్రమానికి శ్రీకారం



కలెక్టరేట్ క్యాంటీన్ ఆవరణలో ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగుల టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం

చిత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికే ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో టీ తాగుతూ చర్చించుకుందాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జిల్లా ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు శివయ్య అన్నారు. కలెక్టరేట్‌లోని క్యాంటీన్‌లో మంగళవారం జిల్లా ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో టీ తాగుతూ చర్చించుకుందాం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఉద్యోగులు హాజరై టీ తాగుతూ వారి సమస్యలను చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు శివయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి తమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ టీ తాగుతూ చర్చించుకుందాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదికి పైగా కావచ్చినా ఉద్యోగుల సమస్యలపై ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఉద్యోగులకు 25 వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సివుందని, ఈ మొత్తంను ఎలా చెల్లిస్తుందనే విషయం అర్థం కావడం లేదన్నారు. జిల్లా కేంద్రాలు, పరిసర మండలాల్లో ఖాళీగా వున్న ప్రభుత్వ స్థలాలను ఇళ్ళ స్థలాల రూపంలో ఉద్యోగులకు ఇచ్చి వారికి ఇవ్వాల్సిన బకాయిలను జమ చేస్తే ప్రభుత్వ ఉద్యోగులకు సొంత ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించినట్లు అవుతుందని తమ యూనియన్ అభిప్రాయం అన్నారు. ఉద్యోగులకు సంబంధించి ఎదైనా సమస్యలు వుంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడానికి చర్యలు తీసుకంటామన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఈ కార్యక్రమంను చేపట్టడం లేదని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ళుగా పదవి విరమణ పొందిన ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు ఏవి అందలేదని, వారి పిల్లలకు వివాహాది కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు నరేష్‌బాబు, దేవకుమార్, బాలాజీరెడ్డి, ప్రసాద్, మనోజ్, గౌరీశంకర్, పూర్ణం, గిరి, శైలజ, సౌజన్య, విజయ, మోహన్, పయణి తదితరులు పాల్గొన్నారు.


## మామను చంపిన అల్లుడు

**- భార్యనుంచి దూరం చేశారని ఆవేశం.. కుప్పంలో సంఘటన !!**

**కుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త** తన భార్యను తనునుంచి కాపురానికి రాకుండా దూరం చేశారని భావించి మామను అల్లుడు బండరాయితో కొట్టి హతమార్చిన సంఘటన మంగళవారం చిత్తూరు జిల్లా కుప్పం పట్టణ సమీపంలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి అర్బన్ సిఐ శంకరయ్య తెలిపిన మేరకు వివరాలిలా.. కుప్పం పట్టణంకు చెందిన లక్ష్మి అనే మహిళ తన కుమార్తెను తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన రాజ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేసింది. కాగా రాజ్‌కుమార్ భార్య ఏడు నెలల క్రితం డెలివరీ అయింది. అయితే మూడు రోజులకే తన భార్యను తనతో పాటు పంపాలని రాజ్‌కుమార్ అత్త లక్ష్మిని కోరగా అనంతరం కొన్నాళ్లకు భర్త ఇంటికి వెళ్లిన లక్ష్మి కుమార్తె అనంతరం మరలా తన పుట్టింటికి చేరింది. ఈ నేపథ్యంలో సుమారు ఆర్నెల్ల కాలంగా తన భార్యను, తన కుటుంబాన్ని దూరం చేశారని అందుకు కారణం మామ అయిన తమిళనాడు రాష్ట్రం ధర్మపురికి చెందిన రామదాస్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. మంగళవారం మద్యం తాగే నెపంతో మామ రామదాస్‌ను తనతో పాటు తీసుకెళ్లిన రాజ్‌కుమార్ కమతమూరు సమీపంలో చెరువు వద్ద తన మామ రామదాస్‌ను బండరాయితో మోది హతమార్చాడన్నారు. సంఘటనా స్థలిని పరిశీలించి మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

**- 50 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం**



**నెల్లూరు క్రైమ్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** గత 5 రోజుల కిందట వేదయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీని పోలీసులు స్వల్ప కాలంలో ఛేదించారు. వివరాల్లోకి వెళితే ఈనెల ఒకటో తేదీ స్థానిక జీవిఆర్ఆర్ కళాశాల సమీపంలో ఉన్న ఖాన్ ప్రాపర్టీస్ కార్యాలయంలో చోరీ జరిగింది. ఈ చోరీపై కేసు నమోదు చేసుకున్న వేదయపాలెం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. వేదయపాలెం పోలీస్ స్టేషన్ సిఐ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది చోరీ చేసిన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో స్టేషన్ పరిధిలోని అంబర్ వుడ్ స్కూల్ సమీపంలోను అనుమానాస్పదంగా తిరుగుతున్న పఠాన్ అష్రాఫ్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా ఖాన్ ప్రాపర్టీస్ లో దొంగతనానికి పాల్పడింది అతనేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అతని వద్ద నుండి సుమారు 50 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నారు.

అతి స్వల్ప సమయంలో కేసును ఛేదించిన వేదయపాలెం పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు. త్వరితగతిన కేసులు ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు నవీన్, సాయి కళ్యాణ్, ఇతర సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## మద్యం కుంభకోణం కేసులో వైసిపి ఎంపి మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై ఎసిబి కోర్టు తీర్పు రిజర్వ్

**విజయవాడ, ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. ఏసీబీ కోర్టులో బెయిల్ పిటిషన్‌పై మంగళవారం వాదనలు ముగిశాయి. ఈ నేపథ్యంలోఈ నెల 12వ తేదీ బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేయనుంది. అయితే లిక్కర్ స్కామ్ కేసులో ఏ4గా మిథున్ రెడ్డి ఉన్నారు.ఈ కేసులో అరెస్టయిన ఆయన ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ మద్యం స్కామ్‌కు సంబంధించి ముగ్గురు వ్యక్తులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో ఎక్కడా మిథున్ రెడ్డి పాత్ర ఉందని చెప్పలేదంటూ ఆయన తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకు వెళ్లారు. అలాగే మిథున్ రెడ్డిని సిట్ కస్టడీకి ఇప్పటి వరకు కోరలేదని వారు తెలిపారు. లిక్కర్ స్కామ్ జరగలేదని.. ఈ కేసులో అసలు మిథున్ రెడ్డి పాత్ర లేదని ఏసీబీ కోర్టుకు వారు స్పష్టం చేశారు. దాంతో మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు.సెట్ తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. డి కార్ట్ లాజిస్టిక్స్, స్నై ఆగ్రోస్ నుంచి నగదు మిథున్ రెడ్డి కంపెనీల్లో బదిలీ జరిగింది ఏసీబీ కోర్టుకు ప్రభుత్వ తరఫు న్యాయవాది ఈ సందర్భంగా తెలియజేశారు. పీఎల్ఆర్ కంపెనీ లావాదేవీల్లో లిక్కర్ నగదు బదిలి అయినట్లు సిట్ ఇప్పటికే గుర్తించిందని ప్రభుత్వ తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఈ నేపథ్యంలో మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు చేయవద్దంటూ కోర్టును అభ్యర్థించారు. మంగళవారం ఈ వాదనలు విన్న ఏసీబీ కోర్టు తన తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది ,ఇక ఇదే కేసులో నిందితునిగా ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి బెయిల్ పిటిషన్‌పై కోర్టు విచారించింది.విచారణ మరల వాయిదా వేసింది.

## సీమ,అజ్మీర్‌ల మీదుగా కోయంబత్తూరు-జైపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 5,ప్రభాతవార్త** రాయలసీమ ముస్లింల ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన అజ్మీర్‌ల మీదుగా కోయంబత్తూరు,జైపూర్, కోయంబత్తూరుల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. కోయంబత్తూరు నుంచి జైపూర్ వెళ్లేనెంబర్ 06181ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈనెల 7నుంచి సెప్టెంబరు 4వరకు ప్రతి గురువారం తెల్లవారు జామున 2.30గంటలకు కోయంబత్తూరులో బయలుదేరి రెండోరోజు మధ్యాహ్నం 1.25గంటలకు జైపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో జైపూర్ నుంచి కోయంబత్తూరు వెళ్లేనెంబర్ 06182ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10నుంచి సెప్టెంబరు 7వరకు ప్రతి ఆదివారం రాత్రి 10.15గంటలకు జైపూర్‌లో బయలుదేరి మూడవరోజు ఉదయం 8.30గంటలకు కోయంబత్తూరు చేరుకుంటుంది.ఈ రైలు సర్వీసులు తెలుగు రాష్ట్రాల్లో రేణిగుంట, కడప,ఎర్రగుంట్ల,గుత్తి,డోన్,కర్నూలు,గద్వాల,మహబూబ్‌నగర్,కాచిగూడ,కామారెడ్డి,నిజామాబాద్ స్టేషన్‌లతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్,రాజస్థాన్ రాష్ట్రాలలోని ముఖ్యమైన స్టేషన్లలో నిలుస్తాయి.

## వైయస్ఆర్‌సిపి ఎంపి మిథున్ రెడ్డి పై చంద్రబాబు తప్పుడు కేసులు బనాయించారు

**ఆరోపించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ**

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో ఆగస్టు 5 (ప్రభాతవార్త):** వైయస్ఆర్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పై సిఎం చంద్రబాబు నాయుడు అన్యాయంగా తప్పుడు కేసులు బనాయించి సెంట్రల్ జైల్లో పెట్టించారని మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ,పినిపే విశ్వరూప్ లు విమర్శించారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ములాఖత్ అయ్యేందుకు వచ్చిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి ఎంపీ మిథున్ రెడ్డి పై చంద్రబాబు నాయుడు అన్యాయంగా తప్పుడు కేసులు పెట్టినందుకు జైల్లో ఉన్న ఎంపీ మిథున్ రెడ్డిని కలిసేందుకు వచ్చానన్నారు.అధికార బలంతో ఎన్ని తప్పుడు కేసులు బనాయించినా కోర్టులో వాటిని రుజువు చేయలేరని త్వరలోనే మిథున్ రెడ్డి నిర్దోషిగా బయటకు వస్తారని రామచంద్రారెడ్డి అన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమై వారిని తప్పుదోవ పట్టించేందుకు ప్రతి పక్ష నేతలపై కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు.

జైలు దగ్గర కలిసిన ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్పర్సన్,రుడా మాజీ చైర్పర్సన్ మేడపాటి షర్మిళ రెడ్డి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి,మాజీ పార్లమెంట్ సభ్యులు వంగ గీతా,మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా,జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలకృష్ణ, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేలో ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి రూ.8.25కోట్ల బకాయిల చెల్లింపులు



పదవి విరమణ చేసిన రైల్వే సిబ్బందికి బకాయిలను అందచేస్తున్న డిఆర్ఎం గుప్తా

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 5,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లో జూలై మాసంలో ఉద్యోగ విరమణ గావించిన సిబ్బందికి డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా రూ.8.25కోట్ల బకాయిలను, పెన్షన్ సంబంధిత కీలక పత్రాలను లబ్దిదారులకు అందచేశారు. స్థానిక డిఆర్ఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన బకాయిల చెల్లింపుల కార్యక్రమంలో డివిజన్ పరిధిలో జూలై నెలలో వివిధ విభాగాలలో,స్టేషన్లలో పనిచేసిన 15మంది రైల్వే సిబ్బంది పదవి విరమణ చేశారు. వీరికి రూ.7,11,14,331లను,వీరితో పాటు వివిధ కారణాల వల్ల ఉద్యోగ విరమణ చేసిన మరో 8మందికి సంబంధించి రూ.1,14,39,256లను కలిపి మొత్తం 23మంది లబ్దిదారులకు రూ.8,25,53,587లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపిఓహెచ్ఎల్ఎన్ ప్రసాద్, సీనియర్ డిఎఫ్ఎం వై.సందీప్,పర్సనల్ బ్రాంచి సెటెల్మెంట్ విభాగం చీఫ్ ఆఫీస్ సుపరింటెండెంట్ మాబూ,పర్సనల్,అకౌంట్స్,విభాగాలకు చెందిన సంబంధిత అధికారులు,వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ సబార్డినేట్లు తదితరులు పాల్గొన్నారు.

## మెప్మా ఉద్యోగులకు అదనంగా రూ.10 వేలు అలవెన్స్

**త్వరలోనే అధికారిక ఉత్తర్వులు**

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** తెలంగాణలోని మెప్మా ఉద్యోగులకు శుభవార్త. త్వరలోనే అలెవెన్సులతో కూడిన పూర్తి జీతం అందనుంది. రూ.10 వేల అలవెన్సు అదనంగా ఇవ్వనున్నారు. గత యేడాది ఆగస్టులో సెర్ప్ సిబ్బందితో సమానంగా పూర్తి పేస్కేల్ పొందుతున్న 378 మంది ఉద్యోగులకు.. మే నెల నుంచి తగ్గిపోయిన జీతాలు త్వరలో మళ్లీ పూర్తి స్థాయిలో రానున్నాయి. అలవెన్సుల విషయమై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఆధారంగా..వారికి తిరిగి రూ.32 వేల వరకు జీతం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.పురపాలక సంస్థల్లో పేదరిక నిర్మూలన పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు త్వరలో ప్రభుత్వం నుంచి ఒక శుభవార్త అందనుంది. వారికి అన్నిరకాల అలవెన్సులతో కూడిన పూర్తి వేతనం ఇవ్వ డానికి ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం. ప్రస్తుత వేతనంతో పాటు అదనంగా రూ.10 వేలు ఇచ్చేందుకు సర్కార్ రెడీగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు త్వరలోనే జారీ కానున్నాయని ఉన్నత స్థాయి వర్గాల ద్వారా తెలిసింది. కాగా, మెప్మాలో పనిచేస్తున్న 378 మంది ఉద్యోగులకు గత యేడాది ఆగస్టులో సెర్ప్ సిబ్బంది మాదిరిగానే పూర్తి పేస్కేల్ అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వారు ఈ ఏడాది ఏప్రిల్ వరకు ప్రతి నెలా సుమారు రూ.32,000 వేతనం పొందేవారు.అయితే మే నెల నుంచి వారి వేతనంలో దాదాపు రూ.10 వేల వరకు తగ్గించి ఇవ్వడం ప్రారంభించారు. భవిష్యత్తులో ఆర్థికపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండటానికి అలవెన్సులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ, అలవెన్సులతో కూడిన పూర్తి వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

## లేఔట్ క్రమబద్ధీకరణ పథకం నోటిఫికేషన్ గడువులోగా చేసిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకే అనుమతి

**- పురపాలక ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్**

**విజయవాడ,ఆగస్టు 5,ప్రభాతవార్త ప్రతినిధి:** లేఔట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) నోటిఫికేషన్ జారీ అయిన జులై 26వ తేదీ నుంచి నిర్ధేశించిన 90 రోజుల గడువులోగా ధరఖాస్తులు చేసుకోనట్లైతే...ఆ తర్వాత అనుమతించేది లేదని పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన పోర్టల్ హెచ్‌టిటిపిఎస్:/ఆర్ఎస్‌డిటిసిపి.ఎపి.జిఓవి.ఇన్ ద్వారా ధరఖాస్తులు చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో సూచించారు.2025 జూన్ 30కి ముందు రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లే క్రమబద్ధీకరించుకునే వీలుంది.వ్యక్తిగతంగా ప్లాట్ యజమానులు,కాలనీ సంక్షేమ సంఘాలు,డెలపర్లు ధరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్క ప్లాట్ అయినా నిర్ధేశించిన కటాఫ్ తేదీకి ముందు విక్రయించినా...లేఔట్ మొత్తం క్రమబద్ధీకరణకు అర్హత సాధిస్తుంది. అమరావతి రాజధాని ప్రాంతం మినహా మిగిలిన మున్సిపాలిటీలు,పట్టణాభివృద్ధి సంస్థలు,మాస్టర్‌ప్లాన్ గల గ్రామ పంచాయితీల్లో నిబంధనలకు లోబడి లేఔట్‌లు క్రమబద్ధీకరించుకోవచ్చు'అని సురేష్‌కుమార్ పేర్కొన్నారు.ఫీజుల్లోనూ రాయితీ...'క్రమబద్ధీకరణకు నిర్ణయించిన రుసుములు(ఫీజులు) ధరఖాస్తు చేసిన 45 రోజుల్లోగా చెల్లిస్తే ఫీజు మొత్తంలో 10%రాయితీ,90 రోజుల్లోగా చెల్లిస్తే 5% రాయితీ వర్తిస్తుంది. ప్రభుత్వ భూములు,చెరువులు,రహదారులకు కేటాయించిన భూములు,వివాదాస్పద స్థలాలు,వరద ముప్పు ప్రాంతాలు,గ్రీన్ బఫర్ జోన్లు,తీరప్రాంత నియంత్రణ మండలి (సీఆర్‌జడ్) పరిధిలో ప్లాట్లు,లేఔట్లలో ఎల్ఆర్ఎస్ అనుమతించరు. క్రమబద్ధీకరణ కింద వసూలు చేసిన ఫీజు మొత్తాలు ఆయా ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకే ప్రభుత్వం ఖర్చు చేస్తుంది'అని సురేష్‌కుమార్ వివరించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు..

## 8న కేంద్రమంత్రి బండి సంజయ్ వాంగ్మూలం

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాత వార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబం ధించి కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ నెల 8న ఈ కేసు ను విచారిస్తున్న సిట్ అధికారుల ఎదుట హాజరు కానున్నారు. ఈ మేరకు ఆయన సిట్ అధికారులకు మంగళవారం నాడు లేఖ ద్వారా సమాచారం అందించారు.

# ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు రూ.700 కోట్లు చెల్లింపు

## నిధుల కొరత లేకుండా చర్యలు

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటోంది. ఇప్పటివరకు రూ.700 కోట్లు విడుదల చేయగా.. ఆగస్టు 4న ఒక్కరోజే రూ.130 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశారు. గృహ నిర్మాణాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి సోమవారం డబ్బులు బదిలీ చేస్తున్నారు. ఈ పథకం కోసం హడ్కో నుంచి రూ.500 కోట్ల లోన్ కూడా తీసుకున్నారు. ప్రస్తుతం లక్షన్నరకుపైగా ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. 6గ్యారంటీలలో భాగంగా.. ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షన్నరకు పైగా ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ మేరకు లబ్దిదారులకు ఎప్పటికప్పుడు అకౌంట్లలో డబ్బులు జమ చేస్తోంది. ప్రభుత్వం ఇప్పటివరకు రూ.700 కోట్లు విడుదల చేసింది.

ఇళ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి, నిధులు ఆలస్యం కాకుండా ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా డబ్బు బదలీ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 3,08,702 ఇళ్లను మంజూరు చేయగా వాటిలో 1,77,932 ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని అధికారులు తెలిపారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు లబ్దిదారులకు రూ.5 లక్షల సాయాన్ని మొత్తం నాలుగు దశల్లో అందజేయనున్నారు. ఈ నెల 4నఒక్కరోజే రూ.130 కోట్లు లబ్ది దారుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతి సోమవారం లబ్దిదారుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ప్రారంభించే సమయంలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధుల కొరత రాకుండా చూస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ హామీకి అనుగుణంగా.. నిధుల విడుదలలో ప్రభుత్వం గ్రీన్ ఛానెల్ విధానాన్ని అనుసరిస్తోంది. లబ్ధిదారులకు సకాలంలో నిధులు విడుదల చేసేందుకు గృహ నిర్మాణ పథకం కోసం హడ్కో నుంచి రూ.500 కోట్ల లోన్ కూడా సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల హౌసింగ్ బోర్డు ఓపెన్ ప్లాట్లు, రాజీవ్ స్వగృహ ప్లాట్లను వేలం నిర్వహించడం ద్వారా వచ్చిన ఆదాయాన్ని కూడా ఇందిరమ్మ ఇండ్ల పథకానికే ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం వేగవంతంగా ముందుకు సాగుతుందని.. నిధుల కొరత లేకుండా లబ్దిదారులకు సకాలంలో సాయం అందుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో హౌసింగ్ సెక్రటరీ, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ అన్ని జిల్లాల అధికారులతో ఇళ్ల నిర్మాణం పురోగతి, సమస్యల గురించి చర్చించిన సంగతి తెలిసిందే.



మంగళవారం ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంత్రులు సీతక్క, పొన్నం తదితరులు

# ఉపాధి హామీ నిధులు పెంచాలి

## కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో మంత్రి సీతక్క భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో మంగళవారం సమావేశమయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్‌తో కలసి కేంద్ర మంత్రితో భేటీ అయి శాఖపరమైన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులను పెంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గత ఏడాది కేంద్రం 12 కోట్ల పని దినాలు మంజూరు చేసినప్పటికీ, ఈ సంవత్సరం కేవలం 6.5 కోట్ల పని దినాలకే పరిమితం చేయడం గ్రామీణాభివృద్ధికి అడ్డంకిగా మారిందని ఆమె పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధితో పాటు మోలిక సదుపాయాలు కూడా అందిస్తున్నామని తెలిపారు. ఉపాధిపై ఆంక్షలు లేకుండా నిధులను పెంచాలని కోరుతూ వినతిపత్రాన్ని కేంద్రమంత్రికి అందచేశారు. సీతక్క విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు సమాచారం.

# నేడు దోస్త్ స్పెషల్ ఫేజ్ సీట్ల కేటాయింపు

## సీట్లు పొందిన వారు 8 వరకు కాలేజీల్లో చేరాలి

### 11, 12 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్ లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా స్పెషల్ ఫేజ్‌లో వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి నేడు(బుధవారం) సీట్ల కేటాయింపు చేయనున్నారు. స్పెషల్ ఫేజ్ దరఖాస్తు గడువును మొదట జులై 25 నుంచి 31 వరకు అవకాశం కల్పించగా.. దానిని కాస్త ఈ నెల 2 వరకు పొడిగించారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకొని సీటు రాని వారు.. కొత్త వారితోపాటు ఈ నెల 3 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు. ఇప్పటికే కాలేజీల్లో చేరిన వారు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అనుమతించలేదు. ఈ నెల 3 వరకు వెబ్ ఆప్షన్లను ఇచ్చిన వారికి నేడు సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 8 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి అవకాశం కల్పించగా.. 6 నుంచి 8 వరకు కాలేజీల్లో చేరాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీలతోపాటు ఎయిడెడ్ కాలేజీల్లో ఉన్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో చేరడానికి ఆగస్టు 11, 12 తేదిల్లో స్పాట్ అడ్మిషన్లకి అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. స్పాట్ అడ్మిషన్లు పొందడానికి నోకల్, నాన్‌లోకల్ విద్యార్థులు అర్హులని.. అయితే స్పాట్ అడ్మిషన్లలో సీటు పొందిన వారు స్కాలర్‌షిప్ పొందడానికి అర్హులు కాదని వెల్లడించారు.



సంఘీభావం తెలుపుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తదితరులు

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు పార్లమెంట్‌లో చట్టం చేయాలి

## సిపిఎం నేతల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 5, ప్రభాతవార్త:** బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలుకై పార్లమెంట్‌లో చట్టం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, ఎస్.వీరయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర బీజేపీ పార్లమెంట్ సభ్యులు పార్లమెంటులో ఒత్తిడి చేయాలని, లేదా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా నిర్వహించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నానుద్దేశించి వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లకై రాష్ట్రంలో కులగణన చేసి, వచ్చిన రిపోర్ట్ ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేసి, తీర్మానాన్ని కేంద్రానికి పంపినప్పటికీ, రాష్ట్రపతి ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ఆడుతున్న నాటకాలను ఎండగట్టాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధనకై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ధర్నా కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి యాదయ్య, హైదరాబాద్ సెంట్రల్ కార్యదర్శి వెంకటేష్, సెక్రటేరియట్ సభ్యులు బండారు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్ల కోసం ఉద్యమానికి సిద్ధం

## నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలో ఉద్యమానికి సిద్ధమైనట్లు నాగర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లు రవి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి తోపాటు కేబినెట్ మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు 42 శాతం బిసి రిజర్వేషన్ల కోసం ఏఐసిసి నేతలతో కలిసిన ఆందోళన చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇదే అంశంపై రాష్ట్రపతిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరినట్లు వెల్లడించారు. రాష్ట్రపతి దగ్గర రెండు బిల్లులు, ఒక ఆర్డినెన్స్ పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని ఆమోదించాలని కోరామన్నారు. రాష్ట్రపతిని కలిసి ఆ బిల్లుల ప్రాధాన్యత వివరించాలని ప్రయత్నిస్తున్నామని, ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారని తెలిపారు.

రాష్ట్రపతిని కలవడానికి అపాయింట్‌మెంట్ కోరాం, కానీ ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లేదు. బుధవారం, గురువారం గానీ రాష్ట్రపతిని కలిసే అవకాశం ఇవ్వోచ్చని ఆశిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున ప్రతినిధుల బృందం వెళ్లి రాష్ట్రపతిని కలుస్తామని ఎంపి మల్లు రవి వివరించారు. వారం పది రోజుల కిందట లేఖ రాసినట్లు, ఇక్కడ రాజ్యసభలో లీడర్ ఆఫ్ అపోజిషన్‌తో వెళ్లి కలుస్తామని వివరించారు. రాష్ట్రపతి కూడా బడుగు బలహీన వర్గాల నుంచి వచ్చారు. కాబట్టి బిసి రిజర్వేషన్ బిల్లుల ప్రాధాన్యతను గుర్తిస్తారని ఆశిస్తున్నాం. ఆగస్టు 6న జరగబోయే ధర్నాలో పాల్గొనాలని దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎంపిలే కాకుండా.. ఇండియా కూటమికి చెందిన ఎంపిలను కూడా ఆహ్వానించామన్నారు. ఎంపిలు వారి సమయానికి అనుకూలంగా వస్తారని ఆశిస్తున్నట్లు, ఉదయం 11 గంటలకు ధర్నా ప్రారంభం అవుతుందని, ధర్నా ముగింపు సమయంలో రాహుల్ గాంధీ పాల్గొంటారని అని మల్లు రవి వెల్లడించారు.

# రాష్ట్రానికి 2 క్రిటికల్ మినరల్ రీసెర్చ్ సెంటర్లు

## దేశవ్యాప్తంగా 7 కేంద్రాలకు ప్రణాళిక

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** తెలంగాణకు కీలకమైన ప్రాజెక్టులు రాబోతున్నాయి. ఇండియాలోనే అత్యవసరంగా కావాల్సిన కీలక ఖనిజాలపై జరగనున్న 7 రీసెర్చ్ సెంటర్లను కేంద్ర ఏర్పాటు చేస్తోంది. వాటిల్లో రెండు రీసెర్చ్ సెంటర్లు రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కీలకమైన నిర్ణయాన్ని కేంద్రం తీసుకుంది. ఈ రెంటిలో ఒకటి ఐఐటి హైదరాబాద్ కాగా, మరొకటి రాష్ట్రంలోని హాకీంపేట్‌లో గల నాన్స్ ఫామ్స్ టెక్నాలజీ డెవెలప్‌మెంట్ సెంటర్ (ఎన్‌ఎఫ్‌టిడిసి)లో క్రిటికల్ మినరల్ రీసెర్చ్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. ఇప్పుడున్న టెక్నాలజీతో పాటు, ఫ్యూచర్‌కి కావాల్సిన ఎనర్జీ, బ్యాటరీలు, స్పేస్ లాంచ్‌లు, డిఫెన్స్ టెక్నాలజీ ఇవన్నీ ఓ ప్రత్యేకమైన మినరల్స్ మీదే ఆధారపడి ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే కేంద్రం నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ఏర్పాటు చేసింది. ఈ మిషన్ కింద రూ16,300 కోట్లు బడ్జెట్ కేటాయింపులు జరిపింది. ఇవే కాకుండా మరో రూ.18 వేల కోట్లు పీఎస్‌యూల నుంచి తీసుకోనుంది. మొత్తం దేశాన్ని కవర్ చేసేందుకు ఏడేళ్ల ప్లానింగ్ రెడీగా ఉంది. ఈ ప్లాన్‌లో భాగంగానే దేశవ్యాప్తంగా 7 సెంటర్స్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తోంది.

# ముగిసిన ఎడ్‌సెట్ వెబ్‌ఆప్షన్లు

## నేడు ఎడిట్‌కు అవకాశం.. 9న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా మంగళవారంతో వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ ముగిసింది. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 9న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీట్లు పొందిన వారు ఈ నెల 11 నుంచి 14 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆయా కాలజీల్లో చేరాల్సి ఉంటుంది. ఈ నెల 18 నుంచి క్లాసులను ప్రారంభించాలని ఇప్పటికే ప్రకటించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఎడ్ సెట్-2025కి సంబంధించిన నోటిఫికేషన్‌ను జులై 14న జారీ చేయగా.. జులై 21 నుంచి దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించారు. ఎడ్ సెట్-2025లో అర్హత సాధించిన అభ్యర్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవడానికి జులై 21 నుంచి 31 వరకు అవకాశం కల్పించారు. ఇదే సమయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను జులై 23 నుంచి 26 వరకు నిర్వహించారు. కౌన్సెలింగ్‌కి అర్హులైన వారి జాబితాను శనివారం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. కౌన్సెలింగ్‌కి అర్హత సాధించిన వారు సోమ, మంగళవారాల్లో రెండు రోజులు వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి నేడు(బుధవారం- నెల 6న) ఆప్షన్లను ఎడిట్ చేసుకోవడానికి అవకాశమిచ్చారు. ఎడ్ సెట్ కౌన్సెలింగ్ మొదటి విడత సీట్ల కేటాయింపు ఈ నెల 9న చేపట్టనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి.. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 11 నుంచి 14 వరకు కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది.

# విషాహారం తిని 150 గొర్రెలు మృతి



**మునగాల, ఆగస్టు 5, ప్రభాతవార్త:** విష ఆహారం తిని 150 గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మొద్దుల చెరువులో చోటు చేసుకుంది. రేపాల పశు వైద్య అధికారి డాక్టర్ మమత తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, ధన్వాడ మండలం, హనుమాన్ పల్లి గ్రామానికి చెందిన కొర్ల శివకుమార్ అనే గొర్రెల పెంపకదారుడు రెండు రోజులుగా తనకున్న గొర్రెల మందను మండల పరిధిలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ కట్టపై మేపుతుండగా గత శనివారం గొర్రెల మంద లేటోనా కెమెరా అనే విషతుల్య మొక్క తినడం ద్వారా 150 గొర్రెలు అస్తవ్యస్తతకు గురై అడ్డం పడగా గొర్రెల పెంపకదారుడు శివకుమార్ అప్రమత్తమై కాపాడుకునే ప్రయత్నంలో నీడ నిమిత్తమై గదిలోఉంచగా, సోమవారం సాయంత్రం చూసేసరికి 150 గొర్రెలు ఎక్కడికక్కడ చనిపోగా, ఇంకా 100 గొర్రెలు అస్తవ్యస్తతకు గురై ఉన్నాయి. అని ఆమె తెలిపారు, విషతుల్య మొక్క తినడం వల్ల ఎండకు గొర్రెలు అస్తవ్యస్తతకు గురై గత రెండు రోజులుగా సరైన వైద్యం లేక మరణించాయని తెలిపారు.

సదరు గొర్రెల పెంపకదారులు మన ప్రాంతానికి చెందిన వారు కాకపోవడంతో వారు తమ పశువైద్య శాఖ వారికి సమాచారం ఇవ్వలేదని ఆమె తెలిపారు, గొర్రెలు చనిపోవడంతో సుమారు రైతుకు 15 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని ఆమె తెలిపారు, చనిపోయిన గొర్రెల, సంఘటన స్థలాన్ని సిఐ రామ కృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ రామారావు, సందర్శించి చనిపోయిన గొర్రెల మందను పరిశీలించారు.

# 42 శాతం బిసి రిజర్వేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

## బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని, కామారెడ్డి డిక్లరేషన్ అమలుచేసి తీరుతామని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని దానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపేలా చేయాల్సిన బాధ్యత బిజెపి రాష్ట్ర నేతలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ అంటేనే త్యాగాల పార్టీ అన్నారు. సోనియా, రాహుల్‌లు ప్రధాని అయ్యే అవకాశం ఉన్నా త్యాగం చేశారని పేర్కొన్నారు. గతంలో పరిపాలించిన ప్రభుత్వం కనీసం ఒక్క రేషన్‌కార్డు ఇచ్చే ఆలోచన కూడా చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్ల అప్పులు చేసి కూర్చుంటే వాటిపై ప్రతినెలా 7వేల కోట్ల వడ్డీ కట్టవలసి వస్తుందని అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో పార్టీ ఉందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లే అవసరం కార్యకర్తలపై ఉందని నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు.



నూతి శ్రీకాంత్‌గౌడ్

## పెద్దపల్లి సమావేశం రసాభాస

# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి ఎదుటే పార్టీలో భగ్గుమన్న విభేదాలు

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా సాక్షి గా జిల్లా నాయకత్వంలో విభేదాలు భగ్గుమన్నాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన రామచందర్ రావు మొట్టమొదటిసారిగా పెద్దపల్లి జిల్లా కేంద్రానికి వచ్చారు. ఆయనకు బిజెపి పార్టీ నాయ కులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. భారీ ఎత్తున ఒగ్గు డోలు కళాకారులతో ర్యాలీ నిర్వహించారు. అడుగడుగునా గజమాలలు వేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈక్రమంలో బిజెపి వివిధ వర్గాలకు చెందిన నాయకులకు, కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. దీంతో పెద్దపల్లి పోలీస్ యంత్రాంగం ఇరువర్గాలను వారిని చెదరగొట్టారు. అనంతరం ఎంబి గార్డెన్‌కు చేరుకున్న అనంతరం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రారావు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో బిజెపి బలంగా ఉందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికలకు ముందు బిఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేంద్రమంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పోరాటాలు చేశారని, ఆ ఫలితం కాంగ్రెస్ పార్టీ అనుభవిస్తుందని అన్నారు. అయినప్పటికీ రాష్ట్రంలో పార్టీ బలమైన శక్తిగా అవతరించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని పూర్తిగా నిరక్ష్యం చేసిందని ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి లక్ష కోట్లు దోచి, తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఎరువులు సరఫరా చేస్తున్నప్పటికీ బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ చేసిన ఘనత బిజెపికే దక్కుతుందని అన్నారు. అదేవిధంగా ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం విస్తరణకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిందని తెలిపారు. పార్టీలో అంతర్గత విభేదాలు పక్కన పెట్టి గెలుపు కోసం అందరూ కృషి చేయాలని కోరారు.



ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. గత ఎన్నికలలో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని అన్నారు. ఎమ్మెల్సీ మల్క కొమురయ్య పార్టీలో కష్టపడి పని చేస్తే తగిన ప్రతిఫలం లభిస్తుందని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా 95 శాతం మంది ఉపాధ్యాయులు తనకు మద్దతు ప్రకటించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్ల మనోహార్ రెడ్డి తన అనుచరులతో బిజెపిలో తీర్థం పుచ్చుకున్నారు. బిజెపి రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రా రావు నల్ల మనోహార్ రెడ్డికి, ఆయన అనుచరులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, గోమాస శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణా రెడ్డి, కాసిపేట లింగయ్య, జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ రెడ్డి, కందుల సంధ్యారాణి, చంద్రుపట్ల సునీల్ రెడ్డి, కన్నం అంజయ్య, నారాయణ రెడ్డి, మీసా అర్జున్ రావు, సీనియర్ నాయకులు చిలారపు పర్వతాలు, జంగ చక్రధర్ రెడ్డి, పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, రాజగోపాల్ తదితరులున్నారు.

# గురుకులాల్లో మళ్లీ ఫుడ్‌పాయిజన్

## మూడు జిల్లాల్లో 65 మంది విద్యార్థులకు అస్వస్థత

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** తెలంగాణలోని సంక్షేమ గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ సంఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఆహారం విషతుల్యమై విద్యార్థులు తరచూ అస్వస్థతలకు గురవుతున్నారనే విమర్శలు ఇప్పటికే వెల్లువెత్తుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట సంక్షేమ గురుకులాల్లో ఆహారం విషతుల్యమై ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్రంలోని ఖమ్మం, భూపాలపల్లి, ఆసిఫాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. రాష్ట్రంలోని మొగుళ్లపల్లి, కల్లూరు , రెబ్బెన గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ అయి, 65 మంది అస్వస్థతకు గురై దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. రాష్ట్రంలోని భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని కొరికిశాల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఉదయం కిచిడీ తిన్న 31 మంది విద్యార్థినులు కడుపు నొప్పితో బాధపడ్డారు. మొగుళ్లపల్లి పీహెచ్‌సీలో 18 మంది చికిత్స పొందుతుండగా, 13 మందిని అంబులెన్స్‌లో చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అలాగే ఖమ్మం జిల్లాలోని కల్లూరులో 30 మందికి వాంతులు ఖమ్మం జిల్లా కల్లూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఆశ్రమ వసతిగృహంలో ఉదయం కిచిడీ తిని పాఠశాలకు వెళ్లిపోయారు. గంట వ్యవధిలోనే వారిలో 30 మంది విద్యార్థినులు సొమ్మసిల్లి పడిపోయారు. ఉపాధ్యాయులు వారిని వెంటనే సీహెచ్‌సీకి తరలించారు. అలాగే ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు రాత్రి భోజనంచేసి పడుకున్నారు. కొద్దిసేపటికే స్పందన, సంజన, సంకీర్తన తీవ్రఅస్వస్థతకు గురికాగా సిబ్బంది బెల్లంపల్లి దవాఖానకు తరలించారు. సంకీర్తన కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు.

# 2.24 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల కొరత

## కేంద్రమంత్రి నడ్డాకు ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** రాష్ట్రానికి కేటాయించిన యూరియాను సరఫరా చేయాలని కేంద్రమంత్రి నడ్డాను చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రికి లేఖ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన యూరియా సరఫరా తగ్గిందని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రానికి కేటాయించిన మొత్తం యూరియా పరిమాణం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు (ఎల్‌ఎంటి), అయితే, జూలై 31, 2025 నాటికి, ఏప్రిల్ నుండి జూలై వరకు మొత్తం 6.60 ఎల్‌ఎంటి కేటాయింపులకు బదులుగా 4.36 ఎల్‌ఎంటి యూరియా మాత్రమే సరఫరా చేశారని, దీని ఫలితంగా 2.24 ఎల్‌ఎంటి కొరత ఏర్పడిందన్నారు. అంతేకాకుండా, ఆగస్టు నెలలో వాస్తవ అవసరం దాదాపు 3.50 ఎల్‌ఎంటి కానీ కేవలం 1.70 ఎల్‌ఎంటిలు మాత్రమే కేటాయించబడిందని, ఈ పరిస్థితి కారణంగా, రైతులు తమ వాస్తవ డిమాండ్లను తీర్చుకోవడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రానికి యూరియా కేటాయింపు, సరఫరాలో విస్తృత అంతరం ఉందని, పత్తి, మొక్కజొన్న, వరి వంటి పంటలు ఎక్కువగా ప్రభావితమయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇటీవలే మిమ్మల్ని కలిసి ఈ కొరత సమస్యపై మీ దృష్టిని తీసుకొచ్చారు, పీక్ సీజన్ లో యూరియా కొరత కారణంగా రాష్ట్రం లోని రైతులు ఎదుర్కొం టున్న ఇబ్బందులను వివరించారు. ఇది రైతులకు గణనీయమైన సవాళ్లను కలిగిస్తుందన్నారు. రాష్ట్రంలో అవసరమైన యూరియా సరఫరా కోసం వారు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కేటాయించిన యూ రియా సరఫరా చేయకపోవడం వల్ల తెలంగాణ మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల రైతులు కూడా ఒత్తిడికి గురవుతున్నారని తెలిసింది. ఫిబ్రవరి 17, 2025 నాటి ఎరువుల కేటాయింపు లేఖ ప్రకారం రైతుల వాస్తవ డిమాండ్లను తీర్చడానికి రాష్ట్రానికి తగినంత యూరియా సరఫరాను ఏర్పాటు చేయాలన్నారు.






# త్యాగమైనా.. పోరాటమైనా మునుగోడు అభివృద్ధే ధ్యేయం

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**సంస్థాన్‌నారాయణపురం, ఆగస్టు 5, ప్రభాతవార్త:** మునుగోడు ప్రాంత ప్రజల అభివృద్ధే తన ధ్యేయమని, అవసరమైతే ఎలాంటి త్యాగానికైనా సిద్ధమేనని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాట్ కామెంట్ చేశారు. సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మగూడెంలో నూతనంగా నిర్మించిన 33/11 సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల కోసం నాడు పదవీ త్యాగం చేసి ప్రభుత్వాన్నే మునుగోడు ప్రాంత ప్రజల కాళ్ల ముందు నిలబెట్టానని, పదవులు తనకు ముఖ్యం కాదని, ఈ ప్రాంత అభివృద్దే ధ్యేయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు మంత్రి పదవి ఇస్తానని చెప్పడంతోనే తాను తిరిగి పార్టీలోకి వచ్చానని, పదవుల కోసం ఎవ్వరి కాళ్ల వద్దకు వెళ్లలేనన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గం మొత్తం సమస్యలకు నిలయంగా మారిందని, తాను ఎమ్మెల్యే అయిన తర్వాత సమస్యలపై దృష్టి సారించి ప్రధాన సమస్యలైన విద్యా, వైద్యం, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుం దన్నారు. నియోజకవర్గంలో మరో 19 సబ్‌స్టేషన్ల నిర్మాణం కోసం ప్రతిపాధనలను సిద్ధం చేశామన్నారు. దీంతో లోఓల్టేజి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. మరో రెండు 132 కెవి సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడంతో నియోజకవర్గం లో పూర్తిగా విద్యుత్ సమస్య పరిష్కారమౌ తుందన్నారు.



తాను ఎమ్మెల్యేగా గెలవడానికి కమ్యూనిస్టులు కీలకమని, అదే విధంగా కమ్యూనిస్టులకు ఎమ్మెల్సీ రావడం కాంగ్రెస్ పార్టీ పాత్ర అంతేనన్నారు. అనకు తడుగా ఎమ్మెల్సీ సత్యం తోడుగా ఉన్నాడని, ఇద్దరం కలిసి మునుగోడు అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. ఎల్‌బి.నగర్ నుంచి పోటీ చేస్తే తనకు మంత్రి పదవి వచ్చేదని, కానీ మునుగోడు ప్రజల అభివృద్ధి కోసమే ఇక్కడికి వచ్చానన్నారు. మునుగోడు ప్రజలకు మంచి రోజులు రాబోతున్నాయని, మొదటి విడతలో ప్రభుత్వ నిబంధనలతో అందరికి ఇండ్లు రాలేదని, అర్హులందరికీ ఇళ్లు ఇప్పిస్తామన్నారు. బిఆర్ఎస్‌లో ఒక్క ఇళ్లు కూడా రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజవకర్గంలో 3500 ఇండ్లు మంజూరు అయ్యాయన్నారు. అనంతరం చిమిర్యాల గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డిఓ శేఖర్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఓ ప్రమోద్‌కుమార్ తదితరులున్నారు.

# చిరంజీవి బర్త్‌డే 22న 'త్రిబాణధారి బార్బరిక్' విడుదల



**మెగాస్టార్ చిరంజీవి** పుట్టిన రోజు సందర్భంగా ఆగస్ట్ 22న మా 'త్రిబాణధారి బార్బరిక్ ' చిత్రాన్ని విడుదల చేస్తుండటం ఆనందంగా ఉంది.. రిలీజ్ డేట్ ప్రెస్ మీట్‌లో ప్రముఖ నటుడు సత్య రాజ్‌స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మిస్తున్న చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. ఈ మూవీకి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. పాన్ ఇండియన్ యాక్టర్ సత్య రాజ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రంలో వశిష్ట ఎన్ సింహా, సత్యం రాజేష్, ఉదయభాను, క్రాంతి కిరణ్, సాంచీ రాయ్ వంటి వారు ప్రధాన పాత్రల్ని పోషించారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ క్రమంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో..

సత్య రాజ్ మాట్లాడుతూ,త్రిబాణధారి బార్బరిక్ సినిమాలో పని చేసినందుకు ఆనందంగా ఉంది. మేమంతా కూడా మాదే మెయిన్ పాత్ర అని చెప్పుకోవచ్చు. కానీ ఇందులో కథే మెయిన్ హీరో. డైరెక్టర్ మోహన్, నిర్మాత విజయ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజేష్ వీళ్లే అసలైన బాణాలు. ఈశ్వర్ గారు నాతో డ్యాన్స్ చేయించారు. రమేష్ మా అందరినీ అద్భుతంగా చూపించారు. డబ్బింగ్ చెప్పేటప్పుడు ఇతర సీన్లను కూడా అడిగి చూశాను. కెమెరా యాంగిల్‌తోనే సస్పెన్స్‌ను క్రియేట్ చేశారు. అలా దర్శకుడు, కెమెరామెన్ కలిసి అద్భుతం చేశారు. 70 ఏళ్లు దాటినా కూడా నేను కొత్త కొత్త పాత్రల్ని చేయాలని అనుకుంటున్నాను. రెగ్యులర్ పాత్రల్ని కాకుండా 'బార్బరిక్' లాంటి కొత్త పాత్రల్ని మరిన్ని చేయాలని అనుకుంటున్నాను. నా డియర్ ఫ్రెండ్ మెగాస్టార్ చిరంజీవి బర్త్ డే సందర్భంగా ఆగస్ట్ 22న ఈ చిత్రం విడుదల కాబోతోంది. చిరంజీవి కంప్లీట్ యాక్టర్. ఆయన గొప్ప నటుడు, డ్యాన్సర్, అద్భుతమైన వ్యక్తి. మా మూవీ ఆయన పుట్టిన రోజున రిలీజ్ అవుతుండటం ఆనందంగా ఉంది అని అన్నారు. ఉదయ భాను మాట్లాడుతూ నేనేమీ సినిమాలకు దూరంగా ఉండలేదు. నాకు నచ్చిన పాత్రలు వస్తేనే నటిస్తున్నాను. ఆర్టిస్టులకు ఉండే ఆకలిని తీర్చే పాత్రలో ప్రస్తుతం నటించాను. 'బార్బరిక్' చిత్రంలో ఓ ఛాలెంజింగ్ పాత్రను మోహన్ గారు నాకు ఇచ్చారు. ప్రతీ పాత్రను నేను ప్రాణం పెట్టి పోషిస్తాను. నాకు రాజేష్ మంచి స్నేహితుడు. ఆయన ఏ ప్రాజెక్ట్ చేస్తున్నా కూడా నన్ను కన్విన్స్ చేస్తుంటారు. మోహన్ నెరేట్ చేసినప్పుడు ఆ కథ, ప్రతీ సీన్ నా కంటికి కనిపించింది. మన భాషలో ఇలాంటి చిత్రాలెందుకు రావు? అని అంతా అంటుంటారు. అలాంటి వారిని ఆశ్చర్యపరిచేలా మా చిత్రం ఉంటుంది. విజయ్ పాల్ గారు చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్. ఇలాంటి నిర్మాతలకు సక్సెస్ వస్తే ఇంకెంతో మందిని పైకి తీసుకు వస్తారు. వశిష్ట చాలా మంచి వ్యక్తి. క్రాంతి ఎనర్జీ నెక్స్ట్ లెవెల్లో ఉంటుంది. సాంచీ, మేఘన అందరం కలిసి ఎంతో సరదాగా షూటింగ్ చేశాం. రమేష్ మా అందరినీ చక్కగా చూపించారు. సత్య రాజ్‌తో పని చేయడం మా అదృష్టం. ఆయన ఎంతో ఒదిగి ఉంటారు. ఆయన్నుంచి మేమంతా ఎంతో నేర్చుకున్నాం. ఈ చిత్రం అందరికీ కన్నుల పండువగా ఉంటుంది. అందరూ చూసి ఆదరించండి అని అన్నారు.

వశిష్ట ఎన్ సింహా మాట్లాడుతూ,'త్రిబాణధారి బార్బరిక్' నాకెంతో ప్రత్యేకం. మోహన్ చెప్పిన కథ విన్నప్పుడే టైటిల్ చాలా కొత్తగా అనిపించింది. కథ, స్క్రీన్ ప్లే చాలా బాగా అనిపించింది. ఇది చిన్న సినిమా అని మోహన్ నాకు ఓ కథ చెప్పారు. కానీ సెట్ మీదకు వచ్చిన తరువాత ఇది చిన్న సినిమా కాదని నాకు అర్థమైంది. ఇంత మంచి చిత్రాన్ని ఇచ్చిన మోహన్‌కి థాంక్స్. ఇలాంటి చిత్రాలు అరుదుగా వస్తుంటాయి. నన్ను ఈ మూవీలో చాలా కొత్తగా చూపించారు. ఇందులో ప్రతీ పాత్ర అద్భుతంగా ఉంటుంది. ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. విజయ్ చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్. సత్య రాజ్ గారితో పని చేయడం ఆనందంగా ఉంది. ఉదయ భాను ఆరా నెక్స్ట్ లెవెల్. క్రాంతి, సాంచీ, మేఘన, కార్తికేయ అందరూ అద్భుతంగా నటించారు. ఈశ్వర్ కొరియోగ్రఫీ చాలాకొత్తగా ఉంటుంది. కెమెరామెన్ రమేష్ పని రాక్షసులు. నేను చిరంజీవి అభిమానిని. ఆయన బర్త్ డే సందర్భంగా ఆగస్ట్ 22న ఈ చిత్రం విడుదల కాబోతోంది. అందరూ చూడండి అని అన్నారు..ప్రొడ్యూసర్ విజయ్ పాల్ రెడ్డి అడిదెల మాట్లాడుతూ మా 'బార్బరిక్' చిత్రం ఆగస్ట్ 22న రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి

**యమలీల,** ఘటోత్కచుడులు తరహాలో ఆడియన్స్‌ను థ్రిల్ల్ ఫీలయ్యే సినిమా 'బకాసుర రెస్టారెంట్': దర్శకుడు ఎస్‌జే శివ



'బకాసుర రెస్టారెంట్' అనేది ఇదొకకొత్తజానర్‌తోపాటు కమర్షియల్ ఎక్స్‌పర్‌మెంట్. ఇంతకు ముందు వచ్చిన యమలీల,ఘటోత్కచుడులాఆడియన్స్ థ్రిల్లింగ్‌గా ఫీలయ్యే కథ ఇది. ఇలాంటి కొత్త కథలనే జనాలు ఆదరిస్తారనే నమ్మకం వుంది. మన జీవితంలోకి ఓ తిండిబోతు దెయ్యం వస్తే ఆ తిప్పలు ఎలా ఉంటాయి అనేది కథ. సినిమా మొత్తం కంప్లీట్ ప్యాకేజీలా ఉంటుంది. హారర్ థ్రిల్లర్,కామెడీ, ఎమోషన్ అన్నీ ఉంటాయిఖీ అంటున్నారు దర్శకుడు ఎస్‌జే శివ. ఆయన దర్శకత్వంలో కమెడియన్ ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్', ఈచిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్ ,షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్,ఇతర ముఖ్య పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఆగస్టు 8న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమోతుంది. ఈ సందర్భంగా దర్శకుడు ఎస్‌జే శివతో జరిపిన ఇంటర్వ్యూ ఇది.

## ఆడియన్స్ థ్రిల్‌అయ్యే సినిమా 'బకాసుర రెస్టారెంట్'

**బకాసుర రెస్టారెంట్ ఎలాంటి కథాంశం ?**

బకాసుర ఎంటర్‌టైన్‌మెంట్ అనేది ఒక హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్. ఇప్పటి వరకు తెలుగులో చాలా జోనర్‌లు వచ్చాయి. ఇదొక కొత్త జోనర్. మా సినిమాతోనే ఇంట్రడ్యూస్ చేస్తున్నాం. ఇదొక తిండిబోతు కథ. దానిని నుంచి వచ్చే కామెడీ కాబట్టి హంగర్ కామెడీ అంటున్నాం. ఫైనల్‌గా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడమే మా లక్ష్యం.

**ఈ సినిమాలో హీరోగా కమెడియన్ ప్రవీణ్‌ను తీసుకోవడానికి కారణం ఏమిటి?**

మొదట వేరే హీరోలతో డిస్కస్ చేశాం. కానీ అందరూ సోలో హీరో కథలైతే చేస్తాం అన్నారు. కానీ ఈ కథ అలాంటిది కాదు. ఆ సమయంలోనే ప్రవీణ్ కూడా హీరోగా ఇంట్రడ్యూస్ అయ్యే ప్లానింగ్‌లో వున్నాడని తెలిసి ఆయన్నీ కలిశాం.ఐదుగురు బ్యాచిలర్స్ మధ్య జరిగే కామెడీ కథ ఇది. ఇక ఈ కథ వినగానే ప్రవీణ్ ఈ సినిమాకు కథే హీరో.. తప్పకుండా మనం చేద్దా అన్నాడు.

**ఇది బకాసుర రెస్టారెంట్‌లో జరిగే కథనా?** రెస్టారెంట్ పెట్టడమే కథ. రెస్టారెంట్ పెట్టాలని కలలు కనే ఓ యువకుడి కథ ఇది. ఈ అంశానికి హారర్, థ్రిల్లింగ్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్ అంశాలు జోడించాం. ఇదొక క్లీన్ కామెడీ.. అందరూ ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ చిత్రమిది. **ఇదొక కొత్త జానర్.. ఎక్స్‌పెరిమెంట్ అనుకోవచ్చా?**

నిజమే ఇదొక కొత్తజానర్‌తో పాటు కమర్షియల్ ఎక్స్‌పర్‌మెంట్ అనుకోవచ్చు. **మీ తొలి సినిమా అనుభవం ఎలా ఉంది?** సినిమా తీయడం చాలా టఫ్.. ఇక్కడ సినిమా బిజినెస్‌లో ఎవరైనా కథ ఏమిటి? ఎలా ఉండబోతుంది? అని అడగటం లేదు. ప్యాడింగ్ ఎవరు? ఎంత పెట్టారు? ఎంత ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు అని అడుగుతున్నారు. సినిమా అనేది ఎంటర్‌టైన్‌మెంట్ కానీ దాని గురించి తప్ప అన్నీ అడుగుతున్నారు.

**భవిష్యత్‌లో ఎలాంటి సినిమాలను తీస్తారు?** నాకు విఠలాచార్య లాంటి సినిమాలు అంటే ఇష్టం.

**మీ తదుపరి చిత్రం కూడా మీ బ్యానర్‌లోనే చేస్తారం?** మా ఎస్‌జే బ్యానర్‌లో కొత్త దర్శకులకు మాత్రమే అవకాశం. సో.. నా తదుపరి చిత్రం ఇందులో ఉండదు. ఈ బ్యానర్‌లో వరుసగా సినిమాలు చేస్తాం. **దర్శకుడిగా మీ లక్ష్యం ఏమిటి?**


చాలా తక్కువ వర్కింగ్‌డేస్‌లో సినిమాలు చేయడం అంటే ఇష్టం.. అప్పుడూ అందరూ బాగుంటారు. మా బకాసుర రెస్టారెంట్ ఐదు కోట్ల రూపాయాలతో తీసిన 12 కోట్ల రూపాయాల అవుట్‌పుట్ కనిపిస్తుంది.

# 'ప్రేమలో రెండోసార్లి' లిరికల్ సాంగ్ రిలీజ్



**బి.వేణుగోపాలస్వామి.** చార్టెడ్ అకౌంటెంట్ . చేతుల మీదుగా 'ప్రేమలో రెండోసార్లి లిరికల్ వీడియో విడుదల.సాకేరామయ్య సమర్పణలో సిద్ద క్రియేషన్ బ్యానర్‌లోసత్యమార్క దర్శకత్వంలో, ప్రొడ్యూసర్ సాకే నీరజ లక్ష్మీ నిర్మిస్తున్న చిత్రం 'ప్రేమలో రెండోసార్లి. ఈ చిత్రానికి సంబంధించి లిరికల్ వీడియో సాంగ్ ని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత తీ వేణుగోపాలస్వామి. చార్టెడ్ అకౌంటెంట్. చేతుల మీదుగా 'ప్రేమలో రెండోసార్లి లిరికల్ వీడియో విడుదల చేయడం జరిగినది. ఈ సందర్భంగా తీ వేణుగోపాల స్వామి మాట్లాడుతూ 'ప్రేమలో రెండోసార్లి చిత్ర టైటిల్ చాలా బాగుంది. ఈ జనరేషన్ యువతకు ఈ సినిమా ఎంతో నచ్చుతుందని, ప్రతి ఒక్కరి జీవితంలో ఒకసారి ప్రేమకు దూరమైనప్పుడు ఏదో ఒక సందర్భంలో మరోసారి ప్రేమలో పడడం సహజం కాబట్టి తెలుగు ప్రేక్షకులకు నీ అలరిస్తుందని అన్నారు. సాంగ్స్ చాలా మెలోడీగా ట్రెండింగ్‌గా ఉన్నాయని, కచ్చితంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందని ,మ్యూజిక్ డైరెక్టర్ రమణ సాకే ని అభినందించారు. ఈ సాంగ్ లోనే సినిమా ప్రతిభ,టీం యొక్క కృషి ఎంతగానో తెలుస్తుందని, టీం అందరికి అల్ ది బెస్ట్ చెబుతూ వారిని అభినందించారు. ఈ సినిమా చక్కటి ప్రేక్షకాదరణ పొందుతుందన్న నమ్మకం నాకుంది అన్నారు. హీరో రమణ సాకే గుడ్ లుకింగ్ తో యువతను ఆకర్షించేలా నటించారని ఎన్నో సినిమాల్లో అవకాశం రావాలని టాప్ హీరోల స్థాయికి ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో, మ్యూజిక్ డైరెక్టర్ రమణ సాకే మాట్లాడుతూ, ఈ సినిమాలో 7 సాంగ్స్ ఉన్నాయని, ప్రతి ఒక్కటి సందర్భానికి తగినట్లు చాలా మెలోడీగా వచ్చాయని, సినిమా మ్యూజిక్ మొత్తం ప్రేక్షకులను మంత్రం ముద్దుల్ని చేస్తుందని సినిమా చూసేటప్పుడు ఆడియన్స్ వారిని వారు మరిచిపోయి సినిమాలో లీనమైపోతారని ఆ విధంగా ఈ సినిమా ఎంతో హిట్ అవుతుందని చెప్పారు. ఈ సినిమా నేటి పెద్దలకు పిల్లలకు, యువతీ యువకులకు ,బాగా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా తప్పకుండా మంచి విజయాన్ని అందుకుంటుందన్న నమ్మకం ఉందన్నారు. డైరెక్టర్ సత్యమార్క మాట్లాడుతూ, మా హీరో కొత్త వారు అయినా చాలా బాగా నటించారు. వనిర్మాత సాకే నీరజ లక్ష్మీ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఖర్చు పెట్టారని చెప్పారు, బి వేణుగోపాల స్వామి లిరికల్ వీడియో లాంచ్ చేసి సపోర్టు చేసినందుకు కృతజ్ఞతలు. తెలుపుకున్నారు. ఇందులో నటీ నటులు: హీరో రమణ సాకే, హీరోయిన్ వనిత గౌడ, జబర్దస్త్ శ్రీను, బాబీ, దుర్గారావు, జబర్దస్త్ ఫణి, రాణి, సతీష్ సారపల్లి, చిరంజీవి, విక్టర్,సుజిత్, ప్రదీప్, బి ఎస్ మన్యం, అవ్వరు సురేష్ తదితరులు నటించారు.

# 'మాస్‌జాతర్ణ నుంచి ఓలేఓలే సాంగ్‌అదుర్స్



**విజయ్ దేవరకొండ** మాస్ మహారాజా రవితేజ 'మాస్ జాతర్ణ చిత్రం నుంచి రెండవ గీతం 'ఓలే ఓల్లే విడుదల భీమ్స్ సిసిరోలియో శైలిలో ఉత్సాహభరిత గీతంగా 'ఓలే ఓల్లే తమ ఎనర్జీతో పాటను మరో స్థాయికి తీసుకెళ్ళిన రవితేజ, శ్రీలీల జోడి. మాస్‌మహారాజారవితేజ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక 75వ చిత్రం 'మాస జాతర్ణ. భాను భోగ వరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్ టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. 'మాస్ జాతర్ణ కోసం అందరూ ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను మెప్పించి.. సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేసింది. మొదటి గీతంగా విడుదలైన 'తు మేరా లవర్ణ అందరినీ ఉర్రూతలూ గించింది. ఇప్పుడు రెండవ గీతంగా 'ఓలే ఓల్లేను విడుదల చేసింది చిత్ర బృందం. అందరూ కాలు కదిపేలా ఎంతో ఉత్సాహభరితంగా ఈ గీతముంది. ధమాకా జోడి రవితేజశ్రీలీల తెరపై కనిపిస్తే ఆ సందడే వేరు. 'ఓలే ఓల్లే పాటతో ఈ జోడి మరోసారి ఆకట్టుకుంది. ఇద్దరూ పోటాపోటీగా నర్తించి పాటను మరో స్థాయికి తీసుకెళ్ళారు. రవితేజ తన వింటేజ్ స్టెప్పులతో అలరించారు. శ్రీలీల తన అసాధారణ నృత్య ప్రతిభతో మరోసారి కట్టిపడేశారు. ఇద్దరూ కలిసి ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా తెరపై మెరుపులు మెరిపిస్తున్నారు. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో తనదైన శైలిలో స్వరపరిచిన 'ఓలే ఓల్లే మాస్ రాజా అభిమానులకు, మాస్ ప్రేక్షకులకు విందు భోజనంలా ఉంది. థియేటర్లలో ప్రేక్షకుల చేత.. ఈలలు, చప్పట్లతో స్టెప్పులు వేయించేలా ఎంతో ఉత్సాహభరితంగా ఈ గీతం సాగింది. ఇక ప్రతిభావంతులైన రోహిణి సోరట్ తన గాత్రంతో పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. భాస్కర్ యాదవ్ దాసరి అందించిన సాహిత్యం ఉల్లాసంగా, ఆకర్షణీయంగా ఉంది. పాట యొక్క మూడ్‌కి సరిగ్గా సరిపోయే మాస్ ఫ్లేవర్‌తో ఆయన సాహిత్యం నిండి ఉంది. సంగీతం, సాహిత్యం, గాత్రం అన్నీ చక్కగా కుదిరి.. 'ఓలే ఓలే'ను అదిరిపోయే మాస్ గీతంగా మలిచాయి. దర్శకుడు భాను బోగవరపు.. రవితేజ అభిమానులతో పాటు, మాస్ ప్రేక్షకులు మెచ్చే విధంగా 'మాస్ జాతర'ను మలుస్తున్నారు. పాటల విషయంలోనూ ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

మాస్ రాజా వింటేజ్ వైబ్స్, కమర్షియల్ హంగులతో ఈ చిత్రంతో థియేటర్లలో మాస్ పండుగను తీసుకురాబోతున్నారు. వరుస ఘన విజయాలతో దూసుకుపోతున్న ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్యతో కలిసి 'మాస్ జాతర్ణ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. 'మాస్‌జాతర్ణ సినిమాపై అంచనాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. ఫుల్ మీల్స్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం ఆగస్టు 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. తారాగణం: రవితేజ, శ్రీలీల,దర్శకత్వం: భాను బోగవరపు. నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, సంగీతం: భీమ్స్ సిసిరోలియో,కూర్పు: నవీన్ నూలి,ఛాయాగ్రహణం: విధు అయ్యన్న మాటలు: నందు సవిరిగాన కళా దర్శకత్వం: శ్రీ నాగేంద్ర తంగాల,ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఫణి కె. వర్మసమర్పణ: శ్రీకర స్టూడియోస్ నిర్మాణ సంస్థలు: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, పీఆర్‌ఓ: లక్ష్మీవేణుగోపాల్ .

# 'చిత్రాలయమ్ణ బ్యానర్‌పై కొత్త చిత్రం ప్రారంభం



**.చిత్రాలయం** స్టూడియోస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెంబర్ 3గా వేణు దోనేపూడి నిర్మాతగా కొత్త చిత్రం ప్రారంభం..చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్ మీద ప్రొడక్షన్ నెంబర్ 3గా వేణు దోనేపూడి నిర్మాతగా గుణి మంచికంటి దర్శకత్వంలోఅతిరథ మహారథుల సమక్షములో కొత్త సినిమాను ప్రారంభమైంది. టిను ఆనంద్,ఉపేంద్ర,జార్జ్‌మరియన్,అక్షయ్, విష్ణు, కార్తికేయ,ఆస్తా,మాళవితదితరులు ప్రధాన పాత్రలో రూపొందనున్నఈచిత్ర ప్రారంభోత్సవం ఘనంగాజరిగింది. ఈచిత్రానికి కొండల్ జిన్నా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ఈ కార్యక్రమానికి రమేష్ ప్రసాద్ అక్కినేని, ఆది శేషగిరి రావు ఘట్టమనేని, కేఎస్ రామారావు, డైరెక్టర్ పి. మహేష్ బాబు, కేఎల్ నారాయణ, తమ్మారెడ్డి భరద్వాజ్, పరుచూరి గోపాలకృష్ణ, బి గోపాల్, కోటగిరి వెంకటేశ్వరరావు, మాధవపెద్ది సురేష్, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు వంటి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ముహూర్తపు సన్నివేశానికి రమేష్ ప్రసాద్ అక్కినేని స్క్రిప్ట్‌ను అందించగా.. ఆది శేషగిరి రావు క్లాప్ కొట్టారు. కేఎస్ రామారావు కెమెరా స్విచ్ ఆన్ చేయగా.. మహేష్ బాబు.పి గౌరవ దర్శకత్వం వహించారు. నేపాల్ దేశ రాజవంశానికి చెందిన సమృద్ధి ఈ చిత్రంతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమవుతోంది. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరికొన్ని ఇంట్రెస్టింగ్ అప్‌డేట్స్ తెలియజేస్తామని చిత్ర యూనిట్ తెలియజేసింది.నటీనటులు : టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్, కార్తికేయ, అభినవ్, హర్ష, కిషోర్ కృష్ణ, ఆస్తా, మాళవి, సమృద్ధి, విష్ణు ఓయ్, కె.ఎల్.దామోదర్ ప్రసాద్, అనీష్ కురివిల్లా, కాదంబరి కిరణ్ తదితరులు. సాంకేతిక బృందం : బ్యానర్ : చిత్రాలయం స్టూడియోస్, నిర్మాత : వేణు దోనేపూడి, సహ నిర్మాత : కొండల్ జిన్నా,దర్శకత్వం : గుణి మంచికంటి ,సంగీతం : స్టీఫెన్, ఆనంద్,ఆర్ట్ : సాహి సురేష్, ఎడిటింగ్ : విజయ్ ముక్తవరపు, కెమెరామెన్ : అజయ్ అబ్రహం, జార్జ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వైశాఖ్ నాయర్‌కో డైరెక్టర్ : కిషోర్,కాస్ట్యూమ్స్ : ప్రియాంక, కొరియోగ్రఫీ : జెడి. మాస్టర్, యాక్షన్స్, నటరాజ్, పి.ఆర్.ఒ : మోహన్ తుమ్మల.

# 'ఆశికా రంగనాథ్' బర్త్ డే స్పెషల్



**టాలీవుడ్ లెజెండరి** హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న అవైటెడ్ విజువల్ వండర్ చిత్రమే "విశ్వంభర". యువ దర్శకుడు వశిష్ఠ తెరకెక్కించిన ఈ భారీ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ సినిమాలో మెగాస్టార్ సరసన ఇద్దరు హీరోయిన్స్ త్రిషఅలాగే ఆషిక రంగనాథ్‌లు నటిస్తుండగా నేడు ఆషిక బర్త్ డే కానుకగా మేకర్స్ ఓ స్పెషల్ పోస్టర్‌ని విడుదల చేయడం జరిగింది. రి ఈ సినిమాలో ఆషిక లుక్ మాత్రం ఎంతో అందంగా చూసేందుకు ముచ్చటగా కనిపిస్తుందని చెప్పాలి. దీనితో అభిమానులు కూడా ఈ పోస్టర్ చూసి ఆషిక అందానికి ముగ్ధులు అవుతున్నారు.

అలాగే అతి త్వరలోనే సినిమా విడుదల చేస్తున్నట్టు తెలిపారు.

# ఆగస్టు 15న స్ట్రీమింగ్
## జె.ఎస్‌కె జానకి వర్సస్ స్టేట్ ఆఫ్‌కేరళ



జీ5లో ఇండిపెండెన్స్ డే సందర్భంగా పవర్ ఫుల్ లీగల్ డ్రామా 'జె.ఎస్.కె జానకి వి వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ్ణ ఆగస్టు 15 నుంచి స్ట్రీమింగ్.. భారత దేశంలోని అతిపెద్ద స్వదేశీ ఓటిటి ప్లాట్‌ఫారమ్ అయిన 5 2025లో మరో సూపర్‌హిట్ ప్రీమియర్‌తో ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. సంక్రాంతికి వస్తున్నం, రాబిన్‌హుడ్, భైరవం వంటి వరుస తెలుగు సూపర్‌హిట్‌లను అందించిన తర్వాత జీ5 తెలుగు ఇప్పుడు మరో అద్భుతమైన సినిమాను అందించబోతోంది. విమర్శకుల ప్రశంసలు పొందిన మాలీవుడ్ లీగల్ డ్రామా 'జె.ఎస్.కె జానకి వర్సస్‌స్టేట్ ఆఫ్ కేరళ్ణ తెలుగు ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధంగా ఉన్న ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళ, కన్నడ, హిందీ భాషలలో స్ట్రీమింగ్ కానుంది.సురేష్ గోపి, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన జె.ఎస్.కె మూవీకి ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహించగా.. కాస్మోస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రి. ఫణీంద్ర కుమార్ నిర్మించారు. ఈ చిత్రంలో గిరీష్ నారాయణన్ స్వరపరిచిన పాటలు, గిబ్రాన్ అద్భుతమైన నేపథ్య సంగీతం స్పెషల్ అట్రాక్షన్ కానున్నాయి. ఈ చిత్రానికి రెనదివే సినిమాటోగ్రఫీ అందించారు. ఈ ఆగస్టు 15న 'జె.ఎస్.కె జానకివర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ ప్రత్యేక డిజిటల్ ప్రీమియర్‌ను జీ5లో మాత్రమే చూడండి. ఈ స్వాతంత్ర్య దినోత్సవం, ఈ వీకెండ్‌ను ఉత్కంఠభరితమైన కోర్టు డ్రామాతో ఎంజాయ్ చేయండి. ప్రఖ్యాత న్యాయవాది డేవిడ్ అబెల్ డోనోవన్ (సురేష్ గోపి) సహాయంతో లైంగిక వేధింపుల నుండి బయటపడిన జానకి విద్యాధరన్ (అనుపమ పరమేశ్వరన్) చుట్టూ ఈ కథ తిరుగుతుంది.జీ512 భాషల్లో అత్యద్భుతమైన కంటెంట్‌ని ప్రేక్షకులకు అందించగలుగుతోంది.

# సు ఫ్రమ్ స్లో ఎంటర్‌ట్రైనింగ్ ట్రైలర్



2**019మైత్రి మూవీ మేకర్స్** 'సు ఫ్రమ్ స్లో'ఎంటర్‌టైనింగ్ రైడ్ ట్రైలర్ రిలీజ్‌లేటెస్ట్ కన్నడ బ్లాక్ బస్టర్ 'సు ఫ్రం స్లో ఇప్పుడు తెలుగు ప్రేక్షకులుని ఆలరించడానికి రెడీ అయ్యింది. మంచి కంటెంట్ కి మద్దతుగా నిలిచే మైత్రీ మూవీ మేకర్స్ ఈ రూరల్ కామెడీ హారర్ సినిమాని ఆగస్ట్ 8న రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు. జెపీ తుమినాడ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలుగు ట్రైలర్ రిలీజ్ అయ్యింది.

గ్రామీణ జానపద కథలు, మూఢనమ్మకాలు, హిలేరియస్ కామెడీ – ఇవన్నీ మిక్స్ అయ్యి వినోదాత్మక ప్రయాణమే సు ఫ్రం సో. కథ ఓ పల్లెటూర్లో జరుగుతున్న విచిత్ర సంఘటనల చుట్టూ తిరుగుతుంది. ఆ గ్రామానికి 'సోమేశ్వర్ణ నుంచి వచ్చిన సులోచన కారణంగా ఊరు మొత్తం గందరగోళంలో పడుతుంది.

ఆ తర్వాత నవ్వుల హంగామా మొదలవుతుంది. ఈ సినిమాలో శనీల్ గౌతమ్ ఎనర్జిటిక్ పాత్రలో అలరించారు. శాంధ్య ఆరకెరె, జెపీ తుమినాడ్, ప్రకాశ్ తుమినాడ్, రాజ్ బి శెట్టి (కోప్రొడ్యూసర్ ) పాత్రలు కూడా ఆకట్టుకున్నాయి.

'సుఫ్రం సో రెగ్యులర్ హారర్ కామెడీల్లా కాకుండా గమ్మత్తైన రైటింగ్, అలరించే పాత్రలు, మంచి హాస్యంతో ఆకట్టుకునే సినిమా. ఎస్. చంద్రశేఖరన్ సినిమాటోగ్రఫీ ఆ ఊరి అందాన్ని చూపిస్తే, సుమేధ్ కె, సందీప్ తులసిదాస్ అందించిన సంగీతం సినిమాకి మరింత జోష్ తీసుకొస్తుంది.ఈ ఆగస్ట్ 8న తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమా నవ్వులు ప్రయాణం కాబోతోంది.తారాగణం: షనీల్ గౌతమ్, జెపి తుమినాడ్, సంధ్య అరకెరె, ప్రకాష్ కె తుమినాడు, దీపక్ రాయ్ పనాజే, మైమ్ రాందాస్.సాంకేతిక సిబ్బంది:రచన, దర్శకత్వం : జెపి తుమినాడ్,నిర్మాతలు: శశిధర్ శెట్టి, బరోడా, రవి రాయ్ కలస, రాజ్ బి శెట్టితెలుగు రిలీజ్: మైత్రి మూవీ మేకర్స్,డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ :ఎస్.చంద్రశేఖరన్‌సంగీతం : సుమేద్ కె బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: సందీప్ తులసీదాస్‌పిఆర్‌ఒ: వంశీ శేఖర్,మార్కెటింగ్ : ఫస్ట్ షో.



వర్షాకాలంలో చాలామంది జబ్బు పడుతుంటారు. ఇందుకు వాతావరణంలో జరిగే మార్పులే కాదు. మనం తీసుకునే ఆహారం కూడా ఓ కారణమే అంటూన్నరు నిపుణులు. జీర్ణక్రియ మందకొడిగా ఉండే ఈ కాలంలో తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం మంచిదంటూన్నరు. మరి, ఈకాలంలో ఫుడ్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం..

**ఫ్రైడ్ ఫుడ్.. వద్దు !.....** వర్షాకాలంలో నూనెలో వేయించిన పదార్థాలు, ఫ్రైడ్ ఫుడ్స్ మంచివి కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఈ కాలంలో వాతావరణంలో తేమ పెరిగి జీర్ణ వ్యవస్థపనితీరు మందగిస్తుంది. కాబట్టి ఈ సమయంలో నూనె సంబంధిత పదార్థాలు తినడం వల్ల అవి తొందరగా జీర్ణం కావు. ఫలితంగా జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. అంతేకాదు.. ఇలాంటి అనారోగ్యపూరిత ఆహారం బరువు పెరిగేలా చేసి ఇతర అనారోగ్యాలకూ దారితీస్తుంది. అందుకే వీటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

**ఇవి తొనద్దు !.......** అలాగే వర్షాకాలంలో బయట దొరికే చాట్, పానీపూరీ, కట్‌లెట్, పావ్‌బాజీ, వంటి పదార్థాలు తినడం వల్ల విరేచనాలు, పచ్చకామెర్లు.. వంటి సమస్యలు రావచ్చంటున్నారు నిపుణులు. ఇందుకు వాటి తయారీలో వాడే కలుషితమైన నీరే కారణం. అలాగే వీటితో పాటు బయట దొరికే పండ్ల రసాలకు కూడా దూరంగా ఉండాలి. అంతగా కావాలనుకుంటే ఇంట్లో స్వయంగా తయారుచేసుకొని తీసుకోవాలి.

**కడిగాకే తినాలి...** ఆకుకూరలు మట్టిలో మొలకెత్తుతాయి. వీటిని నేరుగా భూమిలోంచి తీసి కట్టలు కట్టి అమ్ముతుంటారు. ఈ క్రమంలో మట్టిలోని క్రిములు, పురుగులు ఈ ఆకులపై చేరతాయి. ఆకుల రంగులోనే కలిసిపోయిన ఈ పురుగుల్ని కనిపించ కుండా ఆకుల్ని అలగె కట్‌చేసి తీసుకోవడం వల్ల నక్రిములు కడుపులోకి చేరతాయి. కాబట్టి ఒక్కో ఆకు పరిశిలించకే తరుక్కోవాలి. అలాగే శుభ్రంగా కడిగాకే వండుకోవాలి. భూమిలో మొలకెత్తే పుట్టగొడుగులు, దుంపలకూ ఇది వర్తిస్తుంది.

**కావాల్సినప్పడే...** ఆఫీసులకు వెళ్లే మహిళలు పండ్లు, కూరగాయలు ముందురోజు రాత్రే కట్‌చేసుకొని పెట్టుకుంటారు. అయితే వర్షాకాలంలో ఈ పద్ధతి మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎదుకంటే కట్ చేసుకొని పెట్టుకున్న పండ్లు, కాయగూరల ముక్కల్ని ఎంత జాగ్రత్తగా భద్రపరచినా.. ఈ కాలంలో వాతావరణంలో తేమ అధికంగా ఉండడం వల్ల వాటిపై బ్యాక్టీరియా చేరే అవకాశం ఉంటుంది. వీటిని అలాగే తీసుకోవడం వల్ల లేనిపోనీ ఆరోగ్య సమస్యలొస్తాయి. కాబట్టి వీటిని ఎప్పటికప్పుడే కట్ చేసుకోవడం మంచిది.

**మాంసాహారం...** ఈ కాలంలో మాంసాహారం ఎక్కువగా తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో జీర్ణవ్యవస్థ పనితీరు నెమ్మదించడమే ఇందుకు కారణం. కాబట్టి వానాకాలంలో వీటికి సాధ్యమైనత దూరంగా ఉండడమే మేలంటున్నారు నిపుణులు ఇక చేపలు, రొయ్యలు.. వంటి సీఫుడ్‌ని సైతం దూరం పెట్టేయడమే మంచిదంటున్నారు.

# ఈ కాలంలో ఏం తినాలి? ఏం తినకూడదు?





# ఆర్థిక స్థిరత్వం చాలా ముఖ్యం




**ఆ ఇంట్లోవాళ్లు కోడికూతతో నిద్రలేస్తారు. లేగదూడలతో దోస్తీ చేస్తారు, ఉడుతలతో ఆటలాడుతారు. వీళ్లుండేది ఏదో మారుమూల ప్రాంతంలో కాదు, ఆధునికత అందినంత కాలంలోనే ఉన్నా, వద్దనుకుని ప్రకృతి జీవనాన్ని ఎంచుకుంది శ్రావణ లక్ష్మి కుటుంబం! ఆ ప్రయాణం గురించి తెలుసుకుందాం..**

మేం ఉంటున్నది బాపట్ల జిల్లా, మార్టూరు దగ్గరలోని బొబ్బేపల్లిలో, ఇరుగుపొరుగు ఎవరూ లేరు. అందుకంటే మేం ఇల్లు కట్టుకున్నది పొలాల మధ్యలో. కాలుష్యానికీ, రణగొణ ధ్వనులకు రంగా ప్రకృతి ఒడిలో బతకాలన్న ఉద్దేశ్యంతో ఈ ప్రదర్శనను ఎంచుకోవచ్చు. మా సొంతూరు గుంటూరు దగ్గర్లోని కాకుమాను. ఎంబీఏ పూర్తయ్యాక హైదరాబాద్‌లో ఉద్యోగం చేశా. 2016లో వెళ్లింది. మావారు జీవీ ప్రభుత్వోద్యోగి, ఆయన ఉద్యోగరీత్యా అప్పట్లో ప్రకాశం జిల్లాలో ఉండేవాళ్లం. మా పెద్దబ్బాయికి ఏడు నెలల తర్వాత ఫిట్స్ వచ్చాయి. హాస్పిటల్లో ఉండటం, విపరీతంగా మందులు వాడటం, బాబు చేతికి సూదులు... ఆ అనుభవం నా ఆలోచనల్ని మార్చేసింది. ఉన్నది ఒక్కటే జీవితం... బతకాల్సిన విధానం ఇది కాదనిపించింది. పిల్లలకు ఆరోగ్యకరమైన పాలైనా ఇవ్వలేకపోతున్నామని... పుంగనూరు ఆవు కొన్నాను. ఆ తర్వాత నా ఆలోచనలకు కొత్త రెక్కలు వచ్చాయి. రెండోవాడు పుట్టాక జీవన విధానమే అమరిపోవాలనుకున్నా. మరో 20 ఏళ్లకూ కాలుష్యం చేరని ప్రాంతంలో నివాసం ఏర్పాటుచేసుకోవాలనుకున్నా. మావారు పెద్దగా అభ్యంతరం చెప్పలేదు కానీ, అమ్మానాన్న, అత్తమామ వ్యతిరేకించారు.

**మొండి పట్టు వీడితేగా!**

ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో స్థలం తీసుకుని, ఇల్లు కట్టుకున్నాం. ముగ్గురు పిల్లలతోపాటు నాలుగేళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. మొదట్లో కనీస సౌకర్యాలకూ ఇబ్బందే. క్రమంగా ఒక్కోటీ సమకూర్చుకుంటూ వచ్చాం. పండ్లూ, కూరగాయాలూ ఇక్కడే... ప్రకృతిలో బతకడం అంటే కిటికీ దగ్గరో, బాల్కనీలోనో కూర్చొని పరిసరాల్ని చూటం కాదు. ఆ జీవనశైలినీ భాగం చేసుకోవాలి. సూర్యోదయానికి ముందే మొదలై, సూర్యాస్తమయంతో మా రోజు ముగుస్తుంది. ప్రకృతితోనే చుట్టరికం, మూగజీవాలతోనే నేస్తరికం. రసాయనాలుండే బూత్‌పేస్ట్‌ని పొద్దున్నే నోట్లో పెట్టడడం ఎందుకు? బదులుగా ఆవు కచ్చిక, వేప పుల్లని ఉపయోగిస్తాం. సబ్బులూ, షాంపూలూ నిషేధమే. నేనే రోజూ వాకిలి ఊడ్చి, కల్లాపి చల్లి, ముగ్గుపెడతా. పేడ తీస్తా, పశువులకు దాణా పెడతా, పాలు పితుకుతా, వంట చేస్తా దీన్లో శారీరక శ్రమ ఉంటుంది. అయినా భయపడను. మొదట్లో ప్రకృతి నన్ను పరీక్షించింది. దాన్లో నిలిచి గెలిచాను, పిల్లల్ని ఈ ఊళ్లోనే ప్రభుత్వ స్కూల్లో చదివిస్తున్నా. వాళ్లు చేతనైన పనులువాటినే ఇస్తాను.



అందుకు ఆహార వనం సృష్టించు కుంటున్నాం. మామిడి, అరటి, జామ, సపోటా, ఈత సహా 20 రకాల పండ్ల చెట్లు ఉన్నాయి పది రకాల కూరగాయల్నీ పండిస్తాం. మొక్కలంటే మావారికీ ఇష్టం. భిన్న రకాలను తెస్తుంటారు. 100 వరకూ నాటుకోళ్లు, పది ఆవులు ఆరు ఎద్దులు, బాతులు, కుందేళ్లు ఉన్నాయి. వీటికితోడు వందల పక్షులు అతిథులుగా వస్తాయి. బియ్యం, పప్పులు మాత్రం బయటకొంటాం. వాటినీ పండించాలనేది నా లక్ష్యం. ఆహారంలో నూనెకూ ప్రాధాన్యం ఉంది. అందుకే ఎద్దుగానుగ ఏర్పాటుచేసుకుని సొంత తయారీ మొదలుపట్టా. మా పిల్లలకు 20 ఏళువచ్చేంతవరకైనా ఈ వాతావరణంలోనే పెంచుతా. తర్వాత ఏం చేయాలి, ఎక్కడ ఉండాలన్నది వాళ్ల ఇష్టం నేనైతే వాళ్లని రైతుల్ని చేయాలనుకుంటున్నా.!

**ఆర్థిక స్థిరత్వం ముఖ్యం..** ఈ ధైర్యం, పట్టుదల ఎక్కణ్నుంచి వచ్చాయని అడుగుతుంటారు చాలామంది. అమ్మానాన్న, అమ్మమ్మల నుంచే వాళ్లు ఏ రోజూ కష్టపడ్డానికి వెనకాడలేదు. అమ్మమ్మకు కూర్చుని తినే అవకాశం ఉన్నా, అందరితోపాటు కష్టపడేది. ప్రకృతి ఒడిలో జీవించాలన్న ఆలోచన చాలామందికి ఉంటుంది. అలాంటివారికి ఈ జీవనవిధానంలో ఉండే సంతృప్తినీ, సాధకబాధకాల్నీ యూట్యూబ్ ఛానెల్‌ద్వారా తెలియజేస్తున్నా. ఇలా ఉండాలనుకునేవాళ్లు ఒకరిపైన ఆధారపడకుండా పనులన్నీ చేయడానికి సిద్ధపడాలి. మూగజీవాలకు ఏలోటు రాకుండా చూడాలి. ఆర్థిక స్థిరత్వమూ చాలా ముఖ్యం. □

**చెలి చిట్కా**

మైదా పిండి గోధుమ పిండికీ పురుగు పట్టకుండా ఉండా లంటే నాలుగు చెమ్చాల ఉప్పును శుభ్రమైన బట్టలో మూటకట్టి పిండి డబ్బాలో వేయండి. □

# తలలో పూల రబ్బరు బ్యాండు !



పూలంటే ఇష్టపడని మగువ ఉంటారా చెప్పండి! కానీ, తీరిక లేకో, కార్పొరేట్ వస్త్రధారణకు నప్పకో పూలు పెట్టుకోవడం తగ్గించేశారు చాలామంది యువత. కానీ, సంప్రదాయంగా చీరకట్టో, లంగా ఓణీ ధరించాక పూలు పెట్టకుండా జుట్టుని వదిలేస్తే ఎబ్బెట్టుగా ఉండదూ! అలాంటి సందర్భాల చక్కగా జడ అల్లి ఓ చిన్న పువ్వు అయినా తలలో తురిమి.. మురిసిపోయిన అమ్మ గుర్తొచ్చేస్తుంది. అలాగని మనమే కొనుక్కుందామంటే పొద్దున్నే అంత తీరికెక్కడిది? పైగా ప్రయాణాలు, మీటింగ్‌లూ.. ఇలా మనం తిరిగే హడావుడికి ఇట్టే వాడిపోతాయి. ఇక, మీకా బెంగ అక్కర్లేదు. ఇలాంటి వారికోసమే రబ్బరు బ్యాండ్ల రూపంలో ఆర్టిఫిషియల్ పూల మాలలు వచ్చేశాయి. జడ అల్లుకున్నా, పోనీ వేసుకున్నా, కొప్పు పెట్టుకున్నా.. దీంతో బిగించేయండి రాలిపోతాయనో, వాడిపోతాయనో భయమూ అక్కర్లేదు. బాగుంది కదూ! □



# వారికి మొదలవుతుందా ?



పాపకి పదేళ్లు వచ్చాయంటే చాలు.. రజస్వల కావడానికి సిద్ధంగా ఉందని అర్థం. ఈ వయసు నుంచి ఆమెకు పోషకాలన్నీ అందుతున్నాయో లేదో సరిచూసు కోవాలి. అప్పుడే నెలసరి ఇబ్బందులు, గర్భాశయ సమస్యలు, రక్తహీనత, ఎముకలు గుల్లబారడం వంటి సమస్యల బారిన పడకుండా చూసుకోవచ్చు. ఇందుకోసం ఎలాంటి ఆహారం తీసుకోవాలంటే..

**ఇనుము :** ప్రపంచదేశాలతో పోల్చితే మనదేశంలోనే రక్తహీనతతో బాధపడుతోన్న మహిళలు, పిల్లలు ఎక్కువట. ఆడపిల్లల్లో రుతుక్రమం మొదలయ్యాక ఈ ఇబ్బంది తలెత్తకూడదంటే.. వారి ఆహారంలో తప్పనిసరిగా ఇనుము ఉండేలా చూసుకోవాలి. ఫిష్, లివర్ వంటివాటితో పాటు సజ్జలు, రాగులు, ఆకుకూరలు, సెనగలు, ఉలవలు, పల్లీలు, నువ్వులు, కాయగూరలు, పండ్ల నుంచి ఐరన్ అధికమోతాదులో లభిస్తుంది.

**కాల్షియం :** ఇనుము తరవాత ఎక్కువగా అవసరమయ్యే ఖనిజం కాల్షియం. ఇది లోపిస్తే ఎముకలు బలహీనంగా మారతాయి. మూడుపదులు దాటాక, మెనోపాజ్ దశలోనూ.. కీళ్ల సమస్యలు రావొచ్చు. పాలు, పాల సంబంధిత పదార్థాలను తీసుకోవాలి. అవి ఇష్టపడనివారు పెరుగుని ప్రత్యామ్నాయంగా తీసుకోవచ్చు. వీటితో పాటు తాజా ఆకుకూరలు, నువ్వులు, రాగులు, రాజ్మా, వేరు సెనగ పప్పు, పప్పుధాన్యాల నుంచి ఎక్కువగా లభిస్తుంది.

**మేలు చేసే కొవ్వులు :** చాలామంది కొవ్వు పదార్థాల్ని హానికారకం అనుకుంటారు. కానీ వీటిల్లో శరీరానికి మేలు చేసే కొవ్వులూ ఉంటాయి. వీటి అవసరం ఎంతో ఉంటుంది. బిఎంఐ 18 కంటే తక్కువ ఉన్న అమ్మాయిలో పీరియడ్స్ క్రమంగా రాకపోవడానికి కొవ్వుల లోపం కారణమైతే.. స్థూలకాయుల్లో కొవ్వులు ఎక్కువవ్వడం మరో కారణం. కాబట్టి వీటిని తగిన మోతాదులో తీసుకోవాలి. ఈ కొవ్వులు సరిగ్గా ఉంటేనే తీసుకునే ఇతర ఎ,డి,ఇ,కె విటమిన్లను శరీరం స్వీకరిస్తుంది. □

# మెదడుకు మేలుచేసే కొర్రలు

కొర్రబియ్యాన్ని ఫాక్స్ టెయిల్ మిల్లెట్ అంటారు. చిన్నగా నలుసంత ఉంటే వీటిని నక్కతోకతో వోల్చెడు తమాషానే కదూ! ఆడ ఉంచితే ఇది గొప్ప పోషకాహారం. ఇవి తెలుపు, పసుపు రంగుల్లో దొరుకుతాయి. వీటితో జావ, రొట్టెలు, ఇడ్లీలు, గారెలు, ఉప్మా, కిచిడీ, ప్యాక్, సలాడ్, పులావ్, దోక్లా, వెజ్జి బౌల్, లడ్డూ, ఖీర్, హల్వా, ఇలా ఎన్నో వంటకాలు చేసుకోవచ్చు. కొర్రలు ఎంత మేలు చేస్తాయంటే.. వీటిలో ప్రొటీన్లు, క్యాల్షియం, భాస్వరం, మెగ్నీషియం, ఐరన్, పీచు, విటమిన్ బి3, బి6, బి9, బి12 ఉన్నాయి. తింటే, కండరాలు, ఎముకలు పటిష్టంగా ఉంటాయి. హాయిగా నిద్రపడుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణప్రక్రియ బాగుంటుంది. ఇది ప్రో బయాటిక్గా పనిచేస్తుంది. ఊబకాయం రాదు. ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా ఉంటారు. మెదడు పనితీరు మెరుగుపడుతుంది. మధుమేహం నుంచి ఉపశమనం కలుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయి క్రమబద్ధంగా ఉంటుంది. రక్తపోటు అదుపులో ఉంటుంది. కొర్ర ఇడ్లీలు ఇలా..... కొర్రలు కప్పు, మినప్పప్పు అరకప్పు, కాస్త ఉప్పు, అర చెంచా మెంతులు తీసుకోవాలి. కొర్రలు, మినప్పప్పులను ఆరు గంటల పాటు విడివిడిగా నానబెట్టి మెంతులు, ఉప్పు జోడించి గ్రైండ్ చేయాలి. ఈ పిండిని సుమారు పది గంటలు నానబెట్టి ఇడ్లీలు వేసి రోటి పచ్చడి లేదా సాంబార్‌లో తింటే ఎంతో బలం. □



# డైపర్లు వాడుతున్నారా?

**పసి పిల్లలకు డైపర్లు వేయడం ఇప్పుడు అలవాటుగా** మారింది కానీ, ఈ పని దీర్ఘకాలంలో అనేక అనారోగ్యాలకు దారి తీస్తుందంటున్నారు నిపుణులు. పనిఒత్తిడి, అసౌకర్యం తగ్గించుకోవడానికి ఏర్పాటు చేసుకున్న ఈ వెసులుబాటు కాస్తా ఇప్పుడు తప్పనిసరి అలవాటుగా మార్చేశారనీ చెబుతున్నారు. పిల్లలకు నడకవచ్చిన నాటి నుంచే తమంతట తాముగా కాలకృత్యాలు తీర్చుకోవడం క్రమంగా నేర్పాలట. లేదంటే వారికి టాయిలెట్ ట్రెయినింగ్ ఇవ్వడం కష్టమవుతుంది. అలాకాకుండా తాత్కాలికంగా మీ సౌకర్యం కోసం గంటల తరబడి డైపర్లను వేసి ఉంచడం వల్ల చెమట, తడి.. వంటివి చేరి బ్యాక్టీరియా రెట్టింపు అవుతుంది. ఆ తరువాత వాటిని ఎక్కువసేపు తీయకుండా ఉంచేయడం వల్ల యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశమూ ఉంది. అందుకే, గంటా రెండు గంటలు మినహా వాటిని వేయకపోవడమే మేలని సూచిస్తున్నారు. □



# నైపుణ్యాలు పెంచుకుంటున్నారా?



**నైపుణ్యం.. నిరంతర సాధన ఫలితం. అది అకస్మాత్తుగా వచ్చేది కాదు.. అన్నారు అబ్దుల్ కలాం.** చేసే పనిలోనైనా, కెరీర్‌లోనైనా.. వచ్చే మార్పుల్ని గమనిస్తూ.. నైపుణ్యాలను పెంచుకున్నప్పుడే బంగారు భవిష్యత్తు సొంతమవుతుంది. అయితే అలాంటి సాధన చిన్న వయసు నుంచే అలవర్చుకోవాలంటున్నారునిపుణులు. ఇలా సొంతం చేసుకున్న నైపుణ్యాలే మన తరగని ఆస్తులవుతాయని, అవే ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా వ్యక్తిగతంగా, వృత్తిపరంగా మనల్ని ఉన్నతంగా నిలబెడతాయని చెబుతున్నారు.

**మార్పు మంచిదే!....** ప్రస్తుతం మన రోజువారీ జీవితాలే కాదు. కెరీర్ కూడా టెక్నాలజీతో ముడిపడిపోయిందని చెప్పాలి. ఇక భవిష్యత్తులో ఇది మరెంత అడ్వాన్స్‌డ్‌గా మారనుందో ఊహించగలం. ఈ క్రమంలో టెక్నాలజీలో వస్తోన్న కొత్త పోకడల్ని అవపోసన పట్టడం చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు. ఇందుకు మారుతోన్న సాంకేతికతకు అనుగుణంగానే కొత్త కోర్సులు నేర్చుకోవడానికి ఉత్సుకత చూపాలి. ఎలాంటి కొత్త బాధ్యతనైనా అందిపుచ్చుకునే నేర్పును అలవర్చుకోవాలి.

**కమ్యూనికేషన్ ముఖ్యం ....** చాలామందికి నలుగురిలో మాట్లాడాలంటే ఏదో తెలియని బిడియం, భయం ఉంటాయి. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎదగాలనుకునే వారికి ఇవే పెద్ద అవరోధాలుగా మారుతున్నాయంటున్నారు నిపుణులు. పైగా రిమోట్ వర్కింగ్ వాతావరణంలో మీరు మీ బృందంతోనే కాదు.. ఇతర కంపెనీ బృందాలతో, విదేశీ టీమ్‌తోనూ పని/ప్రాజెక్ట్ గురించి మాట్లాడాల్సి రావచ్చు. మీ ఆలోచనల్ని వారితో పంచుకోవాల్సిన అవసరం ఏర్పడవచ్చు. ఇలాంటప్పుడు చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు.. వంటివన్నీ ముందు నుంచే అలవర్చుకోవడం మంచిది.



**విశ్లేషించగలగాలి....** చాలామందికి నలుగురిలో మాట్లాడాలంటే ఏదో తెలియని బిడియం, భయం ఉంటాయి. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎదగాలనుకునే వారికి ఇవే పెద్ద అవరోధాలుగా మారుతున్నాయంటున్నారు నిపుణులు. మీరు మీ బృందంతోనే కాదు. ఇతర బృందాలతో సైతం పని/ప్రాజెక్ట్ గురించి మాట్లాడాల్సి రావచ్చు. మీ ఆలోచనల్ని వారితో పంచుకోవాల్సిన అవసరం ఏర్పడచ్చు. ఇలాంటప్పుడు చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు.. వంటివన్నీ ముందు నుంచే అలవర్చుకోవడం మంచిది.

**పోటీని తట్టుకునేలా...** ఈ రోజుల్లో పోటీ లేని రంగం, కెరీర్ లేదంటే అతిశయోక్తి కాదు. అయితే ఇది భవిష్యత్తులో మరింత తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయని చెబుతున్నారు నిపుణులు. అలాగని భయపడిపోతే ముందుకు సాగలేం. అందుకే ఈ పోటీని తట్టుకొని నిలబడాలంటే.. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి. ఎంచుకున్న రంగంలో పోటీని అధిగమించడానికి అవసరమైన అన్ని నైపుణ్యాలను సొంతం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు మన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. ఈ లక్షణాలు ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా ముందుకు నడిపించడంతో పాటు.. విజయం సాధించేలా చేస్తాయి. □

# గౌతముడి తిరస్కరణ

**సిద్ధార్థుడు వివిధ ప్రాంతాలు తిరుగుతూ** ధర్మబోధలు చేస్తున్నాడు. ఒకరోజు ఓ పిసినారి వ్యాపారి ఇంటి ముందు నిలబడి ఆహారం ఆర్థించగా అతడు పరుష పదజాలంతో దూషించాడు. తథాగతుడు చిరునవ్వుతో వెళ్లిపోయాడు. అలా గౌతముడు వెళ్లి నప్పుడల్లా ఆ వ్యాపారి తిట్టి పంపాడు. బుద్ధుడి ముఖంలో ప్రసన్నత చెదరలేదు. కొన్నాళ్లకు వ్యాపారి ఇంట్లో ఆహారం మిగిలిపోయింది. అది వృథా అవుతుందని బౌద్ధ బిక్షువుల కోసం ఎదురుచూస్తున్నాడతడు. ఎప్పటిలాగానే బుద్ధుడు అతని ఇంటి ముందుకు వచ్చాడు. వ్యాపారి మిగిలిన ఆహారాన్ని తీసుకొచ్చి ఇవ్వబోయాడు. సిద్ధార్థుడు సున్నితంగా తిరస్కరించాడు. ఎందుకు తీసుకోవడంలేదు? అనడిగాడు వ్యాపార. నాకు అవసరం లేదు. నేను తీసుకోలేదు కనుక అది నీ దగ్గరే ఉంది. అలానే ఇన్నాళ్లూ నీ తిట్లూ నిందలనూ కూడా నేను స్వీకరించలేదు కనుక అవి నీ దగ్గరే ఉన్నాయి. అంటూ బదులిచ్చాడు. ఇంతకాలం తానెంత మూర్ఖంగా ప్రవర్తించాడో, కఠిన పద జాలంతో ఎంతమందిని హింసించాడో అర్థమై చింతించాడు వ్యాపారి. ఆ తర్వాతెన్నడూ పిసినారితనం చూపలేదతడు. అడగకుండానే ధనం పంచేవాడు. □



ఆధ్యాత్మికం

# మనసుకెంతో ఆనందం చిట్టి గులాబీలు



చూడచక్కని రంగుల్లో, అందమైన ఆకృతిలో విచ్చుకునే గులాబీ అంటే మనసు పారేసుకోనివారు ఎవరుంటారు చెప్పండి. అందులోనూ అవి గుత్తులు గుత్తులుగా నిరబూస్తుంటే మనసుకెంతో ఆనందం. పైగా ముళ్లూ తక్కువగా ఉంటే మరింత సంతోషం. అలాంటివే ఈ బటన్‌రోజెస్, వీటినే మినియేచర్ గులాబీలని కూడా అంటారు. మరి వీటినెలా పెంచుకోవచ్చో చూద్దామా! చైనా, యూరోపియన్ గులాబీలను సంకరం చేయడం ద్వారా అభివృద్ధి చేసిన రకం... బటన్‌రోజ్. ఈ మినియేచర్ గులాబీకి 1800వ సంవత్సరంలో ప్రాణం పోశారట. తక్కువ కాలంలోనే దాన్ని అందంతో ఎక్కువ ఆదరణ పొందింది. దీన్ని ఎక్కడ పెంచినా ఆ ప్రదేశం అందాన్ని రెట్టింపు చేస్తుంది. తక్కువ ప్రదేశంలోనూ ఇవి చక్కగా ఎదుగుతాయి. అందుకే, వీటిని కంటైనర్ గార్డెన్స్, బాల్కనీలు... కాలి బాటల పక్కన ఎక్కడైనా పెంచుకోవచ్చు. దీనికి మెయింటెనెన్స్ తక్కువ. ఈ బటన్ రోజ్లు 12 అడుగుల ఎత్తు వరకు పెరుగుతాయి. హ్యాంగింగ్ పాట్స్ ఇవి చక్కని ఎంపిక బటన్‌లోజ్ ఆకులు చిన్నగా, నిగనిగలాడుతూ ముదురాకుపచ్చ రంగులో ఉంటాయి. ఎరుపు, గులాబీ, పసుపు, తెలుపు, నారింజ... వంటి రంగుల్లో ఇవి విచ్చుకుంటాయి.

**ఎలా పెంచాలంటే...** గులాబీ బటన్ మొక్కలు ఇంతటి ప్రజాదరణ పొందడానికి ప్రధాన కారణం... వాటి సులువు కావడమే. ఇవి ఆరోగ్యంగా పెరగాలంటే కనీసం 4-6 గంటలు ప్రత్యక్షంగా ప్రసరించేలా చూసుకోవాలి. ఎండ ఎక్కువగా వచ్చే బాల్కనీల్లోనూ పెంచుకోవచ్చు. సారవంతమైన పొడి నేలల్లో వీటిని నాటుకుంటే మేలు. ఆ నేల కోసం ఆ నేలలో కాసిన్ని పటిక నీళ్లు అప్పుడప్పుడూ చల్లుకుంటే సరి. మట్టిలో కాస్త పెర్లైట్ లేదా ఇసుకని, పొటాషియం ఎక్కువగా ఉంటే నెలరోజులకోసారి పూస్తాయి. పూలు పూయడం అయిపోయాక తప్పక ప్రూనింగ్ చేయాలి. వాడిపోయిన పువ్వులనూ ఎప్పటికప్పుడు తీసేయాలి. అప్పుడే పూలతో నిండుగా, ఆరోగ్యంగా ఎదుగుతాయి. □



# టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఘోర పరాభవం



## అత్యల్ప స్కోర్‌కే ఆలౌట్
### 26 రన్స్‌తో టాప్-1లో న్యూజిలాండ్

**న్యూఢిల్లీ:** గత కొన్ని సంవత్సరాలుగా టెస్ట్ క్రికెట్ నాటకీయ పతనాలకు సాక్ష్యంగా నిలిస్తోంది. టెస్ట్ క్రికెట్‌లో పాల్గొనే వివిధ జట్లు దారుణంగా అత్యంత తక్కువ స్కోర్లకే ఆల్‌ఔట్ అయి ఘోర పరాభవాన్ని ఎదుర్కొంటున్నాయి. వెస్టిండీస్ ఇటీవల టెస్ట్ క్రికెట్‌లో రెండవ అత్యల్ప జట్టు స్కోరును రికార్డు స్థాయిలో సాధించింది. దీంతో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లతో పాటు, అపఖ్యాతి పాలైన జట్టు పతనాల జాబితాలో చేరింది. టెస్ట్ క్రికెట్‌లో న్యూజిలాండ్ అత్యల్ప స్కోరు 26 పరుగులకే ఆలౌట్ అయింది. ఇది మార్చి 1955లో ఇంగ్లాండ్‌తో జరిగింది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో జరిగిన మ్యాచ్‌లో కివీస్ జట్టు ఇంగ్లండ్ బౌలింగ్ చేతిలో ఘోర పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ 20పరుగుల తేడాతో గెలిచింది. ఇది టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యల్ప స్కోరు చేసిన జట్లలో అగ్రస్థానానికి చేరింది. ఇక గత నెల (జూలై, 2025) 14వ తేదీన జమైకాలోని సబీనా పార్క్‌లో ఆస్ట్రేలియా చేతిలో 27 పరుగులకే ఆలౌట్ అయిన వెస్టిండీస్ అవాంఛనీయ చరిత్ర సృష్టించింది. మిచెల్ స్టార్క్ ఆరు వికెట్లు పడగొట్టి కరేబియన్ జట్టు పతనానికి దారితీసేలా చేశాడు. ఇది ఇప్పుడు టెస్ట్ క్రికెట్‌లో రెండవ అత్యల్ప స్కోరుగా రికార్డయింది. అలాగే 1896లో గ్కెబె ర్హాలో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 30 రన్స్‌కే దక్షిణాఫ్రికా ఆలౌట్ అయి అవమానకరమైన పతనాన్ని చవిచూసింది. పర్యాటక జట్టు ప్రొటీస్‌ను 288 పరుగుల తేడాతో ఓడించింది. ఇక 1924లో బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో 30 పరుగుల దారుణమైన స్కోరు కారణంగా దక్షిణాఫ్రికా మరోసారి ఈ జాబితాలో చోటు సంపాదించింది. ఇంగ్లాండ్‌తో మళ్లీ తలపడిన దక్షిణాఫ్రికా జట్టు సీమ్ అనుకూల పరిస్థితుల్లో ఇబ్బంది పడి ఇన్నింగ్స్ 18 పరుగుల తేడాతో టెస్టును కోల్పోయింది. ఇది టెస్ట్ క్రికెట్‌లో నాల్గవ అత్యల్ప జట్టు స్కోరుగా నమోదైంది.

1899లో కేప్ టౌన్‌లోని న్యూలాండ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 35 పరుగులకే పరిమితమైన కారణంగా ఈ జాబితాలో మూడోసారి చోటు దక్కించుకుంది. సొంత మైదానంలో ఆధిక్యంలో ఉన్నప్పటికీ, ప్రొటీస్ జట్టు ఇంగ్లండ్ బౌలర్లను ఎదుర్కోలేక 210 పరుగుల తేడాతో పూర్తిగాఓడిపోయింది. టెస్ట్ క్రికెట్ ప్రారంభ సంవత్సరాల్లో ఇంగ్లాండ్ ఆధిపత్యం ఇదే.



## డబ్ల్యూటీసి పాయింట్స్‌లో..
# దూసుకొచ్చిన టీమిండియా
### నాలుగుకు దిగజారిన ఇంగ్లండ్

**న్యూఢిల్లీ:** భారత్, ఇంగ్లాండ్ సిరీస్ తర్వాత డబ్ల్యూటిసి పాయింట్స్ పట్టికలో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌ను డ్రా చేసుకున్న టీమిండియా పాయింట్స్‌లో 46.67 విజయ శాతంతో మూడో ప్లేసుకు దూసుకొచ్చింది. ఇక ఇంగ్లాండ్ నాలుగో ప్లేసుకు పడిపోయింది. ఈ జాబితాలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా, శ్రీలంక రెండో ప్లేసులో నిలిచింది. డబ్ల్యూటిసి తాజా సైకిల్‌లో భారత్ ఐదు టెస్ట్‌లు ఆడగా 2 విజయాలు, 2 ఓటములు, ఒక డ్రా నమోదు చేసి 28 పాయింట్లుతో మూడోస్థానంలో ఉంది. మొత్తంగా 46.67 విజయశాతంతో భారత్ మూడో స్థానంలో ఉంది. స్లో ఓవర్ రేట్ కారణంగా రెండు పాయింట్లు కోల్పోయిన ఇంగ్లాండ్ 43.33 విజయ శాతంతో నాలుగో ప్లేసుకు పడిపోయింది. ఈ జాబితాలో ఆస్ట్రేలియా (100 విజయ శాతం), శ్రీలంక (66.67 విజయశాతం)తో తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. బంగ్లాదేశ్ (16.67), వెస్టిండీస్ (0) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక డబ్ల్యూటిసి సైకిల్‌లో వెస్టిండీస్, దక్షిణాఫ్రికాలతో భారత్ టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లలో భారత్ గెలిస్తే టాప్2లోకి దూసుకొచ్చే అవకాశం ఉంది. వచ్చే ఏడాది టీమిండియా శ్రీలంక, న్యూజిలాండ్‌లో రెండు టెస్ట్ సిరీస్ ఆడనుంది. అందులోనూ గెలిస్తే డబ్ల్యూటిసి ఫైనల్ అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయి. ఈ సైకిల్ చివరి సిరీస్‌లో భారత్ సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌లు ఆడనుంది. మొత్తంగా మిగిలిన 14 మ్యాచ్‌లలో భారత్ నాలుగింటిని మాత్రమే విదేశాల్లో ఆడనుంది. దీంతో ఈసారి డబ్ల్యూటిసి ఫైనల్‌కు భారత్ చేరేందుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయి.



## బాస్కెట్ బాల్ ఆసియా కప్‌లో
# జోర్డాన్ గెలుపు

**న్యూఢిల్లీ:** ఫిబా ఆసియా కప్-2025లో భారత్ తొలిగ్రూప్ మ్యాచ్‌లో జోర్డాన్‌చేతిలో ఓడిపోయింది. టోర్నమెంట్‌లో తమ స్థానాన్ని సంపాదించుకున్న నెల తర్వాత, భారత పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు టోర్నమెంట్ యొక్క గ్రూప్ దశల్లో తిరిగి అడుగుపెట్టింది. రికార్డు స్థాయిలో 16 సార్లు ఛాంపియన్‌గా నిలిచిన చైనా, ఆతిథ్య సౌదీ అరేబియా మరియు జోర్డాన్‌లతో కలిసి భారతదేశం గ్రూప్ సిలో ఉంది. మ్యాచ్‌లో భాగంగా మంగళవారం జెడ్డాలోని కింగ్ అబ్దుల్లా స్పోర్ట్స్ సిటీలో జరిగిన మ్యాచ్‌తో ప్రపంచ 35వ ర్యాంకర్ జోర్డాన్‌తో భారత్ తలపడింది. ఇందులో భాగంగా ప్రారంభ గ్రూప్ సి ఎన్‌కౌంటర్‌లో భారత పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు అదనపు సమయం తర్వాత జోర్డాన్ చేతిలో ఘోరంగా ఓడిపోయింది. 2011 ఆసియా కప్ రజత పతక విజేత డార్ టక్కర్ 30 పాయింట్లుసాధించడంతో స్కాట్‌ఫ్లెమింగ్ జట్టు జోర్డాన్‌చేతిలో 84-91 తేడాతో పరాజయంపాలైంది.

## మహిళల చెస్ ఛాంపియన్‌షిప్..
# వైశాలి ఓటమి



**న్యూఢిల్లీ:** మహిళల స్పీడ్ చెస్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ గ్రాండ్ మాస్టర్ ఆర్ వైశాలి తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో అమెరికన్ ఇంటర్నేషనల్ మాస్టర్ ఆలిస్ లీ చేతిలో ఓడిపోవడంతో భారత గ్రాండ్ మాస్టర్ వైశాలి మహిళల స్పీడ్ చెస్ ఛాంపియన్‌షిప్ 2025 నుండి నిష్క్రమించింది. వైశాలి 5+1 విభాగంలో ఆధిపత్యం చెలాయించింది. మూడు విజయాలు మరియు ఒక డ్రాతో ఆమె 3.5-0.5 ఆధిక్యంలో ఉంది. అయితే, లీ 3+1 విభాగంలో తిరిగి పుంజుకుంది. ఒక డ్రా తర్వాత, ఆమె వరుసగా నాలుగు ఆటలను గెలుచుకుంది. ఆమె చివరి విభాగంలో కూడా 3-2 స్కోరుతో విజయం సాధించి విజయాన్ని నమోదు చేసింది. కాగా అన్ని మ్యాచ్‌లు మూడు విభాగాలుగా కేటాయించారు. ప్రారంభ రౌండ్ మరియు క్వార్టర్ ఫైనల్స్‌లో, ఆటగాళ్ళు 5+1 ఆటలను (ప్రతి కదలికకు ఒక సెకను పెరుగుదలతో 5 నిమిషాల సమయ నియంత్రణ) 45 నిమిషాలు ఆడారు. తరువాత 3+1 ఆటలను 30 నిమిషాలు మరియు చివరకు, 1+1 ఆటలను 15 నిమిషాలు ఆడారు. ఇక సెమీఫైనల్స్, ఫైనల్స్‌లో మిగిలిన పోటీదారులు 75 నిమిషాలు 5+1 ఆటలను ఆ తరువాత 3+1 ఆటలను 50 నిమిషాలు చివరకు, 1+1 ఆటలను 25 నిమిషాలు ఆడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వైశాలి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది.

## గోల్ఫ్ వరల్డ్ టోర్నీలో..
# భన్సాలీ ఛాంపియన్

**న్యూఢిల్లీ:** యుఎస్ గోల్ఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్-2025లో వేదిక భన్సాలీ సంచలన విజయంతో ఛాంపియన్‌గా నిలిచింది. నార్త్ కరోలినాలోని పైన్‌హర్స్ట్ విలేజ్‌లో మంగళవారం జరిగిన ప్రతిష్టాత్మక యుఎస్ గోల్ఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన వేదిక భన్సాలీ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి బాలికల 9 ఏళ్ల వయసు గ్రూప్ టైటిల్‌ను గెలుచుకుంది. బెంగళూరుకు చెందిన ఈ యువతి తన చివరి తొమ్మిది హోల్ రౌండ్‌లో బోగీ లేకుండా 4 అండర్ 32 కార్డ్‌ను సాధించింది. 33-33-32 స్థిరమైన రౌండ్లతో, వేదిక 10అండర్ టోటల్‌ను నమోదు చేసింది. జపాన్‌కు చెందిన ఎమి మినామి కంటే ఒక షాట్ ముందు అమెరికాకు చెందిన ఆడ్రీ జాంగ్ కంటే రెండు స్ట్రోక్‌ల ఆధిక్యంలో ఉంది. భారత్‌కు చెందిన ఐదా తిమ్మయ్య బాలికల 11 విభాగంలో మూడవ స్థానంలో నిలిచింది. ఐదా ముగింపు రౌండ్‌లో 6 అండర్ 66తో షాట్ కొట్టింది, దీనితో ఆమె మూడు రౌండ్ల మొత్తం 7అండర్ (75-68-66)కి చేరుకుంది. ఈ విభాగంలో అమెరికా నుండి బెల్లా సిమోస్ 21-అండర్‌తో ముగించగా, భారత మాజీ క్రికెట్ కెప్టెన్ వెంకటరాఘవన్ మనవరాలు అనన్య వెంకటరాఘవన్ 10-అండర్‌లో రెండవ స్థానంలో నిలిచింది. గత ఏడాది పోడియం ఫినిషర్ అయిన చండీగఢ్‌కు చెందిన నిహాల్ చీమా, బాలుర 8వ విభాగంలో 38-39-35 రౌండ్లు నమోదు చేసి నాల్గవ స్థానంలో నిలిచాడు. ఇక నోయిడాకు చెందిన కబీర్ గోయల్ బాలుర 10 విభాగంలో 72-70-68 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచాడు.

# వాణిజ్యం

# భారత్ ఆర్థికవృద్ధి 6.4 నుంచి 6.7%
### డెల్లాయిట్ ఇండియా విశ్లేషణ

**ముంబై, ఆగస్టు 5:** డెల్లాయిట్ ఇండియా కంపెనీ భారత్ ఆర్థిక వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరంలో 6.4 నుంచి 6.7శాతం మధ్యలో ఉంటుందని అంచనావేసింది. దేశీయంగా ఉన్న వనరులు కొంత మేర పటిష్టపడటంతో పాటు గ్లోబల్ అవకాశాలను మరింత విస్తరించుకోవడం వల్ల భారత్ ఆర్థికవృద్ధి మరింత పెరుగుతుందని డెల్లాయిట్ విశ్లేషించింది. భౌగోళిక అనిశ్చితులను అధిగమించే శక్తిసామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయని, అలాగే వాణిజ్య విస్తరణపై భారత్ మరింత దృష్టిసారించాల్సి ఉంటుందని వెల్లడించింది. వ్యూహాత్మక వాణిజ్య సంప్రదింపులు కొంతమేలు చేస్తాయి. ప్రత్యేకించి గత నెలలో యునైటెడ్ కింగ్‌డమ్‌తో కలిసి చేసిన చర్చలు స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందం జరగడం అలాగే వాణిజ్య ఒప్పందాలకు సంబంధించి అమెరికాతో జరుపుతున్న సంప్రదింపులు కొలిక్కి వస్తున్నాయని, ఈ తరుణంలో భారత్‌లో వాణిజ్య పరంగా మరింత వృద్ధి నమోదవుతుందని వెల్లడించింది. ఆదాయవనరులపరంగాను, జాబ్స్,మార్కెట్‌కు చేరువ కావడం వంటి వాటితో దేశీయంగా డిమాండ్‌కూడా పెరుగుతుందని తెలిపింది. అందువల్లనే భారత్ ఆర్థిక వృద్ధి ఈ ఏడాది 6.4నుంచి 6.7శాతం వరకూ వెళ్లే అవకాశం ఉంటుందని డెల్లాయిట్ అంచనా. గత ఏడాది 6.5 శాతంగా ఉన్న వృద్ధి ఈ సారి మరింత మెరగవుతుందని తెలిపింది. దేశీయంగా ద్రవ్యోల్బణం దిగిరావడం కూడా కొంతమేలు జరుగుతోంది. దేశీయంగా కేంద్రం అమలుచేస్తున్న విధివిధానాలు, అంతర్జాతీయ వాణిజ్య బంధాలు కూడా భారత్ ఆర్థికవృద్ధికి మరింత దోహదం చేస్తాయని చెపుతున్నారు. వినియోగారుల బేస్ పెరగడం, ప్రపంచ స్థాయిలో పోటీపడే వర్క్‌ఫోర్స్ భారత్‌కు మేలైన వనరులని డెల్లాయిట్ ఆర్థికవేత్త రుంకీ మజుందార్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తన వాణిజ్యబేస్‌ను విస్తరించేందుకు భారత్ వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ఇటీవల వాణిజ్య ఒప్పందాలు ఇందుకు దోహదం చేస్తాయి.




కృత్రిమ మేధ, డిజిటల్ పరివర్తనం, సృజనాత్మకతతో కూడి స్టార్టప్‌లు ఆవిర్భావం వంటివి భారత్ ఆర్థికవృద్ధికి దోహదం చేసానతయని డెల్లాయిట్ ఆర్థికవేత్త విశ్లేషించారు. అరుదైన ఖనిజ వనరులు, ప్రత్యేక ఎరువుల పరంగా కొంతమేర సమస్యలు ఎదురయినా భారత్ అధిగమించాల్సి ఉంటుందని తేల్చింది. అందివచ్చిన అవకాశాలతోపాటు దేశీయంగా పటిష్టంగా ఉన్న మూలవనరుల సాయంతో భారత్ ఆర్థికవృద్ధి మరింతగా పెరుగుతుందని, ఎలాంటి అనిశ్చితి పరిస్థితులనైనా అధిగమించ గలిగేస్థాయి భారత్‌కు ఉందని డెల్లాయిట్ విశ్లేషించింది.

# ఆపిల్‌కు భారత్ మంచి మార్కెట్



**వాషింగ్టన్, ఆగస్టు 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చిర్రెత్తించే విషయాన్ని వెల్లడించారు యాపిల్ సీఈఓ టిమ్ కుక్. భారత్‌లో ఫోన్ల తయారీ చేపట్టడంపై ట్రంప్ తన అసహనం వ్యక్తం చేయగా, ఆయన వ్యాఖ్యలను పెడచెవిన పెట్టారు. అమెరికాలో ఈ ఏడాది రెండో త్రైమాసికంలో అమ్ముడైన ఐఫోన్లలో మెజారిటీ ఫోన్లు భారత్‌లో తయారైనవేనని చెప్పారు. ముమ్ముందూ ఆపిల్ తయారీ భారత్‌లో కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఆపిల్ త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ విషయాన్ని వెల్లడించారు. భారత్‌లో ఐఫోన్ల తయారీని చేపట్టడాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తప్పుబట్టిన సంగతి తెలిసిందే. మే నెలలో దోహా పర్యటన సందర్భంగా తన మనసులో మాటను బయట పెట్టారు. భారత్‌లో తయారీ చేపట్టడం తనకే మాత్రం ఇష్టంలేదంటూ టిమ్ కుక్ సమక్షంలోనే చెప్పారు. భారత్‌పై 25 శాతం సుంకాలను విధించారు. అయితే, అందులో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను మినహాయించారు. దీంతో ప్రస్తుతానికి ఐఫోన్లపై టారిఫ్ ఎఫెక్ట్ లేనట్లే. అయితే ముమ్ముందూ పరిస్థితి ఇలానే ఉంటుందని చెప్పలేమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆపిల్ రెండో త్రైమాసిక ఫలితాల సందర్భంగా టిమ్ కుక్ మాట్లాడుతూ, గత త్రైమాసికంలో కొనసాగిన వైఖరే ముమ్ముందూ కొనసాగుతుందని స్పష్టం చేశారు. అమెరికాలో విక్రయమయ్యే ఫోన్లు దాదాపుగా భారత్‌లో తయారైనవే. అమెరికాలో వినియోగించే ఇతర ఆపిల్ ఉత్పత్తులైన మ్యాక్‌బుక్స్, ఐప్యాడ్స్, యాపిల్ వాచ్‌లను వియత్నాంలో తయారుచేస్తున్నాం. ఇతర దేశాలకు చైనా నుంచి ఎగుమతి చేస్తున్నాం అని టిమ్ కుక్ వివరించారు. తయారీపరంగానే కాదు.. ఆదాయం పరంగానూ ఆపిల్‌కు భారత్ కలిసొచ్చింది. ఐఫోన్ల విక్రయం ద్వారా భారత్‌లో రికార్డు రెవెన్యూ వృద్ధి నమోదైందని టిమ్‌కుక్ వెల్లడించారు. భారత్, పశ్చిమాసియా, దక్షిణాసియా, బ్రెజిల్‌లో రెండంకెల వృద్ధి నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా సగటున 10 శాతం వృద్ధి నమోదైందని పేర్కొన్నారు.

# మార్కెట్లకు టారిఫ్ భయాలు..

**ముంబై, ఆగస్టు 5:** దేశీయ మార్కెట్ సూచీలు మంగళవారం నష్టాలను చవి చూశాయి. ట్రంప్ టారిఫ్ భయాలకు తోడు ఆర్‌బీఐ సమీక్షకు ముందు మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో నేటి (ఆగస్టు 5) ట్రేడింగ్‌లో సూచీలు ఒత్తిడికి గురయ్యాయి. సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా పడిపోగా.. నిఫ్టీ 24,700 మార్క్ కోల్పోయింది. ఉదయం 80,946.43 వద్ద నష్టాలతో ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా ఒడుదొడుకుల్లోనే సాగింది. ఒక దశలో 80,554 వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి పడిపోయిన సూచీ చివరకు 308.47 పాయింట్లు తగ్గి 80,710.25 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా 24,59024,733 మధ్య కదలాడింది. మార్కెట్ ముగిసే సమయానికి 73.20 పాయింట్లు కోల్పోయి 24,649.55 వద్ద స్థిరపడింది. టారిఫ్ ఎఫెక్ట్, ముడిచమురు ధరల నేపథ్యంలో రూపాయి విలువ మరింతగా క్షీణిస్తోంది. నేటి ట్రేడింగ్‌లో 15 పైసలు పతనమై 87.81 వద్ద ముగిసింది. నిఫ్టీలో ఇన్ఫోసిస్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు భారీగా నష్టపోయాయి. రష్యా చమురును కొనుగోలు చేస్తే భారత్ పై మరిన్ని సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. సోమవారం రూ.2,566.51 కోట్ల విలువైన ఈక్విటీలను ఎఫ్ఐఐలు విక్ర యించారు. ట్రంప్ టారిఫ్‌ల భయాలతో చమురు, గ్యాస్ రంగ షేర్లు కుదేలయ్యాయి. దాదాపు 1 శాతం మేర కుంగాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు బుధవారం వెలువడనున్నాయి. రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినప్పటికీ.. ప్రస్తుత పరిస్థితుల్లో రేట్ల కోతపై రిజర్వ్ బ్యాంక్ ఆచితూచి వ్యవహరించనుందనే సంకేతాలు కన్పిస్తున్నాయి.



# ఎంజి ఎస్‌యువిలపై రూ.2.30లక్షల డిస్కౌంట్!

**ముంబై, ఆగస్టు 5:** కార్ల తయారీ సంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ భారత్‌లో అడుగుపెట్టి ఆరేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కంపెనీ తన హెక్టార్, హెక్టార్ ప్లస్ ఎస్‌యూవీ మోడళ్లపై డిస్కౌంట్ ప్రకటించింది. ఇది పరిమిత కాల ఆఫర్‌గా కంపెనీ పేర్కొంది. వినియోగదారులు ఎంపిక చేసుకున్న మోడల్, వేరియంట్‌లను బట్టి ఆయా ఎస్‌యూవీలపై గరిష్ఠంగా రూ.2.30 లక్షల వరకు రాయితీలు ఉంటాయని తెలిపింది. 2019లో భారత మార్కెట్లోకి అడుపెట్టిన ఎంజీ హెక్టార్ దేశంలో మొట్టమొదటి ఇంటర్నెట్ కనెక్టెడ్ ఎస్‌యూవీగా పేరు పొందింది. అయితే, తాజా ఆఫర్‌లో భాగంగా హెక్టార్‌లోని అన్ని వేరియంట్లపైనా గణనీయమైన తగ్గింపులను ప్రకటించారు. షార్ప్ ప్రో 1.5 పెట్రోల్ ఎంఎన్‌టీ వేరియంట్‌పై అత్యధికంగా రూ.2.14 లక్షల వరకు ఆఫర్ అందిస్తున్నారు. దీంతో, ఆఫర్ సమయంలో రూ.19 లక్షలకే (ఎక్స్‌షోరూమ్ ధర) లభిస్తుంది. స్నోస్టార్మ్, బ్లాక్‌స్టార్మ్ వేరియంట్ల ధరలపైనా భారీగా డిస్కౌంట్‌లు ప్రకటించింది. అదే సమయంలో బేస్ వేరియంట్ స్టైల్ ట్రిమ్ ధర రూ.25వేలు పెంచడం గమనార్హం. హెక్టార్ ప్లస్6 సీటర్ అన్ని వేరియంట్ల ధరలనూ తగ్గించారు. షార్ప్ ప్రో 1.5 పెట్రోల్ ఎంఎన్‌టీ వేరియంట్‌పై గరిష్ఠంగా రూ.2.30 లక్షల మేర తగ్గింపు ప్రకటించారు.




# ఆల్‌టైమ్ గరిష్టానికి యుపిఐ లావాదేవీలు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ నెల 2న ఒకే రోజులో ఏకంగా 70 కోట్ల లావాదేవీల మైలురాయిని తొలిసారిగా అధిగమించి ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. ఈ పరిణామం భారతదేశాన్ని రియల్ టైమ్ చెల్లింపుల రంగంలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టింది. గత కొన్ని నెలలుగా యూపీఐ వినియోగం శరవేగంగా పెరుగుతోంది. జూన్ నెలలో రోజుకు సగటున 62.8 కోట్ల లావాదేవీలు నమోదు కాగా, కేవలం కొన్ని వారాల్లోనే ఈ సంఖ్య 70 కోట్లు దాటడం విశేషం. కేవలం జులై నెలలోనే 1947 కోట్ల లావాదేవీలు జరగ్గా, వాటిమొత్తం విలువ రూ.25.1 లక్షల కోట్లుగా నమోదైంది. గతేడాదితో పోలిస్తే లావాదేవీల సంఖ్యలో 35 శాతం, విలువలో 22 శాతం వృద్ధి కనిపించింది. భవిష్యత్తులో రోజుకు 100 కోట్ల లావాదేవీలను చేరుకోవడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామని యూపీఐ నిర్వాహక సంస్థ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) పేర్కొంది. సులభమైన వినియోగ విధానం, వ్యాపారుల నుంచి లభిస్తున్న ఆదరణే ఈ వృద్ధికి కారణమని ఎన్‌పీసీఐ తెలిపింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 49.1 కోట్ల మంది వినియోగదారులు, 6.5 కోట్ల మంది వ్యాపారులు యూపీఐని వాడుతున్నారు. మొదలైన ఛార్జీల వసూళ్లు

యూపీఐ ఒకవైపు రికార్డులతో దూసుకెళుతున్నప్పటికీ, మరోవైపు దాని ఉచిత సేవల భవిష్యత్తుపై చర్చ మొదలైంది. దేశంలోని ప్రముఖ ప్రైవేట్ బ్యాంకుల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంక్, ఆగస్టు 1 నుంచి పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు విధించడం ప్రారంభించింది. ఫోన్‌పే, గూగుల్ పే వంటి సంస్థలు జరిపే వ్యాపార లావాదేవీలపై ఈ ఛార్జీలు వర్తిస్తాయి. ఈ ఛార్జీల భారం ప్రస్తుతానికి వినియోగ దారులపై నేరుగా పడనప్పటికీ, ఈ పరిణామం పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ల ఆర్థిక లెక్కలను మార్చే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ బాటలోనే ఇతర బ్యాంకులు కూడా నడిచే సూచనలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# ఇడి ఎదుట హాజరైన అనిల్ అంబానీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ మంగళవారం ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట హాజరయ్యారు. రూ.17వేల కోట్ల రుణ మోసాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ప్రశ్నించేందుకు ఇటీవల దర్యాప్తు సంస్థ ఆయనకు సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో నేడు ఆయన దిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయానికి చేరుకొని అధి కారుల ముందు హాజరయ్యారు. ఈ కేసులో అనిల్ అంబానీ వాంగ్మూలాన్ని ఈడీ నమోదు చేయనుంది. ఇటీవల రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన 50 కంపెనీలకు చెందిన 35 ప్రాంతాల్లో, 25 మంది వ్యక్తులపై ఈడీ సోదాలు నిర్వహించిన అనంతరం.. అనిల్ అంబానీకి సమన్లు జారీ చేసింది. జులై 24 నుంచి మూడు రోజుల పాటు ఈ సోదాలు జరిగాయి. ఇందులో కీలక దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఇక ఇదే కేసులో రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన పలువురు ఎగ్జిక్యూటివ్‌లకు కూడా సమన్లు జారీ అయ్యాయి. అమితాబ్ ఝున్‌ఝున్‌వాలా, సతీశ్‌సేథ్ సహా గ్రూప్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు ఇడి సమన్లు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రా సహా అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు రూ.17వేల కోట్లకు పైగా నిధులను అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇడి ఈ చర్యలు చేపట్టింది. ఇందులో రిలయన్స్ హోమ్‌ఫైనాన్స్ రూ.5,901 కోట్లు, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ రూ.8,226 కోట్లు, రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు సంబంధించి రూ.4,105 కోట్ల రుణాలున్నాయి. ఇప్పటికే అనిల్ అంబానీ దేశం విడిచి వెళ్లకుండా లుకౌట్ సర్క్యులర్ (ఎల్ఒసి)ను కూడా ఇచ్చింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.